ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ చవితి తె.3.55 వరకు, అనంతరం పంచమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 12.44 వరకు, అనంతరం రేవతి; అమృతకాలం: ఉ. 7.45 నుండి 9.25 వరకు; వర్జ్యం: రా. 1.15 నుండి 2.50 వరకు; దుర్ముహూర్తం: మ. 12.24 నుండి 1.12 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక:309•సోమవారం 19 ఫిబ్రవరి 2018 •హైదరాబాద్ * పేజీలు:12+12 •వెల: 5.00•Published from:Hyderabad|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati|Karimnagar|Kurnool|Suryapet|Anantapur|Nellore|Nizamabad

• పీఎన్‌బీ కుంభకోణం

Punjab National Bank

200 డొల్ల కంపెనీలు బినామీ ఆస్తులు

సీబీఐ, ఈడీ దర్యాప్తులో వెలుగుచూస్తున్న నిజాలు

2 లో

డజనుకు పైగా ఆస్తుల జప్తు?

దోషుల్లా ప్రవర్తించకండి

మోడీజీ.. మౌనం వీడండి: రాహుల్



మోసానికి ముద్దుపేరు వజ్రం

అక్రమార్కుల పాలిట కల్పవృక్షం

మనీ లాండరింగ్‌కు దగ్గరి దారి

పీఎన్‌బీ స్కాంలో కొత్తకోణం

2

వజ్రాల వ్యాపారం సాక్షిగా మోసగాళ్ళు సిండికేట్‌గా మారుతున్నారు. పేజ్ త్రీ సొసైటీలో సెలబ్రెటీలుగా చలామణి అవుతూ బ్యాంకులకు కుచ్చుటోపీ పెడుతున్నారు. వజ్రాల వ్యాపారుల మధ్య అపవిత్ర బంధం వెలుగుచూసింది.

హైదరాబాద్‌లో నిర్భయ ఘటన



• రాడ్లతో కొట్టి రేప్
• రెణ్నెళ్ల కింద ఘటన
• ఆలస్యంగా వెలుగులోకి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ తిరుమలగిరిలో నిర్భయ తరహా ఘటన చోటు చేసుకుంది. స్నేహితుని వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న మైనర్ బాలికపై గుర్తు తెలియని వ్యక్తి కిరాతకంగా దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పదో తరగతి చదువుతున్న మిలటరీ జవాను కుమార్తె అమ్ముగూడ వద్ద స్నేహితుడిని కలిసి రైలు పట్టాల సమీపం నుంచి వెళ్తుండగా 8వ పేజీలో...



ఇంటింటికీ ఇంటర్నెట్

ఐటీ కాంగ్రెస్‌లో ఫైబర్ గ్రిడ్ పైలెట్ ప్రాజెక్టు ఆవిష్కరణ

30వేల కిలోమీటర్ల ఆప్టిక్ ఫైబర్ లైన్ ఏర్పాటు పూర్తి

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైబర్‌గ్రిడ్‌తో ఇంటర్నెట్ సేవలు

ఐపీటీవీ ద్వారా ల్యాండ్‌లైన్ ఫోన్, టీవీ ఛానల్స్ ప్రసారం

సామాన్యుడికి చేరువలో సాంకేతిక విప్లవం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ప్రతి ఇంటికి అంతర్జాల(ఇంటర్నెట్) సేవలు అందించే దిశగా మరో కీలక అడుగు పడుతోంది. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు ఇక్కడి హైటెక్స్‌లో జరగనున్న ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సులో అంతర్జాల సేవలకు సంబంధించిన ఫైబర్ గ్రిడ్ పథకం పైలట్ ప్రాజెక్టును ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సదస్సుకు హాజరవుతున్న రెండున్నర వేల ఐటీ ప్రముఖుల సమక్షంలో ఈ ప్రాజెక్టు పనితీరును ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వివరించనున్నారు. ఈ ప్రాజెక్టు పని తీరును, ఐటీ రంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, ఇస్తున్న ప్రోత్సాహకాలను, ఎగుమతుల వివరాలను, ఐటీ, పరిశ్రమల విధానాన్ని మంత్రి ఈ సందర్భంగా వివరించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి తమ ప్రభుత్వం ఎర్రతివాచీ పరుస్తోందని పరిశ్రమల ఏర్పాటుకు ఏకగవాక్ష విధానాన్ని అవలంబించడంతో పాటు దరఖాస్తు చేసిన మూడు వారాల్లోనే అన్ని అనుమతులను ఇస్తున్న విషయాన్ని సదస్సుకు హాజరవుతున్న ప్రతినిధులకు చెప్పనున్నారు. ఇంటింటికి బ్రాడ్‌బాండ్ పథకం 3వ పేజీలో...



ఏప్రిల్ 20నుంచి రైతులకు

పెట్టుబడి చెక్కులు

• 42మందితో త్వరలో రాష్ట్ర సమన్వయ సమితి
• 30జిల్లాలకు వ్యవసాయరంగ నిపుణుల ప్రాతినిథ్యం
• సబ్సిడీతో వరినాటు యంత్రాల పంపిణీకి కసరత్తు
• 25, 26 తేదీల్లో ప్రాంతీయ రైతు సదస్సులు
• తొలుత హైదరాబాద్.. ఆ తర్వాత కరీంనగర్‌లో
• రైతు సమన్వయ సమితిల కార్యాచరణపై సీఎం సమీక్ష
• ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ రూపకల్పనకు ఆదేశాలు

రైతు సమన్వయ సమితుల్లో శాస్త్రవేత్తలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన పెట్టుబడి మద్దతు పథకం అమలుకు కార్యాచరణ సిద్ధమైంది. రైతు సమన్వయ సమితుల నేతృత్వంలోనే ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ మొదటి వారంలో ఖరీఫ్ సీజన్ పొలం పనులు ప్రారంభమవుతున్నందున ఏప్రిల్ 20 నుంచే ఎకరాకు రూ.4వేల చొప్పున పెట్టుబడి రాయితీ నిధుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదేశాలు జారీ చేశారు. ఆలోపే దాదాపు 72లక్షల చెక్కులను ముద్రించి గ్రామస్థాయికి చేర్చాలని సూచించారు. వ్యవసాయ రంగాభివృద్ధికి సంబంధించిన 8వ పేజీలో...



వీడియోకాల్‌లో బాయ్‌ఫ్రెండ్ చూస్తుండగా

• కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బాయ్‌ఫ్రెండ్‌కు వీడియో కాల్ చేసి మరీ ఎంబీఏ చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్య ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపుతోంది. కొంపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. శివశివానీ కాలేజీలో హనీషా చౌదరి ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతోంది. ఆమెది అనంతపురం. దక్షిష్ పటేల్ అనే యువకుడిని ఆమె ప్రేమించింది. ఏం జరిగిందో ఏమో అతనికి చివరి కాల్ చేసి, వీడియోలో అతను చూస్తుండగానే లైవ్‌లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే అతను హాస్టల్‌కు చేరుకుని, విషయం చెప్పి తలుపులను బద్దలు కొట్టి చూడగా ఆమె అపస్మారకస్థితిలో కనిపించింది. ఆమె స్నేహితుల సాయంతో సిగ్మా ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ప్రాణాలు కోల్పోయిందని వైద్యులు స్పష్టం 3వ పేజీలో...

ఆటే... ఆయుధం!



ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది జరిగిన ఆత్మహత్యల్లో 17శాతం భారత్‌లోనే జరిగాయి. ఈ దేశంలో ఆత్మహత్యలకు పాల్పడ్డ ప్రతి ఐదుగురిలో నలుగురు 18నుంచి 45ఏళ్ళ మధ్య వయస్కులే. దేశంలో 4.25కోట్ల మంది మానసిక రుగ్మతలతో ఇబ్బందులకు గురౌతున్నారు. వీరిలో 85శాతం మంది 18నుంచి 60ఏళ్ళ లోపువారే. ప్రపంచంలో మరే దేశంలోనూ లేని ఒత్తిడి భారతీయుల్ని సతమతం చేస్తోంది. ఇందుకు కారణం కొన్ని దశాబ్దాలుగా దేశంలో మారిన జీవన వైఖరితో పాటు చిన్నతనం నుంచి శారీరక, మానసిక దృఢత్వం పెరిగే శిక్షణకు భారతీయులు దూరం కావడమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

• శక్తివంతమైన జాతిగా చైనీయులు • మానసిక దృఢత్వమే వారి పెన్నిధి • ఒత్తిళ్లతో భారతీయులు సతమతం • మార్కులు, ర్యాంకులు, కొలువులపైనే ధ్యాస • ప్రకోపించిన రుగ్మతలతో ఆత్మహత్యలు • దృఢచిత్తానికి క్రీడలే సరైన ఔషధం • చైనా విధానాలను అందిపుచ్చుకోవాలి

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచంలోనే శక్తివంతమైన జాతిగా ఇప్పుడు చైనీయులు గుర్తింపు పొందుతున్నారు. దాదాపు అన్ని రంగాల్లో వారు ప్రత్యేకత చాటుకుంటున్నారు. ఇందుకు కారణం చైనీయుల్లో చిన్నతనం నుంచి క్రీడలు, శారీరక, మానసిక దృఢత్వాల్ని పెంచడమే. రెండేళ్ళ వయస్సు నుంచే పిల్లల్ని పలురకాల క్రీడలవైపు వారు ప్రోత్సహిస్తున్నారు. ముఖ్యంగా స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్ తదితర క్రీడల్లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం కూడా ప్రత్యేక ప్రాంగణాల్ని నెలకొల్పింది. సుశిక్షితులైన తర్ఫీదు పొందిన కోచ్‌లను తగినంత మందిని నియమించింది. చైనీయుల్లో సైనికరంగం పట్ల కూడా చిన్నతనం నుంచి ఆసక్తి పెంచుతున్నారు. చదువుకు సమాంతరంగా వారిని ఈ రంగాల్లో ప్రోత్సహిస్తున్నారు. క్రీడల్ని కేవలం ఆటలుగానే కాకుండా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచేవిధంగా వారిని సుశిక్షితుల్ని చేస్తున్నారు. ఆఖరకు చైనాలో ఒలింపిక్స్ జరుగుతున్నా అక్కడి యువకులు తమ సంప్రదాయ క్రీడలకు మాత్రమే ఆకర్షితులయ్యారు. విదేశీ క్రీడలవైపు ఏమాత్రం మొగ్గుచూపలేదు. అదే భారత్‌కొచ్చేసరికి చూడటం తప్ప ప్రోత్సహించడం కరవైంది. కొంతకాలంగా క్రీడల్ని జూదంగా మార్చేశారు. రెండు దశాబ్దాలుగా ఐటి రంగం జోరందుకోవడంతో ఐదంకెల జీతాలు అవలీలగా లభిస్తున్నాయి. ఇది తల్లిదండ్రుల ఆలోచనా వైఖరిని అనూహ్యంగా ప్రభావితం చేసింది. భారీ జీతభత్యాలందే ఐటి ఉద్యోగాలు లేదా విదేశీ కొలువుల కోసం అవసరమైన విద్యాభ్యాసం వైపు మాత్రమే పిల్లల్ని ప్రోత్సహించడం మొదలైంది. నిత్యం ర్యాంకులు, మార్కులంటూ వేధించడం తప్ప శారీరక, మానసిక పటుత్వాలు పెంచే యోచన కొరవడింది. భారత్‌లో క్రీడలంటే క్రికెట్ మాత్రమే. ఇక్కడి యువత క్రీడల్ని ఆదరించడమంటే క్రికెట్‌ను 3వ పేజీలో...

ఊపిరి తీస్తున్న కాలుష్యం!

హైదరాబాద్‌లో ప్రమాదకర స్థాయిలో వాయుకాలుష్యం

నివారణ చర్యలు తీసుకోవాలంటున్న పర్యావరణవేత్తలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వాయుకాలుష్యంతో తెలుగు రాష్ట్రాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాలు కాలుష్య ముట్టడిలో కొట్టుమిట్టాడుతున్నాయని ఓ సర్వేలో తేలింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఊహించిన దాని కన్నా ఎక్కువగా ఉన్నట్టు తేలింది. ఎయిర్ కొలిప్స్-2 పేరిట గ్రీన్‌పీస్ ఇండియా విడుదల చేసిన రెండో వార్షిక నివేదికలో ఈ సంగతి బయట పడింది. తెలంగాణలోని 11నగరాల్లో కాలుష్యాన్ని నెలవారీగా పరిశీలించి ఈ నివేదిక తయారు చేసింది. ఈ కాలుష్యం కంటికి కనిపించదు.. ఊరికే ఉండదు.. నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి అక్కడే తిష్ట వేస్తుంది. అనారోగ్య సమస్యలకు కారణమయ్యే అతి సూక్ష్మ, దూళికణాలు ప్రమాదకర స్థాయిని దాటాయని పర్యావేరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ 2016లో హైదరాబాద్‌లో కాలుష్య తీవ్రత చాలా ఎక్కువగా పీఎం-10 స్థాయి 117 8వ పేజీలో...



అమ్మ భాషకు ముప్పు



40 భాషల మనుగడ ప్రశ్నార్థకం • ఆంధ్రప్రదేశ్‌లో 2 భాషలది అదే పరిస్థితి

ఆంగ్ల భాష ఆధిపత్యానికి భారతీయ భాషలు అభద్రతా భావనకు లోనవుతున్నాయి. విద్య, వృత్తి, వ్యాపకాల్లో రాణించడం కోసం భారతీయుల్లో అత్యధికులు ఆంగ్లానికి పట్టం కట్టడంతో స్వదేశీ భాషల ఉనికి ప్రమాదంలో పడింది. 40కి పైగా భారతీయ భాషలు లేదా మాండలికాల ఆయువు తీరిపోనుంది అంటూ జనగణన డైరెక్టరేట్ తాజా నివేదిక చేస్తున్న హెచ్చరిక భాషాభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నది. అంతరించేపోయే ప్రమాదంలో పడిన భాషల్లో రెండు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందినవి కావడం గమనార్హం.

న్యూఢిల్లీ: దేశంలో 40కి పైగా భాషలు లేదా మాండలికాలు ప్రమాదంలో పడ్డాయని, అంతరించిపోయే దశ దిశగా సాగుతున్నాయని అధికారులు తెలిపారు. సెనెక్స్ డైరెక్టరేట్ నివేదిక ప్రకారం దేశంలో కనీసం లక్షమందికి పైగా మాట్లాడే 22 షెడ్యూల్డ్ 3వ పేజీలో...

పేదలకు రైల్వే స్వర్ణ కానుక



న్యూఢిల్లీ: రైల్వే రంగంలో నిరుపేదలకు చోటు కల్పించే దిశగా ఆ శాఖ అడుగులు వేస్తున్నది. రాజధాని, శతాబ్ది రైళ్లలో ప్రయాణించే అవకాశం నిరుపేదలకు 3వ పేజీలో...

యాప్ జీవితాన్ని మార్చేసింది!



• మయన్మార్‌లో టెక్నాలజీతో వ్యవసాయం
• ప్రత్యేక యాప్‌తో పంటల సాగు
• వాతావరణం నుంచి ఎరువుల వరకూ సలహాలు • 2011లో గ్రీన్ వే యాప్

మయన్మార్: టెక్నాలజీని వ్యవసాయ రంగంలో వినియోగించుకోవడంలో మయన్మార్ రైతులు ముందడుగు వేస్తున్నారు. టెక్నాలజీ ద్వారా పంటకు వచ్చిన వ్యాధిని గుర్తించి నయం చేసుకుంటున్నారు. శాన్ శాన్ హ్లే ఓ కొత్త యాప్‌ను రూపొందించారు. స్మార్ట్ ఫోన్‌లో దీన్ని ఇన్‌స్టాల్ చేసుకోవడంతో వరికి సోకిన వ్యాధిని ఇట్టే పసిగట్టేయ వచ్చు. ఎలాంటి డబ్బులు చెల్లించకుండా రైతులకు 3వ పేజీలో...



సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఎర్రవల్లిలో ఆయూష్ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామ ప్రజాప్రతినిధులు ప్రగతిభవన్‌లో ఆయనకు ప్రసాదం అందజేశారు.

యాదాద్రిలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

ఘనంగా భేరీ పూజ



యాదగిరికొండ, ప్రభ న్యూస్ : భక్తులు తమ భాగ్యోత్సవాలుగా భావించే యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రెండవ రోజు ఆదివారం బాలాలయంలో ధ్వజారోహన కార్యక్రమాన్ని ఆలయ ఆచార్యులు ఘనంగా నిర్వహించారు. శ్రీ మహా విష్ణు వాహనమైన గరుత్మంతుని చిత్రపటాన్ని ధ్వజ స్తంభం పై అధిరోహించారు. గరుత్మంతునికి ప్రీతి పాత్రమైన పెసర, పుప్పు పదార్థాలతో ముద్దలను తయారు చేశారు. లయానుగుణంగా, రాగబద్ధంగా తప్పెట దరువులు... మంగళ వాయిద్యాలు మారు మోగుతుండగా ఆచార్యులు శ్లోకాలు... మంత్రాలు అలపిస్తుండగా శాస్త్రోక్తంగా గరుఢ ముద్దలకు పూజలు నిర్వహించి ధ్వజ స్తంభం పై ఆరోహణ చేసి గరుత్మంతునికి సమర్పించుకునే నేపథ్యంలో ముద్దలను విసిరారు. ఆ ముద్దలను ప్రసాదంగా స్వీకరించ డానికి భక్తులు, మహిళలు పోటీ పడ్డారు. గరుత్మం తునికి సమర్పించిన ముద్దలను మహిళలు స్వీకరిస్తే సంతాప ప్రాప్తి లభిస్తుందని శాస్త్రం చెబుతుందని భక్తులు విశ్వాసిస్తారు.

ఈ క్రమంలో గరుడ ముద్దలను స్వీకరించడానికి పోటీపడిన విధం ఎంతో ఆసక్తి రేపింది. శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి దృష్టశక్తులు రాకుండా ఉండేందుకు గరుత్మంతున్ని ధ్వజస్తంభంపై అధిరోహించడం సంప్రదాయంగా వస్తోంది. సాయంత్రం ఆలయంలో భేరీ పూజ నిర్వహించి ఆచార్యులు శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరిపేందుకు ముక్కోటి దేవతలను ఆహ్వానించారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించి శ్రీ స్వామి వారిని దర్శించి తరించారు. అనంతరం ఆలయం లో హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. యాజ్ఞికులు సముద్రాల శ్రీనివాసా చార్యులు, ఆలయ ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనర్సింహాచార్యులు, కారంపూడి నర్సింహాచార్యులు, అర్చక బృందం ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ పెద్దలుగా ఆలయ ఈవో ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఏఈవోలు వేముల రాం మోహన్, దోర్బల భాస్కర శర్మ, ఆలయ అధికార, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రిని గెంటేసిన తనయుడు

రాత్రంతా చెట్టు కిందే జాగారం – వైదేహినగర్‌లో ఘటన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : బంధాలు, బాంధ వ్యాలు అడుగంటి పోతున్నాయి. వృద్ధాప్యంలో తమకు ఆసరాగా ఉంటారనుకున్న కొడుకులే వారి పట్ల కనీస కనికరం చూపని విధంగా ప్రవర్తిస్తు న్నారు. కొడు కులే పుట్టాలని పూజలు, వ్రతాలు చేసే తల్లిదండ్రుల సంఖ్య తక్కువేమీ కాదు. కొడుకుల కోసం అంతగా పరితపించడమే కాదు.. వారు పుట్టిన తర్వాత వారి ని సమాజంలో ఓ ఉన్నతస్థానంలో నిలబెట్టేందుకు తమ శక్తిని, యావదాస్తులు పణంగా పెట్టి ఉన్నతుడిని చేస్తే చివరికి కన్నవారినే రోడ్ల పాలు చేసే పుత్రరత్నాల సంఖ్య నానాటికి తీవ్రమవుతోంది. తాజాగా ఇలాంటి హృదయ విదారక ఘటనే భాగ్యనగరంలో చోటు చేసుకుంది. నగరంలోని వైదేహినగర్‌లో ఈ అవమానవీయ ఘటన చోటు చేసుకుంది. తన పెద్ద కొడుకు గణేష్ వద్దకు వచ్చిన తండ్రిని సదరు కొడుకు ఇంట్లోకి రావొద్దని గెంటివేసి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడు. రాత్రంతా ఇంటిముందు చెట్టుకింద పడి ఉన్న తండ్రి మల్లయ్యకు 10 మంది పిల్లలున్నా ఒక్కరూ కూడా చూడకపోవడం గమనార్హం. నల్గొండ జిల్లా పోచంపల్లి మండలం జలాల్ పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి మల్లయ్య. ఆయనకు పది మంది పిల్లలున్నారు. ఐదుగురు కొడుకులు.. ఐదుగురు కుమార్తెలు. శాయశక్తులా వారిని ఉన్నతులను చేయడంలో ఆ తండ్రి పాటు పడ్డాడు. ఇప్పుడు వారంతా ఆర్థికంగా శక్తిమంతమైన స్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో పెద్దకొడుకు వద్దకు వచ్చిన మల్లయ్య తండ్రిని ఇంటికి రావొద్దంటూ బయటికి గెంటేసిన వైనం మనసున్న ప్రతి ఒక్కరి హృదయాన్ని కంటతడి పెట్టిస్తోంది.

ప్రతి ఒక్కరికీ వృద్ధాప్యం వస్తుందన్న విషయాన్ని వారు గమనంలోకి తీసుకోవాలి. తాము తల్లిదండ్రులను ఇప్పుడు నిర్లక్ష్యం వహిస్తే రేపు వారి పిల్లలు తమను ఏ విధంగా చూస్తారన్న సామా జిక స్పృహ తప్పనిసరిగా ఉండాలి. అంతేకాదు, తమ కోసం సర్వం త్యజించి తమను ఉన్నతులుగా చేసిన తల్లిదండ్రులకు తమకిచ్చే గౌరవం ఇది కాదన్న భావన ప్రతి ఒక్కరూ గ్రహించాలి. తల్లిదండ్రులు దైవసమానులన్న విషయాన్ని అనునిత్యం పరిగణనలోనికి తీసుకోవాలి. తల్లిదండ్రులు ఎవరైనా వృద్ధాప్యంలో తమకు ఆసరా ఇచ్చేది కొడుకులేనని భావిస్తారు. మరి వారే వారి పట్ల యమ కింకరులై అవమానవీయంగా ప్రవర్తిస్తే అంతకంటే దారుణం మరొకటి ఉండదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

'డబుల్' ఇళ్లపై జీఎస్టీ పిడుగు

- మా వల్ల కాదని చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు
- భారీగా పెరిగిన స్టీల్ ధరలు
- పక్కదారి పడుతున్న ఉచిత ఇసుక
- నత్తనడకన ఇళ్ల నిర్మాణ పనులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణంపై జీఎస్‌టీ తీవ్ర ప్రభావం చూపుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ మాసం నుంచి దేశ వ్యాప్తంగా ఒకే పన్నుల విధానం (జీఎస్‌టి)ను అమలు చేస్తోంది. దీని ప్రభావం కొన్ని రంగాలపై అధికంగా ఉండడంతో సంబంధిత వస్తువుల, నిర్మాణ ముడిపదార్థాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వాటిల్లో ఇళ్ళ నిర్మాణం కూడా ఒకటి. సమాజంలో పేదలు గౌరవంగా జీవించాలన్న లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇందులో లబ్దిదారుల నుంచి ఒక పైసా తీసుకోకుండా మొత్తం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. పైగా ఈ పనులు చేపట్టే కాంట్రాక్టర్లు పెద్దగా లాభాలను దృష్టిలో పెట్టుకోకుండా నిర్మాణ పనులకు ముందుకు రావాలని అభ్య ర్థించింది. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళను నిర్మించే కాంట్రా క్టర్లుకు ప్రతిగా ఇతర కాంట్రాక్టులకు అప్పగిస్తామని స్పష్టం చేసింది. దీంతో పలువురు కాంట్రాక్టర్లు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను నిర్మించడానికి ముందుకు వచ్చారు. లాభాలు వస్తా యని వారు పెద్దగా ఆశలు కూడా పెట్టుకోలేదు. కనీసం తమ నష్టం వాటిల్లకుండా ఉంటేచాలన్న ఉద్దేశ్యంతో పనులు చేపట్టారు. అయితే కేంద్రం అమలు చేస్తున్న జీఎస్టీ విధానం తో కాంట్రాక్టర్లు పరిస్థితి తారుమారు అవుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన యూనిట్ రేట్ ఆదారంగా ప్రస్తుతం ఇళ్ళ నిర్మాణ పనులు చేపట్టడం భారంగా మారుతోంది. ముఖ్యంగా స్టీల్‌పై టన్నుకు 18శాతం జీఎస్‌టిని చెల్లించాల్సి వస్తోంది. ఇంత పెద్దమొత్తంలో చెల్లించాల్సి రావడంతో ఇళ్ళ నిర్మాణ పనులు తమ వల్ల కాదని కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తు న్నారు. అలాగే నిర్మాణానికి అవసరమైన ఇసుక కూడ సక్రమంగా వారికి సరఫరా కావడం లేదు. దీంతో ఇళ్ళ నిర్మాణ పనులు మరి నత్తనడకన సాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో రానున్న డిసెంబర్ నాటికి గ్రేటర్ పరిధిలో లక్ష ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వరకు నిర్మాణ పనులకు స్థలం సేకరించడం కష్టసాధ్యంగా మారింది. ఆయా ప్రాంతాల్లోని ప్రజలను ఒప్పించడానికి అధికారులకు భగీరథ ప్రయత్నం చేయాల్సి వచ్చింది. దీంతో డబుల్ బెడ్ రూమ్ ప్రాజెక్టు ఇప్పుడిప్పుడే పూర్తి స్థాయిలో పట్టాలెక్కుతున్న దశలో ఇబ్బందులు ఎదురవడంతో నిర్మాణ పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కాగా ఇసుక కొరత, స్టీల్ ధరలు పెరగడంతో మూలిగే నక్కపై తాడిపండు పడిన చందంగా మారింది.

గ్రేటర్‌లో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే 82వేల ఇళ్ళకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. అంతస్తులను బట్టి ఒక్కో యూనిట్‌కు రూ.7.10 లక్షల నుంచి రూ. రూ.7.90 లక్షలు చెల్లిస్తోంది. ఈ ధర కూడా గిట్టుబాటు కాకపోవడంతో రూ. 230లకే సిమెంట్ బస్తా ఇచ్చేలా ఉత్పత్తిదారులను ప్రభుత్వం ఒప్పించింది. అలాగే ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే రవాణా ఛార్జీలను సదరు కాంట్రాక్టర్లు భరించాలన్న నిబంధనలను పెట్టింది. ఇందుకోసం సిరిసిల్లా రాజన్న జిల్లాలోని అన్నెపురం గ్రామం వద్ద ఉన్న ఇసుక క్వారీని ప్రత్యేకంగా నగరంలోని రెండు పడుకల ఇళ్ళ నిర్మాణానికి కేటాయించారు. ఇసుక ధరలు కూడా విపరీతంగా పెరిగిపోవడంతో డబుల్ ఇళ్ళ నిర్మాణం కోసం వినియోగించాల్సిన ఉచిత ఇసుకను కొందరు కాంట్రాక్టర్లు పక్కదారి పట్టిస్తున్నారు. దీనికి కొందరు అధికారులు సైతం అండదండలు అందించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతోనెలన్నర రోజులుగా నగరానికి ఇసుక సరఫరా నిలిచిపోయింది. ఉచిత ఇసుక దారి పడుతోందని గ్రహించిన ఉన్నతాధికారులు సరఫరాలో సమగ్ర విధానాన్ని అమలు చేయాలనినిర్ణయించారు.

మంత్రి కేటీఆర్ సూచన మేరకు సిరిసిల్లా కలెక్టర్ ఒక్కో కాంట్రాక్టర్‌కు ఒక్కో కోడ్ కేటాయించి......ఇక నుంచి ఎప్పుడు ఎంత ఇసుక సరఫరా చేస్తున్నామన్న వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరాచాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎంత ఇసుక ఉపయోగించారన్న వివరాలను సంబంధిత ఇంజనీర్ల ద్వారా ధృవీకరణ పత్రాలను తీసుకరావాలని సూచించారు. లారీల్లో ఓవర్‌లోడ్‌తో ఇసుకను అధికంగా తరలించకుండా అధికారుల పరిశీలనలో వేయింగ్ చేయించనున్నారు. ఇసుక లోడింగ్‌కు సంబంధించిన ఛార్జీలను డీడీ రూపంలో ముందే చెల్లించాలని సూచించారు. దీంతో అక్రమ భాగోతం భయటపడుతుందని భావిస్తోన్న కొందరు కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించలేదు. దీంతో ఇసుక తరలింపులో జాప్యం జరుగుతోంది. కొందరు కాంట్రాక్టర్లు మాత్రం ఇప్పటికే యుటిలైజేషన్ సర్టిఫికెట్ ఇచ్చారని అధికారులు చెబుతున్నారు.కాగా స్టీల్ టన్నుకు రూ. 30వేలు, రూ. 47 నుంచి రూ. 50 వేల వరకు ఉంది. ప్రైస్ ఎస్కులేషన్‌కు అవకాశం లేకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో సిమెంట్ తరహాలోనే నిర్ణీత ధరలకు స్టీల్ సరఫరా చేసేలా ఉత్పత్తిదారులను ఒప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాజాగా జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలోనూ దీనిపై చర్చ జరిగింది. టన్నుకు రూ. 37వేలతో పాటు 18శాతం జీఎస్‌టీ చెల్లించాలని స్టీల్ ఉత్పత్తిదారుల కోరినట్లు తెలిసింది. పరిస్థితిని గ్రహించిన కేటీఆర్ ఇటీవల స్టీల్ ఉత్పత్తి దారులతో సమావేశమయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభు త్వం నిర్ణయించిన యూనిట్ రేట్‌కు ఇళ్ళనిర్మాణం చేపట్టా లంటే తమ వల్లకాదని, ధర పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో సిమెంట్ తరహాలోనే నిర్ణీత ధరలకు స్టీల్ సరఫరా చేసేలా ఉత్పత్తిదారులను ఒప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే దీనిపై సర్కార్ ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అప్పటి వరకు పనులు నత్తనడకన సాగడం తథ్యమని తెలుస్తోంది.



మోసానికి ముద్దు పేరు వజ్రం

- అక్రమార్కుల పాలిట కల్పవృక్షం
- మనీలాండరింగ్‌కు దగ్గరిదారి
- పిఎన్‌బీ కుంభకోణం దర్యాప్తులో కొత్తకోణం

న్యూఢిల్లీ: వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ చేసిన రూ.1.8 బిలియన్ డాలర్ల కుంభకోణానికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ బలిపశువైంది. ఈ కుంభకోణంలో మోడీ మేనమామ, మరో వజ్రాభరణాల వ్యాపారి, గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ పాలుపంచుకోవడం చర్చనీయాంశమైంది. వజ్రం పెట్టుబడిగా వ్యాపారుల మధ్య అపవిత్ర బంధం, చేస్తున్న మోసాలపై సిబిఐ, ఈడీ లాంటి దర్యాప్తు సంస్థలకు తోడు సెబీ సైతం దృష్టిపెట్టింది. స్టాక్ మార్కెట్ బ్రోకర్లతో వీరికి గల అనుబంధాన్ని ఆరా తీస్తున్నది. నీరవ్ మోడీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న కంపెనీల్లో ఫైర్‌స్టార్ డైమండ్ ప్రైవేట్ లిమిటెడ్, ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, రాధాషిర్ జ్యువలరీ కంపెనీ, జ్యువలరీ సొల్యూషన్స్ ఇంటర్నేషనల్ లాంటివి ఉన్నాయి. ఆ క్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మదింపును బ్యాం కింగ్ రెగ్యులేటర్ సెబీ చేపట్టింది. అలాగే వజ్రం, ఆభరణాల వ్యాపారంతో ముడి పడి ఉన్న ఖాతాదారులందరిపై నిఘా పెట్టడానికి అన్ని బ్యాంకులు సన్నాహాలు చేసుకుంటున్నాయి. గతంలోనూ స్టాక్ మార్కెట్ అక్రమాల్లో ఆభరణాల వ్యాపారుల ప్రమేయానికి సంబంధించిన అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. అంతేకాక బ్యాంకులకు రుణాలు ఎగ్గొట్టిన వజ్రాల వ్యాపారులు గతం లోనూ ఉన్నారు. అలాంటి రంగాలకు చెందిన వారికి రుణాలు ఇచ్చేముందు మరింత అప్రమత్తంగా వ్యవహరిం చాలనే ముక్తాయింపునకు బ్యాంకులు చేరుకున్నాయి. అంతేకాక అక్రమ మార్గాల్లో నగదును విదేశాలకు పంపించే మనీ లాండరింగ్ వ్యవహారానికి వజ్రాల వ్యాపారం చేదోడువాదోడుగా ఉంటున్నదని దర్యాప్తు ఏజెన్సీలు భావిస్తున్నాయి.

దోషుల్లా ప్రవర్తించకండి

- నోరు విప్పండి
- పిల్లలకు రెండు గంటలు పాఠాలు
- స్కామ్‌పై రెండు నిముషాలైనా మాట్లాడరు
- ప్రధాని మోడీ, జైట్లీపై రాహుల్ మండిపాటు
- 200 డొల్ల కంపెనీలు, బినామీ ఆస్తులపై ఈడీ, ఐటీ దర్యాప్తు
- డజను స్థిరాస్తుల జప్తునకు రంగం సిద్ధం

పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నేరుగా ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీపై తన అస్త్ర,శస్త్రాలకు మరింత పదును పెట్టారు. కుంభకోణంపై స్పందించకపోవడం ద్వారా దోషుల్లా వ్యవహరించవద్దని వారికి విజ్ఞప్తి చేశారు. ఆర్బీఐ డేటా ప్రకారం గడచిన ఐదేళ్లలో రూ.61,260 కోట్ల మేరకు బ్యాంకింగ్ మోసాలు చోటు చేసుకున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. శ్వేత పత్రానికి డిమాండ్ చేసింది. ఈడీ,ఐటీ శాఖ 200 డొల్ల కంపెనీలు, బినామీ ఆస్తులను గుర్తించాయి. కనీసం రెండు డజన్ల స్థిరాస్తులను జప్తునకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. రూ.20 కోట్ల విలువైన వజ్ర, స్వర్ణాభరణాలను స్వాధీనం చేసుకున్నాయి.

న్యూఢిల్లీ: పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి కనీసం 200 డొల్ల కంపెనీలు, బినామీ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), ఆదాయ పన్ను శాఖ(ఐటీ) దర్యాప్తు చేపట్టాయి. నీరవ్ మోడీ, చోక్సీ కంపెనీల్లో నాల్గవ రోజైన ఆదివారం సోదాలు చేపట్టిన ఈడీ మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పిఎంఎల్‌ఏ) కింద కనీసం రెండు డజను స్థిరాస్తులను జప్తు చేసే దిశగా ముందుకు సాగుతున్నది. ఈడీ ఆదివారం దేశవ్యాప్తంగా ఆభరణాల షోరూమ్‌లు, వర్క్ షాపులను కలుపుకొని కనీసం 45 ప్రాంగణాలపై దాడులు జరిపింది. మోడీ, ఆయన కుటుంబ సభ్యులు, కంపెనీలకు చెంది ఐటీ శాఖ జప్తు చేసిన 29కి పైగా ఆస్తులను పిఎంఎల్‌ఏ కింద ఈడీ మదింపు చేస్తున్నది అని ఈడీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. రూ.20 కోట్ల విలువైన వజ్రం, స్వర్ణాభరణాలను స్వాధీనం చేసుకున్నది అని చెప్పారు. కుంభకోణంలో భాగంగా నిధుల సరఫరా లేదా స్వీకరణ కోసం దేశ, విదేశాల్లో వినియోగించిన దాదాపు 200 డొల్ల కంపెనీలను ఈడీ, ఐటీ శాఖ గుర్తించాయని ఆయన చెప్పారు.



కంపెనీల బ్యాలెన్స్ షీట్ల తనిఖీలో సిబిఐ

మెహుల్ చోక్సీ యాజమాన్యంలో గీతాంజలి గ్రూప్‌కు చెందిన 18 భారత్ కంపెనీల బ్యాలెన్స్ షీట్లను సిబిఐ పరిశీలిస్తున్నది. పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) ద్వారా దఖలు చేయబడిన గ్యారంటీల ఆధారంగా వేర్వేరు బ్యాంకుల నుంచి రూ.11,384 కోట్ల నగదును ఎలా తీసుకున్నది తెలుసుకునేందుకు అలా చేస్తున్నట్టు సిబిఐ అధికారులు ఆదివారమిక్కడ తెలిపారు. కుంభకోణానికి సంబంధించి వేలాది డాక్యుమెంట్లు, డిజిటల్ రికార్డుల కోసం అరెస్టయిన బ్యాంకు అధికారులు గోకుల్‌నాథ్ శెట్టి(రిటైర్డ్), మనోజ్ ఖారత్, నీరవ్ మోడీ కంపెనీ సిగ్నేటరీలతో పాటుగా పిఎన్‌బికి చెందిన ఇతర అధికారులను ఏజెన్సీ ప్రశ్నిస్తున్నట్టు చెప్పారు. ఒక భారీ సెర్వర్ నుంచి రికవరీ చేసిన రికార్డులను సైతం అధ్యయనం చేస్తున్నారు. ప్రస్తుతానికి చోక్సీ, నీరవ్ మోడీ, పిఎన్‌బి అధికారుల కుమ్మక్కు జోలికి పోకుండా కుంభకోణం పరిమాణం, నిధుల బట్వాడా, ఇతర ఉన్నతాధికారుల పాత్రను అర్థం చేసుకోవడంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. షెట్టి గత ఏడు సంవత్సరాలుగా బ్యాంక్ కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌ను పక్కదారి పట్టిస్తూ మోసపూరితంగా ఎల్‌ఓయూలు జారీ చేసినట్టు అభియోగం.

షెట్టి, ఖారత్ స్విఫ్ట్ ద్వారా ఈ ఎల్‌ఓయూలకు సంబంధించిన మెస్సేజ్‌లు పంపించేవారు. పిఎన్‌బి అధికారులు ఎల్‌ఓయూల గురించి బ్యాంకింగ్ సాఫ్ట్‌వేర్‌లో ఎంట్రీలు జరపకుండానే ఈ మెస్సేజ్‌లు పంపించేవారు. అలా యాంట్‌వెర్ప్, హాంగ్‌కాంగ్, బహ్రెయిన్, మారిషస్, ఫ్రాంక్‌ఫర్ట్‌లలో ఉన్న కెనరా బ్యాంక్, ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంకులకు మెస్సేజ్‌లు పంపించారు. గత ఆరు సంవత్సరాలుగా బ్యాంకు దృష్టికి రాకుండా రూ.11,384 కోట్ల విలువైన ఎల్‌ఓయూలు, లెటర్స్ ఆఫ్ క్రెడిట్స్‌ను జారీ చేశారు. పిఎన్‌బి జారీ చేసిన ఎల్‌ఓయూలు,


పోగవుతున్న వడ్డీలు చూసి విదేశాల్లోని భారతీయ బ్యాంకులు దీన్ని పెద్దగా పట్టించుకోలేదు. ఈ ఏడాది జనవరిలో షెట్టి పదవీవిరమణ చేయడంతో కుంభకోణం బైటపడిందని అధికారులు తెలిపారు.

సెజ్‌ల్యాండ్ సీజ్

- హైదరాబాద్ సెజ్‌లో గీతాంజలి గ్రూప్
- తక్కువ ధరకే 95 ఎకరాలు ధారాదత్తం
- నేటికీ ప్రారంభం కాని పనులు


హైదరాబాద్, ఆంధ్రప్రభ : నీరవ్ మోడీ ఉదంతంతో హైదరాబాద్‌కూ లింకు రుజువైంది. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు కుచ్చుటోపీ పెట్టిన ఈ ఉదంతంతో సంబంధం ఉన్న గీతాంజలి జెమ్స్ గ్రూప్‌కు చెందిన భూములు రాష్ట్ర రాజధానిలో బైటపడ్డాయి. అప్పటి ఏపీఐఐసిని మోసం చేస్తూ పదేళ్లుగా ఎటువంటి విస్తరణా లేకుండా 99 ఎకరాలను హాయిగా అనుభవిస్తున్న తీరు విస్తు గొలుపుతోంది. సెజ్‌ల పేరుతో తెలంగాణలోని విలువైన భూము లు ఎలా పరాధీనం అయ్యాయో ఈ ఘటన రుజువు చేసింది. సాక్షాత్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులు చేసేంతవరకు ఈ వ్యవహారం బైటికి పొక్కలేదు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న శంషాబాద్‌కు సమీపంలోని హైదరాబాద్ జెమ్స్ సెజ్ లిమిటెడ్(రాజీవ్ జెమ్స్ పార్క్) మొత్తం గీతాంజలి గ్రూప్ తన వ్యాపారాన్ని నిర్వహిస్తోంది.

ఏపీఐఐసీ అధికారులు 2014 ఏప్రిల్ 25న హైదరాబాద్ జెమ్స్ సెజ్‌కు 95 ఎకరాలను ఎకరాకు రూ.4 లక్షల విలువతో రూ.3.75కోట్లకు రిజిస్ట్రేషన్ చేసి మొత్తం భూమిపై అధికారం కట్టబెట్టారు. 2005లో ఇందుకు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. దీనిని రాష్ట్ర విభజనకు కొద్ది రోజుల ముందు 2014లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. 2005లోనే అక్కడ ఎకరాకు గరిష్టంగా రూ.50లక్షల విలువ ఉండగా ప్రభుత్వం కేవలం రూ. 4 లక్షలే నిర్ణయించింది. ఆగాఖాన్ అకాడమీకి అత్యంత సమీపంతోపాటు అంతర్జాతీయ ఎయిర్ పోర్టుకు ఇది కేవలం కనుచూపు మేరలో ఉంది. నేటికీ అక్కడ కేవలం 550మంది మాత్రమే పనులు చేస్తున్నారని గుర్తించారు. సెజ్‌లో పనిచేస్తున్న సిబ్బందిని, అక్కడిసెక్యూరిటీ వ్యవస్థను చూసి సీబిఐ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేసినట్లుగా సమాచారం. కోట్ల రూపాయల వజ్రాల వ్యాపారం జరిగే గనులు, ప్రాసెసింగ్ యూనిట్లలోనూ ఇంత పెద్ద మొత్తంలో ఆయుధాలతో కూడిన సెక్యూరిటీ వ్యవస్థను చూడలేదని పేర్కొన్నట్లుగా తెలిసింది. గీతాంజలి గ్రూప్‌కు ఉద్యోగ కల్పనలో ఒక విశిష్టమైన స్థానం ఉంది. స్వల్ప వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఉపాధి కల్పించే ఈ సంస్థకు గతంలో రాష్ట్రపతి కూడా ప్రత్యేక 2 పురస్కారం అందజేశారు.




మోడీజీ స్కామ్‌ల మాటేంటి?

పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ధ్వజమెత్తారు. కుంభకోణంపై ప్రధాని, ఆర్థిక మంత్రి మాట్లా డాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధా ని మోడీ పరీక్షలు ఎలా పాస్ కావాలనే దానిపై పిల్లలకు రెండు గంటలు చెబుతారు కానీ, రూ.22 వేల కోట్ల బ్యాంకింగ్ కుంభకోణంపై రెండంటే రెండు నిముషాలు కూడా మాట్లాడరు అని రాహుల్ మండిపడ్డారు. జైట్లీ ఎవరికి కనిపిం చుకుండా దాక్కున్నారని ఎద్దేవా చేశారు. మీరే దోషి అన్నట్టుగా వ్యవహరించవద్దు. మాట్లా డండి అని డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు ట్వీట్ చేశారు.




బ్యాంకింగ్ పై శ్వేత పత్రమివ్వాలి

పిఎన్‌బి కుంభకోణం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థపై ఒక శ్వేతపత్రం తీసుకురావాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ తివారిడిమాండ్ చేశారు. ఆదివారమిక్కడ విలేకరులతో మాట్లాడుతూ భారతీయ బ్యాంకుల్లో మోసాలు నానాటికి పెరిగిపోతు న్నాయని అన్నారు. భారతీయ బ్యాంకులకు రూ.800 కోట్లు బకాయిపడిన రోటోమాక్ పెన్స్ యజమాని విక్రమ్ కొథారి పత్తాలేకుండా పోయారని మనీష్ తివారి వేలెత్తి చూపారు. భారతీయ రిజర్వ్ బ్యాంకు డేటా ప్రకారం గడచిన ఐదేళ్లలో రూ. 61,260 కోట్ల మేరకు బ్యాంకింగ్ మోసాలు చోటు చేసుకున్నాయి. అందులో నాలుగేళ్ళు ఎన్డీయే ప్రభుత్వం హయాంలో జరిగాయి. మోసగాళ్ళ పేర్లు వివరాలను ప్రచురించేలా ఆదేశించాలి.



మొద్దు నిద్రలో కేంద్రం

లక్నో: భారీ బ్యాంక్ కుంభకోణం జరుగుతుంటే కేంద్రం మొద్దు నిద్రపోయిందని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి మండిపడ్డారు. ప్రజా సంక్షేమ ప్రభుత్వం అంటే ఇదేనా అని నిలదీశా రు. నేను తినను.. ఇంకొకర్ని తిననివ్వను అం టూ ప్రధాని మోడీ గొప్పగా చేసిన ప్రకటన ఏమైందని ఎద్దేవా చేశారు. జన్‌ధన్ యోజన కింద పేదలు, కష్టజీవులు జాతీయ బ్యాంకుల్లో దాచుకున్న కష్టార్జితం ప్రియమైన పారిశ్రామి కవేత్తలు, వ్యాపారవేత్తలు దోచుకోవడానికేనా అని ఒక మాయావతి ఒక ప్రకటనలో ప్రశ్నిం చారు. నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.



సమగ్ర దర్యాప్తు చేయాలి

కోల్‌కతా: పిఎన్‌బి కుంభకోణంలో ఇతర బ్యాంకుల ప్రమేయంపై అభి యోగాలు వెల్లు వెత్తుతున్న నేపథ్యంలో కుంభకోణంపై ఒక పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బనర్జీ డిమాండ్ చేశారు. నోట్ల రద్దు సందర్భంగా పెద్ద ఎత్తున మనీలాండరింగ్ చోటు చేసు కున్నది. ఇందులో మరిన్ని బ్యాంకు లు పాలు పంచు కున్నాయి. పూర్తి వాస్తవం వెలుగులోకి రావాలి అని ట్వీట్ చేశారు.



జమ్మూలో ఘనంగా ఆమ్రపాలి పెళ్లి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి కాటా ఆదివారం పెళ్లి కూతురు అయ్యింది. పెళ్లికి ఘనంగా ఏర్పాట్లు చేశారు. రాత్రి జమ్మూలో ఐపీఎస్ అధికారి సమీర్‌శర్మతో వివాహమైంది. పెళ్లికి ముందు సాంప్రదాయబద్ధంగా ఆమెను అలంకరించారు. ఎరుపురంగు చీర, మెడలో బంగారు గొలుసు, తలపై పాటిట బిళ్ల ధరించడంతో ఆమె అందంగా కనిపించింది. అనంతరం ఇరు కుటుంబాల పెద్దల మధ్య సాంప్రదాయబద్ధంగా ఇద్దరు ఒక్కటయ్యారు.

పేదలకు రైల్వే స్వర్ణ కానుక

(మొదటిపేజీ తరువాయి)

కల్పిస్తున్నది. 'స్వర్ణ' అనే పేరుతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నదని ఓ సీనియర్ అధికారి వివరించారు. దీనికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. దీన్ని గతేడాది రైల్వే శాఖ తీసుకొచ్చింది. నిరుపేదలకు ఈ రెండు రైళ్లలో అవకాశం కల్పిస్తున్నది. విమాన టికెట్ ధరలతో పోటీపడే ఈ రైళ్లల్లో పేదలకు ఆ శాఖ 'స్వర్ణ' కానుక ఇస్తున్నది. కొన్ని రైళ్లను ఎంపిక చేసి రెండో దశకు విస్తరించనున్నారు. ప్రయాణించేవారు నిరుపేదలు అని గుర్తించి వాటి ఫలాలు అందజేస్తామని రైల్వే బోర్డు సీనియర్ అధికారి ఒకరు వివరించారు. ఒక్కో కోచ్‌కు రూ.50లక్షలు వెచ్చించి కోచ్‌ను అనుసంధానించనున్నారు. మెరుగైన వసతులు, ప్రయాణం కల్పించేదిశగా బోగీలు ఉంటాయి. సాధారణ బోగి అయితే కేవలం రూ.30 నుండి 35లక్షలు మాత్రమే అవసరం ఉంటుంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోచ్‌లలో మంచి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకునేందుకు అన్ని జోన్‌ల ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీరులు నిర్ణయం తీసుకున్నారు. సౌకర్యాలు అనగా.. బోగీ లోపలి డిజైన్‌లు, టాయిలెట్లు, పరిశుభ్రత, సిబ్బంది ప్రవర్తన, క్యాటరింగ్, సమయసారిణి, రక్షణ, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించనుంది. మొట్టమొదటి సారిగా స్వర్ణ రాజధాని రైలును ఢిల్లీ-సీల్దా మధ్య 2017, నవంబర్‌లో ప్రారంభించారు.

అమ్మ భాషకు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

భాషలు, 100 నాన్ షెడ్యూల్డ్ భాషలు ఉన్నాయి. అయితే 10 వేల మంది కన్నా తక్కువ మాట్లాడే భాషలు దాదాపు 42 ఉన్నాయి. వీటిని అంతరించిపోయే దశలో ఉన్న భాషలుగా పరిగణించడం జరుగుతుందని అని హోమ్ మంత్రిత్వ శాఖకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. ఈ మేరకు యునెస్కో ఒక జాబితాను రూపొందించింది. ప్రమాదంలో పడిన భాషలు లేదా మాండలికాల్లో అండమాన్ నికోబార్ దీవులకు చెందిన 11(గ్రేట్ అండమానీస్, జరవ, లమొంగ్సె, లురో, మువోట్, ఒంగె, పు, సనెన్య్, సెంటిలిస్, షోంపెన్, తకహన్యిలంగ్), మణిపూర్ నుంచి ఏడు(అయిమోల్, అకా, కొయిరెన్, లమ్‌గాంగ్, లన్‌గ్‌రోంగ్, పురుమ్, తరావ్), హిమాచల్ ప్రదేశ్ నుంచి నాలుగు(భఘతి, హందురి, పంగ్వలి, సిర్‌మవది) ఉన్నాయి.

ప్రమాదం పొంచిన భాషల్లో మండ, పర్జి, పెంగొ(ఒడిశా), కొరగ, కురుబ(కర్నాటక), గడబ, నాయికి(ఆంధ్రప్రదేశ్), టోడ(తమిళనాడు), మ్రా, నా(అరుణాచల్‌ప్రదేశ్), టయిరోంగ్(అస్సాం), బంగని(ఉత్తరాఖండ్), బిర్హోర్(జార్ఖండ్), నిహలి(మహారాష్ట్ర), రుగ(మేఘాలయ), టోటో (పశ్చిమబెంగాల్) ఉన్నాయి. మైసూరులోని కేంద్రీయ భారతీయ భాషల సంస్థ ఒక కేంద్ర ప్రభుత్వ పథకం కింద ప్రమాదంలో పడిన భాషల పరిరక్షణను పాటు పరిశీలన చేస్తుంది. 2011 సెన్సస్ ప్రకారం 1,635 హేతుబద్ధీకరించబడిన మాతృభాషలు, 234 గుర్తించదగిన మాతృభాషలు, 22 ప్రధాన భాషలు దేశంలో ఉన్నాయి.

ఆటే... ఆయుధం!

(మొదటిపేజీ తరువాయి)

చూడటం మాత్రమే. ప్రపంచంలో మరెక్కడా లేనంతమంది క్రికెట్ ఆసక్తిపరులు భారత్‌లో ఉన్నారు. అయితే ఈ క్రీడల్లో నైపుణ్యం సాధించే దిశగా యువ తను తీర్చిదిద్దే సుశిక్షితులు మాత్రం ఇక్కడ లభ్యం కారు. ప్రభుత్వం కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో అందుకు తగ్గ అవకాశాల్ని అందుబాటులో ఉంచడం లేదు. పసిప్రాయం నుంచి మార్కులు, ర్యాంకులు లేదా టీవీల ముందు కూర్చుని క్రికెట్ చూడటం తప్ప పిల్లలకు మరోధ్యాస ఉండడం లేదు. ఐటి కొలువుల్లో రోజూ పది నుంచి పన్నెండు గంటల పాటు కుర్చీ నుంచి లేవకుండా పని చేయడం, ప్రాపంచిక సంబంధాలు తెగిపోవడం, సన్నిహితులు, కుటుంబ సభ్యులతో కూడా మానసిక అనుబంధం దూరంకావడంతో పాటు పని ఒత్తిడి వీరి మస్తిష్కాల్ని పట్టిపీడిస్తోంది. త్వరగా మానసిక ప్రకోపాలకు లొంగదీస్తోంది. చిన్నతనం నుంచి జిమ్నాస్టిక్స్ పట్ల ఆసక్తి పెంచాలి. వాస్తవానికి ఇందుకోసం పెద్దపెద్ద క్రీడామైదానాలే అవసరంలేదు. చిన్న చిన్న ప్రాంగణాల్లోనే వీటిపై తర్ఫీదునివ్వొచ్చు. అందుకు తగిన శిక్షణ పొందిన కోచ్‌లు అవసరం. ఈ దిశగా చిన్న పిల్లల్ని ప్రోత్సహించడం ద్వారాకూడా వారిలోశారీరకదృఢత్వాన్నిపెంచొచ్చు.

శక్తివంతమైన జాతిని రూపొందించే క్రమంలో ఇంతవరకు చైనా అమలు చేస్తున్న సంప్రదాయ విధానాల్ని భారత్ పుణికిపుచ్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ముఖ్యంగా చిన్నతనం నుంచి పిల్లల్ని శారీరకశ్రమకు, ఆలోచనా పటుత్వానికి ప్రోత్సహించాలి. కేవలం ఐటి కొలువులు, ర్యాంకులే ప్రాతిపదికగా కాకుండా దృఢచిత్తం అలవడే విధంగా క్రీడలతో పాటు సైనికరంగంవైపు వారిలో ఆసక్తి పెంచాలి. అప్పుడే భారత్‌లో యువత మానసిక దౌర్బాగ్యాలకు లోబడి ఆత్మహత్యల వైపు ప్రేరేపితులు కాకుండా బలమైన జాతిగా మారే అవకాశ ముంటుంది. ఒకప్పుడు జర్మన్‌లు మాత్రమే శక్తివంతమైన జాతిగా భావించే వారు. వారొక్కరే ఈ ప్రపంచాన్ని ఏలేందుకు సమర్థులమని ప్రకటించుకునేవారు. రానాను ఆ శక్తివంతుల జాబితా లో జర్మన్లు వెనకడుగేశారు.

చైనీయులు ఆ హోదాను సంతరించుకున్నారు. అలాగని ఒక్క రాత్రితో చైనీయులు ప్రత్యేక జాతి గా ఆవిర్భవించలేదు. తర తరాల నుంచి శారీరకశ్రమను నమ్ముకోవడంతో పాటు అవసరమైతే విదేశాలకెళ్లి మరీ చెమటోడ్చారు. పసి తనం నుంచి కూడా పిల్లల్ని అందుకనుగుణంగా తీర్చి దిద్దారు. భారత్ ఇప్పటికైనా పురాతనమైన తన జాతి ఒకప్పటి శక్తిసామర్థ్యాల్ని, దృఢచిత్తాన్ని తిరిగి సాధించుకుని ప్రపంచంలో మేటిగా మారేందుకు ఇప్పటి నుంచైనా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.



చిన్నతనం నుంచి జిమ్నాస్టిక్స్ పట్ల ఆసక్తి పెంచాలి. వాస్తవానికి ఇందుకోసం పెద్దపెద్ద క్రీడామైదానాలే అవసరం లేదు. చిన్న చిన్న ప్రాంగణాల్లోనే వీటిపై తర్ఫీదునివ్వొచ్చు. అయితే అందుకు తగిన శిక్షణ పొందిన కోచ్‌లు అవసరం. ఈ దిశగా చిన్న పిల్లల్ని ప్రోత్సహించడం ద్వారా కూడా వారిలో శారీరక దృఢత్వాన్ని పెంచొచ్చు.

ఇంటింటికీ ఇంటర్నెట్

(మొదటిపేజీ తరువాయి)

అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తెలంగాణ ఫైబర్ గ్రిడ్ పథకాన్ని చేపట్టింది. పౌర సేవలను నేరుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, సామాన్యుడికి సైతం సాంకేతిక విప్లవ ఫలితాలను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం కేసీఆర్ అనేక సందర్భాల్లో చెప్పిన విషయం తెలిసిందే. ఈ లక్ష్య సాధనకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సోమవారం సదస్సు ప్రారంభ సందర్భంగా సీఎం కేసీఆర్ చేసే ప్రసంగంలో బ్రాడ్‌బాండ్ పథకం ఉద్దేశాలను వివరించనున్నట్లు తెలుస్తోంది.

సీఎం కేసీఆర్ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు మంత్రి కేటీఆర్ తెలంగాణ ఫైబర్ గ్రిడ్‌కు శ్రీకారం చుట్టారు. సాంకేతిక విప్లవంలో తొలిసారిగా ప్రతి గ్రామంలోని నివాసాలన్నింటికీ బ్రాడ్‌బాండ్ కనెక్షన్ ఇవ్వడానికి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకు వచ్చింది. మూడున్నరేళ్ల కాలంలోనే తమ ప్రభుత్వం ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన టీ హబ్‌ని ఏర్పాటు చేసిన ఘనత కూడా తమదేనని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రతిని ధులకు వివరించనున్నారు. బ్రాడ్‌బాండ్ సేవలకు సంబంధించి ఇప్పటికే హైదరాబాద్ సమీపంలోని మహేశ్వరంలో నాలుగు గ్రామాలలో పైలెట్ ప్రాజెక్టును ప్రభుత్వం సిద్ధం చేసింది. వచ్చే ఏడాది జనవరి మాసం నుంచి ఈ నాలుగు గ్రామాల్లో అంతర్జాల సేవలను అందించనున్నది ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కుంది. మహేశ్వరం, తుమ్మలూరు, మంచాపల్లి, సింగారంపూర్ గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టులో భాగంగా సేవలను అందించేందుకు ఐటీ శాఖ అధ్యయనం చేస్తోంది. ఈ నాలుగు గ్రామాల్లో 500 ఇళ్లు 50కి పైగా ప్రభుత్వ కార్యాలయాల్లో అంతర్జాల సేవలను అందించనుంది. మీ సేవా కార్యక్రమాలు, టికెట్ ద్వారా విద్యాపరమైన అంశాలు, పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఇచ్చే సూచనలు, నిపుణుల ప్రసారాలు, ఐపీటీవీ ద్వారా 200కు పైగా టీవీ ఛానెల్స్, హెచ్‌డీ డిజిటల్ ఎడ్యుకేషన్ కింద ఈ-ఎడ్యుకేషన్, టెలి మెడిసిన్, బ్యాంకింగ్ ట్రాన్సాక్షన్స్ సేవలను అందించనున్నారు. అర్బన్ కనెక్టివిటీ బాధ్యతలను లార్సన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టి) చూస్తోందని అధికారులు తెలిపారు. స్మార్టన్ సంస్థకు స్మార్ట్ హోమ్ పరిష్కారాలు,



ఇంటర్నెట్ ఓవర్‌తింగ్స్, హెచ్‌ఎఫ్‌సీఎల్ ద్వారా రూరల్ కనెక్టివిటీ భాగస్వామ్య ఆప్టికల్ లైన్ టెర్మినేషన్ సేవలను అందిస్తోంది. ఆప్టికల్ టెర్మినల్ నెట్‌వర్క్ సేవలను టీ లింక్, తేజస్, దశన్ సంస్థలు సమకూరుస్తున్నాయి. ఈ సేవలన్నింటినీ అభ్యసించి చేస్తున్న ఫైబర్ గ్రిడ్ సోమవారం నుంచి ప్రారంభం అవుతున్న ఐపీ కాంగ్రెస్ సదస్సులో వాటిని ప్రదర్శించనుంది.

30 వేల కిలోమీటర్ల మేర ఆప్టిక్ ఫైబర్ లైన్

సీఎం కేసీఆర్ ఇంటింటికీ శుద్ధమైన నీరు అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన మిషన్ భగీరథ ప్రాజెక్టుతో కలిపి ఐటీ శాఖ తెలంగాణ ఫైబర్ గ్రిడ్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 30 వేల కిలోమీటర్ల మేర ప్రధాన ఆప్టిక్ ఫైబర్ లైన్లను ఏర్పాటు చేసింది. శరవేగంగా డక్టులను నిర్మిస్తూ ఆప్టిక్ ఫైబర్ లైన్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు సాగుతుంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో ఆప్టిక్ ఫైబర్ లైన్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. ఫైబర్ గ్రిడ్ పథకానికి ప్రభుత్వం రూ.5,500 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. మిషన్ భగీరథతో సమన్వయం చేసుకోవడం వల్ల రూ.1500 కోట్ల వ్యయాన్ని తగ్గించగలిగామని ప్రభుత్వం చెబుతోంది. మిషన్ భగీరథతో సమన్వయం చేసుకోవడం వల్ల డక్టు తవ్వకంలో ఖర్చును తగ్గించుకోగలిగామని అధికారులు చెబుతున్నారు. ఫైబర్ గ్రిడ్ పథకానికి కేంద్ర ప్రభుత్వం భారత్ నెట్‌వర్క్ కింద రూ.1,242 కోట్లు అందించనుంది. మిగతా మొత్తాన్ని ప్రభుత్వం రుణం రూపంలో సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పైలట్ ప్రాజెక్టు దశలోనే అంతర్జాతీయ ఐటీ రంగంలో తమ కంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న దిగ్గజ సంస్థలు ఈ పథకంలో భాగస్వాములు కావడం తెలంగాణ విజయమని ప్రభుత్వం భావిస్తోంది. హెచ్‌పీ, సిస్కో, ఎల్ అండ్ టీ, టెరాసాఫ్ట్, టీలింక్, ఐటెక్స్, తేజస్, హెచ్‌ఎఫ్‌సీఎల్, స్మార్టన్ వంటి సంస్థలు ఫైబర్ గ్రిడ్‌లో పాలుపంచుకునేందుకు ముందుకు వచ్చాయి. ఈ మేరకు ప్రభుత్వం తో ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నాయని అధికారులు అంటున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఫైబర్ గ్రిడ్ పనులను పూర్తి చేసి జన వరి నుంచి దశలవారీగా రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు అంతర్జాల సేవలను అందిస్తామని, అప్పట్నుంచే పాఠశాలల్లో ఈ-క్లాస్ రూంలను ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తామని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో డిజిటల్ తరగతుల నిర్వహణకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నుంచి కేంద్రసాయంతో ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో డిజిటల్ తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కేటీఆర్‌కు జర్మన్ సంస్థ ఆహ్వానం

రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రసంగించాలని విజ్ఞప్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మరొక అంతర్జాతీయ సంస్థ నుంచి మంత్రి కెటి రామారావుకు ఆహ్వానం అందింది. జర్మన్ ఏషియా పసిఫిక్ బిజినెస్ అసోసియేషన్ 98 వ సమావేశానికి హాజరు కావాలని ఆ సంస్థ విజ్ఞప్తి చేసింది. జర్మనీలోని హాంబర్గ్‌లో మార్చి 2 వ తేదీన జరుగనున్న ఈ సమావేశానికి వచ్చి తెలంగాణలో ఉన్న అపార వ్యాపార, వాణిజ్య అవకాశాలను వివరించాలని కోరింది. ఆసియా దేశాలతో జర్మనీ నిర్వహించే వ్యాపార, వాణిజ్య అవకాశాలను చర్చించే ఈ సమావేశానికి అంతర్జాతీయంగా పేరున్న 300 మంది వాణిజ్య వేత్తలు, రాజకీయ నాయకులు, దౌత్యవేత్తలు హాజరవుతారని అసోసియేషన్ పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం మూడేళ్లుగా అమలు చేస్తున్న పలు సంక్షేమ, ఆర్థిక విధానాలపైన జర్మన్ వ్యాపార వర్గాలకు ఆసక్తి ఉందని, అందుకే తమ దేశంలోని అగ్రస్థాయి వ్యాపార వేత్తలతో ప్రత్యేకంగా ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, దీనికి ముఖ్య వక్తగా హాజరుకావాలని కోరింది. ఈ సమావేశంలో తెలంగాణ, జర్మనీల మధ్య వాణిజ్య బంధం మరింత విస్తృత మవుతుందని అసోసియేషన్ ఆశాభావం వ్యక్తం చేసింది. తెలంగాణలో వ్యాపార అవకాశాలపైన సంస్థ ప్రత్యేకంగా ఆసక్తి వ్యక్తం చేయడం పట్ల, సమా వేశానికి ప్రత్యేక ఆహ్వానం రావడం పట్ల మంత్రి కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు.

పసి హృదయానికి హరీశ్ అండ

చిన్నారి ఆపరేషన్‌కు రూ.6 లక్షల ఆర్థిక సాయం



పసిపాపతో మంత్రిని కలిసి ఆనందాన్ని పంచుకుంటున్న తల్లిదండ్రులు

సిద్దిపేట అర్బన్, ప్రభన్యూస్: మంత్రి హరీశ్‌రావు మరోమారు తన ఉదారతను చాటుకున్నారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న శిశువు ఆపరేషన్ కోసం రూ.6లక్షల ఆర్థిక సాయం అందించారు. దీంతో శిశువు తల్లిదండ్రులు హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట మండలం వెల్కటూర్ కు చెందిన పత్తి ఉమారాణి-సతీష్‌లకు గత నెలలో బాబు జన్మించారు. పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధి కారణంగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని స్టార్ ఆసుపత్రికి వెళ్లారు. ఆపరేషన్ కోసం రూ.6లక్షలు పైగా అవుతుందని వైద్యులు చెప్పగా, తల్లిదండ్రులకు ఏం చేయాలో దిక్కుతోచలేదు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో చిరు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న ఆ పసిపాప తండ్రికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో హరీశ్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి వెంటనే స్పందించి ఆంధోళన చెందొద్దని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా స్టార్ ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ గోపి చంద్‌తో మాట్లాడారు. జనవరి 23న ఆ శిశువుకు స్టార్ ఆసుపత్రిలోని హృదయ ఫౌండేషన్ సహకారంతో వైద్యం అందించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ మేరకు సిద్దిపేటలోని మంత్రి నివాసంలో ఆదివారం ఉదయం పసిపాపతో ఆ తల్లిదండ్రులు హరీశ్‌రావును కలుసుకున్నారు. బాబుకు పునర్జన్మ ఇచ్చారని, జీవితాంతం రుణపడి ఉంటామని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వీడియోకాల్‌లో బాయ్‌ఫ్రెండ్ చూస్తుండగా

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, అనంతపురంలో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతురాలు అనంతపురం జిల్లాకు చెందిన బుగ్గయ్య చౌదరి కుమార్తెగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు అనేక కోణాల్లో విచారణ జరుపుతున్నారు. ఆమె ఫోన్‌లో ఉన్న కాల్‌డేటా ఆధారంగా పోలీసులు లవర్‌ని విచారించే అవకాశాలున్నాయి.

యాప్ జీవితాన్ని మార్చేసింది!



(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో ఉంచారు. గత రెండు సంవత్సరాలుగా దక్షిణ మయన్మార్‌లో తీవ్రంగా దెబ్బతిన్నది. ఈ నేపథ్యంలోనే ఈ కొత్త రకం యాప్ ఆవిష్కరించబడింది.

ఈయేడు మాత్రం రైతులు, కూలీలు చాలా పంట కోత సమయంలో చాలా ఆనందంగా కనిపించడాన్ని 35 ఏళ్ల ఖాన్ ఖాన్ ప్వో గమనించింది. సీజనల్ వరంగా పంటపై సమర్థవంతమైన పురుగుల మందు ఉపయోగించిన దిగుబడిలో విజయం సాధించింది. ఇదంతా ఆమె రూపొందించిన యాప్‌తోనే సాధ్యమైందని చెప్పుకొచ్చింది. వాళకు ఆ తల్లిదండ్రులు చూపించిన విధానంలోనే వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని పశ్చిమ మయన్మార్‌లోని అయెయావాడి గ్రామంలో వివరించింది.

యాప్ అందుబాటులోకి వచ్చిన తరువాత ఉపయోగించడం చాలా సులభతరమైంది. దేన్ని అయినా సాధించగలమనే నమ్మకం వచ్చింది. సరిగ్గా ఉపయోగించడంతో పాటు కొత్త పనులు కూడా ముందుకు వెళ్లే విధంగా ఉంది. టెక్నాలజీని ఉపయోగించుకుని ముందుకు వెళ్లే అవకాశం ఈ తరంలో కనిపించడం లేదు. దేశ వ్యాప్తంగా ఉన్న సమస్య ఇది. మూడింట రెండు వంతుల మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. దేశం జీడీపీలో దాదాపు 28శాతం వ్యవసాయంపైనే ఉంది. దశాబ్దాలుగా ఐసోలేషన్ జుంటా పాలనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నుండి రైతులు బయటికి రాకపోవడంతో దిగుబడుల ఉత్పాదన తగ్గిపోయింది. అలాంటి వారికి ఖాన్ ఖాన్ ప్వో యాప్ సమాధానం అవుతుంది.

వారు రైతులకు అన్ని రకాల సమాచారాలను ఎప్పటికప్పుడు అందిస్తుంటారు. వాతావరణం, వాతావరణంలో వచ్చే మార్పులు, పంట ధర, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ ఏవి వాడాలి..? అనే విషయాలను అప్రమత్తం చేస్తూ ఉంటారు. అదేవిధంగా చర్చా వేదికలు నిర్వహిస్తారు. నిపుణులు ద్వారా వారి అనుమానాలు నివృత్తి చేయడం వంటి అనేక కార్యక్రమాలతో రైతులను అన్ని విధాలుగా సన్నద్ధం చేస్తుంటారు.

గ్రీన్ వే యాప్‌ను ఇద్దరు వ్యవసాయ విద్యార్థులు ప్రారంభించారు. రైతుల కోసం 2011లో వెబ్‌సైట్‌లో సెటప్ చేశారు. రాత్రిళ్లు యాప్‌ను మరింత అభివృద్ధి పర్చేందుకు సమయం కేటాయిస్తూ ఉండేవారు. అప్పటికే కొంత మంది రైతులు ఇంటర్‌నెట్ సదుపాయం కలిగి ఉన్నారు. 28 ఏళ్ల యిన్ యిన్ ఫ్యూ వివరిస్తూ ఉండేవారు. ఎప్పుడు అయితే రైతుల చేతుల్లో స్మార్ట్ ఫోన్ వచ్చిందో అప్పటి నుండి చాలా మార్పు వచ్చింది. టెలికాం రంగాన్ని అభివృద్ధి పర్చడానికి మయన్మార్ ప్రభుత్వం తలుపులు తెరిచింది. దీంతో మార్కెట్‌లో నెట్ ఒక భాగంగా మారింది. పాత రకం కంప్యూటర్లు, సెల్‌ఫోన్‌లకు కాలంచెల్లిపోయింది. సిమ్ కార్డు ఖర్చుతో పాటు కొన్ని నియంత్రణలతో 2005లో ఉన్న 3వేల డాలర్ల ఖర్చుకన్నా 2013 వచ్చే నాటికి 1.50 డాలర్లకు పడిపోయింది. తమ బ్రాండ్‌ను పెంచుకోవడానికి పోటీదారులు ఆదరణాత్మకంగా స్మార్ట్ ఫోన్స్‌లను అందజేశారు. 2012లో కేవలం 7 శాతం ఉన్న స్మార్ట్ ఫోన్ వినియోగదారులు 2017 చివరికి వచ్చేసరికి 80శాతానికి చేరుకుంది. వ్యవసాయంతో పాటు వైద్య, ఆరోగ్య రంగాల్లో కూడా కొత్త యాప్‌ల ఆవిష్కరణకు మయన్మార్ ప్లాట్‌ఫామ్ ముందుకెళ్తోంది. టెక్నాలజీ హబ్‌గా మార్చేందుకుగాను చర్యలు చేపట్టింది. ఒకప్పుడు మయన్మార్‌లో రైతుల అంటే పేదోళ్లుగా ఉండేవారు. కానీ ఇప్పుడు ప్రతి ఒకరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఇంట్లో కంప్యూటర్లు కనిపిస్తున్నాయి. గ్రీన్ వే వారి జీవితాన్ని మార్చేసింది. 2016లో తీసుకొచ్చిన యాప్ నిర్వాహకులు 2018 వరకు వచ్చేసరికి ఫుల్‌టైమ్ స్టాఫ్‌తో దూసుకెళ్తున్నారు.

రైతులను సంపన్నులు చేయడానికే..

యిన్ యిన్ ఫ్యూ, గ్రీన్ యాప్ సృష్టికర్త

ఒకప్పుడు మయన్మార్‌లో రైతులంటే పేదోడు. కానీ ఇప్పుడు సంపన్నుడయ్యాడు. గ్రీన్ వే యాప్ అనేది నా కల. రైతుల కోసం తీసుకొచ్చిన కొత్త తరహా యాప్ ఇది. వ్యవసాయ రంగంలో ఎలాంటి సాయం పొందాలనుకున్నా ఇది తోడ్పడుతుంది. ఇప్పటికే 70వేల మంది రైతులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అభివృద్ధి ఫలాలు పొందు తున్నారు. కొందరు ఫోన్ నుండి ఫోన్‌కు షేర్ కూడా చేసుకున్నారు.

మయన్మార్, రైతులు ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తున్నారు. ఎంతో ఆనందంగా ఉంది. వ్యవసాయ రంగంలో ఇంత అభివృద్ధి కనిపించడం ఎంతో ఆనందంగా కూడా ఉంది. చాలా దేశాల్లో వర్కర్లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారు. ఎందు కంటే సాంకేతిక పరిజ్ఞానం ఉన్నాయనే కారణంతో... కానీ ఇది మయన్మార్‌లోని రైతులు సాధించి చూపించారు. రైతులకు టెక్నాలజీ ఎంత అవసరం ఉంటుందో.. అంతే టెక్నాలజీ కూడా ఉండాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ప్రపంచ బ్యాంకు అధ్యయనం ప్రకారం.. కొన్ని దేశాల్లో రోజుకు ఓ రైతు టెక్నాలజీ కోసం 2 డాలర్లు వెచ్చిస్తున్నాడు.

మ్యూ మింట్, వ్యవసాయ రంగ నిపుణుడు

ఉత్పాదకత కూడా తగ్గింది. రోజుకు కేవలం 23 కిలోల బియ్యం వస్తున్నది. అదే కంబోడియాలో ఇది 62 కిలోలుగా ఉంది. వియత్నాంలో 429 కిలోలు, థాయ్‌లాండ్‌లో 547 కిలోలు ఉంది. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి సరిపడా సమయం దొరకడం లేదు. విత్తనాలు, ఎరువులు మార్కు విషయమై సలహాలు కరువయ్యాయి. కానీ యాప్ వచ్చిన తరువాత మాత్రం రైతుల్లో ఆర్థికంగా ఎదుగుదల కనిపించింది.

డస్మాన్ ఎల్విన్ సిక్కా, గోల్డెన్ ప్యాడీ యాప్ సృష్టికర్త

ఇప్పటికే కొన్ని దేశాల్లో అనగా భారత్, ఆఫ్రికన్ దేశాల్లో అభివృద్ధి సాధించడం లేదు. టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. పాత రకం పద్ధతులనే ఉప యోగిస్తున్నారు. ఎస్ఎంఎస్‌ల రూపంలో సలహాలు అందిస్తున్న విధానం ఇప్పటికీ అలాగే కొనసాగుతున్నది. మయన్మార్‌లో మాత్రం ఆధునిక పద్ధతుల వ్యవసాయ పద్ధతులకు బ్రాండ్‌గా అక్కడి రైతులు నిలిచారు. ముందు మయన్మార్ చాలా ఇబ్బందులు పడ్డ తరువాత టెక్నాలజీ ద్వారా అభివృద్ధి చెందింది.

మూడు రకాల బియ్యంతో క్యాన్సర్ మటుమాయం

- గత్వాన్, మహారాజీ, లైచాలో అధిక ఔషధ గుణాలు
- క్యాన్సర్ కణాలను గుర్తించి నాశనం
- ఐజీకేవీ, బార్క్‌లో కొనసాగుతున్న ప్రయోగాలు
- గిరిజన ప్రాంతాల్లో ఈ బియ్యమే ఔషధం

రాయ్‌పూర్: క్యాన్సర్.. ప్రస్తుతం ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న వ్యాధుల్లో ప్రధానమైంది. వయస్సుతో సంబంధం లేకుండా అందరిని కబళించివేస్తున్నది. శరీరంలో ఏదైనా గడ్డ లాంటి పరిమాణం ఉన్నా.. లేదంటే అన్యూహ్య మార్పులను కొందరు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వాటిలో కొన్ని చిన్నపాటి వ్యాధులు ఉంటే.. మరికొన్ని ప్రాణాంతక మైనవి ఉంటాయి. క్యాన్సర్ వంటి జబ్బులను తొందరగా గుర్తించలేం. లోతుగా విశ్లేషిస్తే తప్ప ఆ ప్రాణాంతకమైన వ్యాధి అని నిర్ధారించుకోలేని పరిస్థితి. గతంలో క్యాన్సర్ బారినపడితే చావే శరణ్యంగా ఉండేది. కానీ టెక్నాలజీ పెరగడంతో ఈ వ్యాధిపై కూడా విజయం సాధించారు. కానీ చాలా ఖర్చుతో కూడుకున్న వైద్యం. పేదోడికి క్యాన్సర్ వస్తే కాటికి వెళ్లాల్సిందే. కాని ధన వంతుడు అయితే కోట్లు ఖర్చు పెట్టి కూడా జయం పొందుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఛత్తీస్‌గఢ్ నుండి కొన్ని చిత్రాలు ప్రపంచానికి తీపి కబురు అందించారు. మూడు రకాల బియ్యంలో క్యాన్సర్‌ను నయం చేసే కారకాలు ఉన్నాయని గుర్తిం చారు. గత్వాన్, మహరాజీ, లైచా రకం బియ్యంలో క్యాన్సర్ భరతం పట్టే ఔషధ గుణాలు ఉన్నాయని, క్యాన్సర్ కారకాలతో పోరాడే శక్తి ఉందని సీనియర్ శాస్త్రవేత్త దీపక్ శర్మ వివరిం చారు. రాయ్‌పూర్‌లోని ఇందిరా గాంధీ కృషి విశ్వవిద్యాలయం (ఐజీకేవీ), ముంబయిలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో పరిశోధనలు చేశారు. బియ్యంలోని అంతర్లీన ద్రవ్యరాశుల నుండి ఈ మూడు రకాలను సేకరించి ఇందిరా గాంధీ కృషి విశ్వ విద్యాలయంలో భద్రపరిచినట్లు దీపక్ శర్మ చెప్పారు. ఈయన అగ్రికల్చర్ యూనివర్సిటీలోని జెనెటిక్స్, మొక్కల పెంపకం విభాగంలో ప్రిన్సిపల్ సైంటిస్టుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మూడు రకాల బియ్యాన్ని వండి ఆహారంగా తీసుకుంటే సాధారణ కణాలకు ఎలాంటి నష్టం కల్గజేయ కుండా ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్ బారి నుండి కాపాడుతుంది. మూడు రకాల్లో ముఖ్యంగా లైచా అనే రకం బియ్యంలో అత్యధిక ఔషధ గుణా లు ఉన్నాయి. శరీరంలో క్యాన్సర్ కణాలు ఉంటే వాటిని గుర్తించి వాటి నాశనం చేస్తే శక్తి ఉంటుంది. ఇందిరా గాంధీ కృషి విశ్వ విద్యాలయంలోని గ్రామ్ ట్స్ కమిషన్, ముంబయిలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ లైఫ్ సైన్సెస్ విభాగం లో పరిశోధనలు చేశారు. అక్కడ పరిశోధనలు చేసిన చిన్న ప్యాకెట్లను తీసుకుని పరిశోధనలకు పంపించారు. బార్క్‌లో పరిశోధనలు చేసిన అనంతరం ఈ మేరకు అనుమతి పొందింది. బార్క్‌లోని బయో సైన్సెస్ గ్రూపులో అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న వీపీ వేణుగోపాలన్ ఆధ్వర్యంలో పలువురు శాస్త్రవేత్తలు ఇతర వరి వంగడాలపై పరిశోధనలు చేస్తున్నట్లు దీపక్ శర్మ తెలిపారు. తాను కొంద్రినేటర్‌గా వ్యవహరిస్తున్నట్లు వివరించారు. గత్వాన్, మహారాజీ, లైచాను బియ్యాన్ని ప్యాకెట్ల రూపంలో బయటకు పంపించాలని నిర్ణయించారు. ముఖ్యంగా గిరిజనులు నివసించే బస్తర్ ప్రాంతంలో ఈ తరహా వినియోగం అధికంగా ఉంది.

గత్వాన్ రకం బియ్యంలో కీళ్ల నొప్పులను మటుమాయం చేసే గుణం అధికంగా ఉంటుంది. లైచాను చర్మ సంబంధ వ్యాధుల నివారణకు ఉపయోగిస్తుంటారు. గిరిజనులు ఆస్పత్రులకు వెళ్లకుండా కేవలం ఈ బియ్యాన్నే ఔషధంగా ఉపయోగిస్తున్నారని శాస్త్రవేత్తలు వివరించారు. శరీరంలోని కొన్ని వ్యాధులను దూరం చేయడంతో పాటు సాధారణ కణాలకు ఎలాంటి హాని కలుగజేయకుండా క్యాన్సర్ సెల్స్‌పై పోరాటం చేస్తుందని శర్మ వివరించారు. రోజుకు ఈ మూడు రకాల్లో ఏదో రకం బియ్యాన్ని 200 గ్రాములు చొప్పున తీసుకుంటే క్యాన్సర్ వారి జోలికి రాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్తలు చెబుతున్నది ఏంటంటే... మందుగా మూడు రకాల బియ్యం నుండి క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడే మూలకాలను తీసుకుని ఎలుకలో ప్రవేశపెట్టి పరిశోధనలు చేయనున్నారు. నిత్యం మానవుడు ఉపయోగించే ఆహార పదార్థంతో కలిపి అందించి క్యాన్సర్ భూతాన్ని జయించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

అనుకున్నది సాధిస్తాం: ఇందిరా గాంధీ కృషి విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఎస్‌కె పాటిల్

ఈ మూడు రకాల బియ్యంపై క్షుణ్ణంగా పరిశోధనలు చేసి క్యాన్సర్ జయించడంలో ఎంతో దోహదం పడుతుందని విషయాన్ని తెలియజేస్తాం. అనుకున్న లక్ష్యాన్ని సాధించి తీరుతాం. స్వదేశీయులు అగోహ్ రిజిస్టర్ భద్రపర్చిన ఛత్తీస్‌గఢ్‌లోని పలు సంప్రదాయమైన వైద్యాలపై కూడా పరిశోధనలు చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు ఇంకా కొనసాగుతూనే ఉంది.



ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీవనం

టేబుల్



సెంటిమెంటు అని
కొట్టి పారెయ్యొద్దు.
కూసాలు లూజై
కాళ్ళు ఊగొచ్చు గాక.
కాల మహాసముద్రాన్ని
అవలీలగా ఈదిన
నా చిరకాల మైత్రీ యానిక
ఈ దారు వేదిక.

ఇవాళ పనికిరాదనుకోవద్దు
చరిత్ర పాతదే కావచ్చు
కాని ఇది ప్రాసంగికోజ్వలం!
దీనితో నా అనుబంధం
పలుచబడని సుమధుర సుగంధం
ఒంటరితనం ముసిరినప్పుడు
దీని పూర్వాశ్రమ వృక్షం కింద
సేదతీరుతాను.
బాధలు సతాయించినప్పుడు
తరుణోపాయం కోసం
దీనిపైన మోచేతులానించి
తలనిమురుకుంటాను.

సంసార సాగరంలో
ఇదొక ద్వీపం
మథనంలో పేరుకునే
సరికొత్త ఆశాదీపం

ఆకిటికీ
దీని కిరీటం
దూరాన పక్షుల బారులను
కాగితాలపైకి ఆకర్షించి
అక్షరాలుగా మారుస్తుంది.
నా కవిత్వపు కాగితం విమానాలు
టేకాఫ్ అయ్యే
సిమెంటు మైదానమై వ్యాపిస్తుంది.

పురాతనమే కాదు
అతి నూతనం కూడా.
దర్శిస్తే మహదాకాశం
నివసిస్తే భూ వైశాల్యం.

కేవలం బల్లచెక్క కాదు
అడుగులేని మహాపాత్ర
జీవితాన్ని ఎంత గుమ్మరించినా నిండదు
బహుశా నేనున్నంతవరకు
ఇదే నా నిరంతర జ్వలితయాత్ర.

- డా॥ ఎన్.గోపి
9391028496

అందని ఆకాశంతో..!



ఆకాశం అందనంత దూరంలో ఉందని పొరపడకు!
ఆ దూరం కొలతలకు అందనిదని అంచనాకు రాకు
ఏ క్షణమైనా ఉరికొచ్చే నింగిని చూసి అదోలా నవ్వకు
ఆ ఆకాశం బద్దలైతే విరుచుకుపడే వర్షం నీ దరికి రాదా?

మేఘాల్లో ఉరుముల మెరుపులు చూసి మౌనం దాల్చకు
ఆ ధ్వనుల ప్రతిధ్వనులు విని పరాకులోకి వెళ్లకు
ఇరుసుల్లా దూసుకొస్తుంటే నాకేమని నిద్రలోకి జారకు
ఆ వెలుగుల జువ్వలు క్షణాల్లో నీ కంటిని తాకవా?

పిడుగులు పరుగులు పెడుతుంటే నిమ్మకు నీరెత్తకు
పాశుపతాస్త్రమై వస్తుంటే విలయం కాదని వదిలేయకు
అల్లంత దూరాన లేచే ఆ మంటలు నిన్నూ తాకక మానవు

జీవనయాత్రలో ప్రణయాల పరుపులే కాదు
విలయాల వికృతులూ ఉంటాయని మరువకు
ప్రకృతిలో పరమార్థపు అంచులు చూడు
ఆకాశపు చిత్రాల్లో సప్తవర్ణాల అర్థం వెతుకు
ఉరుమైనా..మెరుపైనా మనది కాదని అనుకోకు
పిడుగులు మాత్రమే ప్రమాదమని పొరపడకు
ఆకాశం...నువ్వూ వేర్వేరు కాదని తెలుసుకో
ప్రకృతీ...నువ్వూ మమేకపు నీడలని మరువకు
అంటీముట్టనట్టుండి లౌక్యమని విర్రవీగకు
నువ్వు దూరం జరిగినా ప్రకృతి వదలదు
అడుగడుగూ అది నీతో కలిసే వేస్తుంది.

- వయ్యస్సారెస్
9000013367

కృత్రిమ వ్యాకరణం కవిత్వపు భావశిల్పమవుతుందా?

వస్తు నిర్వహణే వస్తు శిల్పమని..కేవలం ఒక వస్తువును కాకుండా భిన్న వస్తువుల్ని స్వీకరించి వాటిని నిర్వహించడం వస్తుశిల్పమవుతుందని చెబుతూ పోతారే తప్ప ఆయా వస్తువులను దేశ విదేశాల కవులు ఏఏ డిక్షన్స్‌లో శైలీ విన్యాసాల్లో, దెవిషెల్ లో చెప్పారో విశ్లేషించరు. తిలక్ లాంటి కవులే hyperbole poetry రాశారని..మంత్రలోకపు మణిస్తంభా లాంటి అవాస్తవిక over imagenery కవితా పాదాలు కవిత్వంలో ఉన్నాయని..ఇలాంటి వస్తుశిల్ప నిర్వహణ వల్ల ప్రయోజనాలేమిటో..రా.రా.లాంటి వాళ్లు ప్రశ్నించినా ఎవ రూ పట్టించుకోలేదు.

వ్యాకరణం భాష పుట్టాక పుట్టిందా? ప్రజల భాషను ప్రజలకు దూరం చేయడానికి కొంతమంది సృష్టించారా? అన్నది ఆలోచించాలి. ప్రజలు మాట్లాడుకునే జీవద్భాషలో కవిత్వం రాయాలి. తెలుగు భాషను రక్షిస్తామంటూ మళ్లీ వ్యాకరణాల భాషతో రాసే గ్రాంధిక కవిపుంగవులకు సన్మానాలు చేస్తూ ఎన్నాళ్లు ప్రజలను ప్రభుత్వాలను మోసం చేస్తారు? వచన కవిత్వపు భాష, రూపం ప్రజాస్వామికం. ప్రజలకు అర్థం కాని కవిత్వం రాజులను, భూస్వాములను, వారి భోగలాలసలను కీర్తించిన కవిత్వం అప్రజాస్వామిక ఫ్యూడల్ రూపం. ఈ విషయం నేటి యువకవులు తెలుసుకోవాలి. సరళమైన వాడుక భాషలోనే వచన కవితలు రాయాలి. పాశ్చాత్య దేశాల కవితా నిర్మాణ పద్ధతులకు మనవాళ్ళు చెప్పిన కవితా నిర్మాణాలను తేడాలను గమనించాలి. నేడు మన సంప్రదాయ కుహనా కవిత్వపు పరిశోధకులు ఇంకా వస్తుశిల్పం, భావ శిల్పం, రచనా శిల్పం అంటూ కవిత్వాన్ని విశ్లేషిస్తున్నారే తప్ప పాశ్చాత్య దేశాలలో విస్తృతంగా విశ్వవ్యాప్తంగా వస్తున్న poetic-devicesల గురించి dictions గురించి ఆలోచించరు. వస్తువుకు సంబంధించిన శిల్పాన్ని వస్తు శిల్పమని ..వస్తు నిర్వహణే వస్తు శిల్పమని..కేవలం ఒక వస్తువును కాకుండా భిన్న వస్తువుల్ని స్వీకరించి వాటిని నిర్వహించడం వస్తుశిల్పమవుతుందని చెబుతూ పోతారే తప్ప ఆయా వస్తువులను దేశ విదేశాల కవులు ఏఏ డిక్షన్స్‌లో శైలీ విన్యాసాల్లో, దెవిషెల్‌లో చెప్పారో విశ్లేషించరు. తిలక్ లాంటి కవులే hyperbole poetry రాశారని..మంత్రలోకపు మణిస్తంభా లాంటి అవాస్తవిక over imagenery కవితా పాదాలు కవిత్వంలో ఉన్నాయని..ఇలాంటి వస్తుశిల్ప నిర్వహణ వల్ల ప్రయోజనాలేమిటో..రా.రా.లాంటి వాళ్లు ప్రశ్నించినా ఎవరూ పట్టించుకోలేదు. అలాగే కవి తాను ఎన్నుకొన్న అంశాన్ని వివిధ రకాలుగా భావించి, కల్పించి, ఊహించి, చెప్పడమే భావశిల్పమంటారు. అంతేకాదు ఏ కవిత్వంలోనైన ఉత్తమమైన భావుకత లేనిదే(imagination) రాణించదని ఏ కృష్ణశాస్త్రినో, నాయనినో, వేదులనో, బసవరాజునో ఆకాశానికి ఎత్తేస్తారు. పైగా ఈ నాటి కవులలో ఆ భావుకత లేక భావశిల్పం లేదని చెప్పడమో చేస్తుంటారు. కాని నేటి ప్రపంచ కవితా నిర్మాణంలో, కేవలం భావుకతే కాకుండా వాస్తవికత, పర్సోనిఫికేషన్, మెటానమీ language of gesture కవిత్వంలో వాతావరణ కల్పన, భావం తాలూకు భంగిమను పట్టిచ్చే భాష ఎంపిక..ఇలా అనేకాంశాలు..భావశిల్పాన్ని ప్రభావితం చేస్తు

కవిత్వం-డిక్షన్-21

న్నాయని యువకవులకు విడమరిచి చెప్పేదెవరు? emotional investment in the poems imagery అన్న పాశ్చాత్య పరిశోధకుల మాటలూ నేటి కవులు గమనించాలి. ఇంకా మనవాళ్ళు పద్యమే కవిత్వమన్న భావన నుండి, గ్రాంధిక భాషే ప్రజల భాషన్న భ్రమల నుండి...వ్యాకరణం, ఛందస్సు వల్లనే శైలీ రమ్యత వస్తుందన్న పిచ్చిదనం నుంచి, ప్రాసల ప్రాభవం ప్రదర్శించడమే రచనాశిల్పమన్న. .వంచనాయుత భావజాలం నుండి బయటపడలేదు. అంతే కాదు వచన కవిత్వం అంతటా...అందరిచేత రాయబడుతుంటే..పత్రికల్లో ప్రచురింపబడుతుంటే..కవుల సంఖ్య పెరుగుతుంటే..ముసలి కవులు పీఠాలు కదులుతుంటే.. పండితభిషక్కులు ఉలిక్కిపడుతుంటే...మళ్లీ వచన కవితా నిర్మాణాలను అపహాస్యం చేయడానికి ప్రాచీన అలంకారికుల సిద్ధాంతాలకు వక్రభాష్యాలు చెబుతూ..లేక ఆధునిక వచన కవిత్వానికి అన్వయిస్తూ, అది లేదని, ఇది లేదని నేటి యువకవులను భయపెడుతున్నారు. వాస్తవానికి ప్రాచీన లాక్షణికులు వారి స్థలకాలాలను బట్టి కావ్యాలు..కవిత్వం ఎలా ఉండాలో చెప్పారు..ఉదాహరణకు...

1. రసవిశిష్టమైన రచనే కావ్యం- రుద్రటుడు (కావ్యశాస్త్రం)
2. వట్టి వచనం కావ్యాపకర్షహేతువైన దోషం- విద్యానాథుడు (ప్రతాపరుద్రయశోభూషణమ్)
3. చమత్కారం లేకపోతే కవులకు కవిత్వమే లేదు- కుంతకుడు (వక్రోక్తి)

ఇలా చెప్పడంతో పాటు శబ్దగత, వాక్యగత, అర్థగత దోషాలున్నాయని చెప్పారు. 18 అర్థదోషాల్లో 'నిరలంకృతి' అనే పేరుగల ఒక దోషంగా చెప్పాడు విద్యానాథుడు. అంటే ఇవాళ వచన కవిత్వంలో శబ్దగత, వాక్యగత, అర్థగత దోషాల కన్నా..కవిత్వం కాని కవిత్వపు భావనాబల దోషాలు, ఇమేజరికి, ప్రతీకలకు, అభివ్యక్తికి, కవితా నిర్మాణాలకు సంబంధించిన దోషాల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది. అలాగే రసవిశిష్టమైన కావ్యాలు కన్నా వచనమై తేలిపోయిన కావ్యాలు..కవితా సంపుటాలు ఎన్నో ఉన్నాయి. పైగా వాటికే అవార్డులు, రివార్డులు ఇస్తున్నారు. పాత డిక్షన్‌తో సంస్కృతపద పదబంధాల పేర్లతో కవితా సంకలనాలు వెలువడితే...వాటినే గొప్ప కవిత్వంగా..భావించి పెద్ద పెద్ద అవార్డులిచ్చి..ఇదే అసలు సిసలు..కవిత్వమని ప్రచారం చేస్తున్నారు. పాశ్చాత్య ఆధునిక కవిత్వ నిర్మాణ, విమర్శాశాస్త్రాల పరిచయం తెలుగువారికి పరిమితంగా ఉండడంతో ఏది కవిత్వమో ఏది కవిత్వం కాదో తేల్చుకోలేకపోతున్నారు. ఇక్కడ 'సంస్కృత అలంకార శాస్త్రాలు సాహిత్య సిద్ధాంత గ్రంథాలే గాని సాహిత్య విమర్శ సిద్ధాంత గ్రంథాలు కావు' అన్న వల్లంపాటి వెంకట సుబ్బయ్య మాటలు కవులు గుర్తించుకోవాలి. రసం, ధ్వని, చమత్కారం..ఇవన్నీ Iambic pentameter లో స్ట్రాంగ్ ఫీలింగ్స్‌ను కలిగించడానికి, మంచి impression కలిగించడానికి పాశ్చాత్యకవుల కవితా నిర్మాణంలో ఎప్పుడో ఉపయోగించారు. ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే యువకవులు..వచన కవిత్వం రాసే ముందు..




1. వచన కవిత్వం రాయడానికి పెద్దగా వ్యాకరణం అవసరం లేదని..
2. సహజమైన ప్రజల భాషలోనే నిజమైన కవిత్వముందని..
2. గ్రాంధిక భాష కవిత్వపు భాష కాదని..
4. వచన కవిత్వం రాయడానికి ప్రాచీన అలంకార శాస్త్రాల కన్నా పాశ్చాత్య దేశాల కవితా నిర్మాణాల గురించి నేర్చుకోవాలని..
5. వచన కవిత్వం ఎవరైనా రాయవచ్చని..సంప్రదాయ వ్యాకరణం అక్కరలేదని, రాయడం ఒకటి వచ్చుంటే చాలని...
6. అన్ని వర్గాల, వర్ణాల ప్రజలు వాడే వాడుక భాషే ప్రామాణిక వచన కవిత్వ భాషని..
7. నిజమైన తెలుగు భాష.. వచన కవిత్వంలో పరిమళిస్తుందని..
8. చిన్నయసూరి బాల వ్యాకరణం, బహుజనపల్లి ప్రౌఢవ్యాకరణం చదివి కవితలు రాయాల్సిన అవసరం లేదని..

యువకవులు తెలుసుకోవాలి. నేటి యువకవులు మంచి imagesతో అద్భుత కవిత్వం రాస్తున్నారు. వచన కవితలకు ఇమేజెస్ చాలా ముఖ్యం. ఎందుకంటే science congnizes reality in concepts, while art in images అంటూ చెప్పిన సోవియట్ విదుషీ షెర్బీనా..మాటలే నేటి వచన కవితల సృజనకారులకు మార్గదర్శకాలు కావాలని ఆశిద్దాం.

(కొత్త కలాల కోసం- కవితా నిర్మాణ పద్ధతులు)

- బిక్కి కృష్ణ
9912738815

శ్రీనాథుని కావ్యాల్లో శివలీలలు



భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచం అనుసరించదగినది ఉంటాయనేది నిర్వివాదాంశం. దీన్ని ప్రపంచం ఏనాడో గుర్తించింది. ఇక్కడ పుట్టిన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు ప్రపంచ సారస్వతానికి, మానవ జీవితానికి ఉత్తమ మార్గాన్ని చూపించేవిగా ఉంటాయి. అయితే నేటి యువత పెడదారులు పడుతూ మన సంస్కృతిని, సాహిత్యాన్ని అధ్యయనం చేస్తున్న పరిస్థితి నేడు కనిపించటం లేదు. ఎవరైనా కొందరు అధ్యయనం చేద్దామన్నా అందులోని భాషవారికి అందనిదిగా, కొరకరాని కొయ్యగా ఉంటుంది. ఈ దశలో ఆధునిక యువతీ యువకులకు మన సాహిత్య సౌరభాలను అందించాలనే సంకల్పంతో డాక్టర్ రామవరపు శరత్ బాబు కంకణం కట్టుకున్నారు. రామాయణ, భారత, భాగవత గ్రంథాలతో పాటు కాళిదాసు, శ్రీనాథుడు వంటి మహాకవుల కావ్యాలను అందరికి అర్థమయ్యే తేలిక భాషల్లో అందిస్తూ వస్తున్నారు. ఆ క్రమంలోనే ''శ్రీనాథ కృత శ్రీకంఠ పంచకం'' పేరుతో శ్రీనాథ కవి, సార్వ భౌముని పంచకావ్యాలైన నైషధం (శృంగార నైషధం), హరవిలాసం, భీమేశ్వర పురాణం, శివరాత్రి మహాత్మ్యం, శ్రీకాశీఖండం తీసుకొని ఒక గ్రంథంగా మనకు అందించారు. ఇందులోని నైషధం (శృంగార నైషదం) మినహా మిగిలిన కావ్యాలన్ని శివతత్వాన్ని శివభక్తిని చాటే కావ్యాలే. అయితే శృంగార నైషధాన్ని కూడా ఇందులో చేర్చటం పై శరత్‌బాబు ఒక వివరణ ఈ గ్రంథంలో తన మాటగా రాసిన దానిలో మనకు దొరుకుతుంది.


''శ్రీనాథుడు రాసిన కావ్యాల్లో శ్రీకంఠవృత్తాంత సంబంధమైన ఐదింటిని గ్రహించి వాటి కథాంశాల్ని నేటి యువతకందించటమే నా ప్రయత్న పరమార్థం. అయితే మిగతా నాల్గింటిమాటెలా ఉన్నా నైషధం శివలీలా విభూతిని చెప్పేది కాదు కదా, మరి అదెలా శివపరమౌతుందనే ప్రశ్న ఉత్పన్నం కావచ్చు. పైగా ఇందులో కేవలం శ్రీనాథుని శృంగార నైషధం మాత్రమే కాక శ్రీహర్షుని సంస్కృత నైషధం, వేదవ్యాస, సంస్కృత మహాభారత, ఆంధ్ర మహాభారతాల ప్రసక్తి కూడా ఉంది కదా! అప్పుడది శ్రీనాథపంచకంలో ఎలా చేరుతుందనే ప్రశ్న కూడా తలెత్తవచ్చునంటే -సంస్కృతంలో ఛత్రి న్యాయమనే ఒక న్యాయం ఉంది. ''ఛత్రిణోగచ్ఛంతి' అనే నుడికారానికి ''గొడుగుల వారు వెడుతున్నార''ని అర్థం. వర్షంలో చాలామంది గొడుగులు వేసుకొని వెళ్లటం సహజమేగా! అయితే వారిలో కొంతమంది గొడుగులు లేనివారు కూడా కొంత మంది ఉండవచ్చు. ఈ గొడుగులు లేని వారిని కూడా గొడుగులున్నవారిగానే ఈ నుడికారం చెపుతుంది. కనుక నైషధం ప్రత్యక్షంగా శివుని పేర్కొనకపోయినా నలదమయంతులకు దూత అయిన 'హంస', శివుడేనని విద్వల్లోకం భావిస్తుంది. నాలుగు కావ్యాలు, శివపరమైనందున ఒకటి అంతగాకాకపోయినా, దానివలెనే పరిగణించవచ్చు కనుక ఈ ఐదింటి సమాహారం 'శ్రీనాథకృత శ్రీకంఠ పంచకమౌతోంది'' అంటూ ఒక సబబైన వాదనను వినిపించారు శరత్‌బాబు. ఈగ్రంథంలోని మొదటిది శృంగార నైషధం. నలదమయంతుల కథ. రెండవది హరవిలాసం. ఇది ఏడు ఆశ్వాసాల కావ్యం. ఇందులో తుంబురునికి దుర్వాసముని శాపం అతడు చిఱుతొండనంబిగా పుట్టం, శివుడు మిండ జంగంగా రావడం, శివుని శరీరంలో పొడమిన స్వేదాన్ని పార్వతి అపార్థం చేసుకోవడం-శివుడామెను స్వాంతన పరచటం, భక్త సిరియాళుని కథ, తారకాసుర సంహారం, శివుడు మూడవకన్ను తెరిచి మన్మధుని భస్మీభూతుని చేయడం, శివపార్వతుల వివాహం, క్షీరసాగర మథనం, విష్ణుమూర్తి అమృతాన్ని మోహినీ రూపం తో దేవతలకందేటట్లు చేయటం, అర్జునుడు శివుణ్ణి మెప్పించి పాశుపతాస్త్రాన్ని చేకొనటం, అర్జునునికి ఊర్వశి శాపం వంటి వృత్తాంతాలు హరవిలాసంలో కనిపిస్తాయి.

మూడవ కావ్యమైన భీమేశ్వర పురాణంలో దక్షారామపురవర్ణనం, వ్యాసుడు కాశీనగరాన్ని శపించటం, శివుడు వ్యాసుని కాశీ నుంచి బహిష్కరించటం, వ్యాసుని దాక్షారామ ప్రవేశం, ప్రథమ గణసమేతుడై శివుడు దక్షారామాన్ని ప్రవేశించటం, బృహస్పతి దివస్పతికి దానవైశిష్ట్యాన్ని భూదాన మహిమను తెలియ చెప్పటం, దక్షవాటిక మహాత్మ్యం వంటి కథలతో ఆరు ఆశ్వాసాలతో ఉంటుందీ భీమేశ్వర పురాణం. నాలుగవదైన శివరాత్రి మహాత్మ్యం ఐదు ఆశ్వాసాల కావ్యం. ఇందులో విష్ణువు సముద్రాంతర్గతమైన భువిని వెలికితీయడం, బ్రహ్మవిష్ణువుల యుద్ధం, ఇరువురు శివుని స్తుతించటం, శివరాత్రి వ్రతాన్ని గూర్చి శివుడు వారికి తెలపటం, యజ్ఞదత్తుడనే బ్రాహ్మణుని వృత్తాంతం శివానుగ్రహంతో అతని భార్య సుశీలకు సుకుమారుడనే పుత్రుడు జన్మించటం, అతని దుష్ప్రవర్తన, సుకుమారుని ఆగడాలను, రాజుకు మొరపెట్టు కోవటంతో రాజు అతనికి దేశ బహిష్కార శిక్ష విధించటం, సుకుమారునికి చండాల వనితతో సంపర్కం, సుకుమారుడు చాండలితో ఇరువురు కుమార్తెలను, ఇద్దరు కుమారులను కని పంచావాన్నొందడం, సుకుమారుడొకనాడు శివరాత్రి వ్రతాన్ని దర్శించటం. ఇంటికి వచ్చి ప్రాణాలు విడవటం, యమ, శివకింకరుల ఘర్షణ, యముడు శివునితో ప్రబోధితుడై, శివభక్తుల జోలికి పోవద్దని అతని కింకరులనా దేశించటం వంటి ఘట్టాలతో శివరాత్రి మహాత్మ్యం కావ్యం నడుస్తుంది. ఇక ఐదవ కావ్యం శ్రీ కాశీఖండం. ఇందులో నారదుడు వింధ్య పర్వతం వద్దకు రావటం, వింధ్య మేరు పర్వతంపై స్పర్థతో తన శరీరాన్ని పెంచి సూర్య చంద్రాది గ్రహగతులకవరోధం కలిగించటం, బృహస్పతి, అగస్త్యుల సంవాదం, కాశీ వియోగానికి అగస్త్యుని పరితాపం, విద్యగర్వాపహారణం, శివశర్మోపాఖ్యానం, వివిధలోకాలవర్ణణ, నిరృత , వరుణ, ఈశాన, నక్షత్ర, బుధ, శుక్రదిలోకాల వృత్తాంతం, శివశర్మ నిర్యాణం, మణికర్ణికామహాత్మ్యం, కళావతి ఉపాఖ్యానం, దివోదాసు వృత్తాంతం. స్త్రీ లక్షణ నిరూపణ, సాంబాదిత్య మహాత్మ్యం, శివుడు బ్రహ్మను కాశి పంపటం, విష్ణువు కాశిలో బౌద్ధ ధర్మాన్ని స్థాపించటం, దుర్గామహాత్మ్యం, కాశిలోవివిధ లింగామహాత్మ్యం, వ్యాసుడు కాశీపై కోపించిన వృత్తాంతం, దేవతాయంత్రవిధానం వంటి వృత్తాంతాలు ఈ 'శ్రీకాశీఖండం'లో కనిపిస్తాయి. అందరిని ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు శరత్‌బాబు. ఈ గ్రంథం చదివి భద్రపరుచుకోవాల్సిన గ్రంథమని చెప్పవచ్చు. శరత్‌బాబు కృషిని మెచ్చుకోకుండా ఉండలేము. పేజీలు-252, వెల-రూ.250

ప్రతులకు, రామవరపు శరత్‌బాబు, ప్రశాంతి సదన్, జి-1,46-18-8,వంండవారి పేట,దొనపర్తి,విశాఖపట్నం-530016, ఏ.పి.సెల్. 9885961329.

- నియోగి
9553097319

సమాజ దార్శనికత్వం పఠాభి కవిత్వం!!



వచన కవిత్వాన్ని ఆకాశానికి ఎత్తినవారు తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి. ముఖ్యంగా ఆధునిక దృష్టికి- వచన కవితా నిర్మాణ ప్రక్రియల్ని చాలా ప్రాచుర్యంలోకి తీస్కుని వచ్చిన అభ్యుదయ పథికునిగా ఆయన ఆద్యుడు. అభివ్యక్తి వ్యంజనంలో నూతనంగా కవులందర్నీ ఒకసారి తనతొలి ఫిడేలురాగాలు డజను ఆలోచనాత్మకంగా విన్పించారు. ఈ కవితా సంకలనాన్ని 1939లో వెలువరించారు. కవితా సారాంశంలోని నిర్భయత, నిబద్ధతలతో బాటు వచన కవిత్వాన్ని నవ్యాత్మకమైనదిగా, తన సంవిధానాన్ని ప్రకటించడం వెనుక, తన అస్తిత్వాన్ని తెలిపారనే చెప్పాలి. అప్పటి నేతలు పట్టాభి, బాబూ, సుభాసు బోస్‌లని కూడా రాజకీయపు పోటీ వంటి అంశాల్ని కవితా పాదాలుగా ఆవిష్కరించడం గమనార్హం. తన భావాల్ని ఆవేశంగానో, వ్యంగ్యంగానో కాక తన కళ్లల్లో టెలిస్కోప్‌లు, మైక్రోస్కోపుల్ని ఉషోదయాల్ని చూసే కవిగా అర్థం చేసుకోవాలన్నారు.

శాంతినికేతన్ పట్ల మక్కువను పెంచుకుంటూ తన కవిత్వ పరిశీలన ఎంత విస్తృతమో తరువాత తరానికి స్పష్టమైన సంకేతంగా తెల్పారు. ''సంస్కార'' చలన చిత్రంలోనూ తన దృశ్యమానమై నిల్చిందనే చెప్పాలి. స్నేహలతగారితో పరిణయం కూడా కవితాలోకానికి మరింత ఆదర్శంగా స్ఫూర్తిగా చూపారు. స్వతహాగా ఆజానుబాహుడైన పఠాభిని ఆయన సృష్టించిన ''చండమారుత'' రాజకీయ నియంత్రణలకు సంచలనమయ్యింది. తాను నవ్యుడునని, తెంపిరిని కాదని ''కయితే నాదయితే'' అని తెల్పి చెప్పారు. అందుకే ఇన్నేళ్లయినా కవి లోకంలో కవకంకణాభరుడు పరిసరలలితశాలీనుడు, శ్లేషభూషణుడు అనే పర్యాయపదాల్ని తన పేరుకు పొట్టలో చుక్క మొలిపించుకున్నవాడు ''పఠాభి''. అలా ఇంగ్లీషు భాషా భాండారం నుండి కావల్సిన మూటల్ని కావ్య గౌరవం చెడకుండా వాడుకుంటానన్న సారస్వత విశ్వవ్యాపనుడు . అందుకే పఠాభి

ఎవర్నని యనుకొంటిరో మీరు నన్ను? ఏనుపఠాభిని...
ప్రఖ్యాతంకానున్న కవిని నేను...
నా వచన పద్యాల నే దుడ్డుకర్రలతో, పద్యాల నడుములు విరుగతంతాను
చిన్నయ సూరి బాల వ్యాకరణాన్ని చాలా దండిస్తాను...
నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను..అనుసరిస్తాను'' అంటూ తన నవీన పంథాను నర్మగర్భంగా కవితా లోకానికి తెలియచేసిన ప్రయోగవాది. ఒకరకంగా నిరాడంబరాహం భావకవిగా పేరుని సార్థకం చేసుకున్నారు. ఎందుకంటే కుతూహలం లేపే మైక్రోస్కోప్ ఉపయోగం చిన్నపిల్లలు ఎలా ఆసక్తి కన్పరుస్తారో అలా వయసు పైబడినా సరే నిత్యం గణిత విద్యార్థి కొత్త పాఠం నేర్చుకోవడం కంటే సాంప్రదాయ వీణావాదనం కన్నా ఫిడేలు రాగాలు నాజూకుగా విన్పించాలన్న సంగీతపు జిజ్ఞాసల్ని పెంచుకున్నారు. కవులందరూ గొప్పగా పొగిడే చంద్రుడు నగరవీధుల్లో ఇరుక్కున్నట్లున్నాడు అనడం, విచిత్రమైన ఆలోచనల్లోంచి వచ్చింది. ''భోగం పిల్ల'' నిజాయితీని కూడా మెచ్చుకోవడం ఆయనలో కన్పిస్తుంది. ముఖ్యంగా విశ్వకవి రవీంద్రుని కవిత్వాన్ని విన్పించిన రాగాల దివ్యత్వం, లయగతుల్ని తప్పక 2018లోనూ కావ్యగౌరవాన్ని పొందుతూనే ఉంది. ప్రపంచం చుట్టూ కమ్మిన అపోహలు, చూడని నిజాలు, తన సృజనతో స్వీయపదజాలాన్ని సృష్టించగలిగారు. ఈ ప్రయత్నంలో తానొక రుషిలా మారారనే చెప్పాలి.జీవితమంటే రంగుల స్వప్నాల్ని కనడమే కాదు, వాస్తవికాంశాల పట్ల సమగ్ర అధ్యయనం సాగించి, సారించడంగా భావించారు. అదే ఆయనను ఒక ప్రత్యేకత గలిగిన కవిగా నిలబెట్టింది. తన కవితాత్మక భావుకతతో తన తరాన్ని తన వైపు తిప్పుకోగలిగారు. అందుకే ఆయన్ని అకారణపు నిందలు శిక్షలు అధిగమించగలిగేలా ధైర్యం, ఆత్మస్థైర్యంలున్న మనిషిగా పఠాభిని అభివర్ణించారెందరో అభిమానులు.

(పఠాభి శతజయంతివత్సరం ప్రారంభ సందర్భంగా)

- వి.ఎస్.ఆర్.ఎస్.సోమయాజులు
9441148158

వి.ఆర్.విద్యార్థి, డా॥ కేతవరపు రాజ్యశ్రీలకు సృజన సాహితీ పురస్కారాలు

గతరెండు దశాబ్దాలుగా ఎందరో ప్రముఖ సాహితీ వేత్తలను సత్కరిస్తూ, సాహిత్య, ఆధ్యాత్మిక సభలు నిర్వహిస్తూ వస్తున్న సృజన సాహితీ సమాఖ్య, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా 2017సం.కుగాను సాహిత్యరంగంలో దశాబ్దాల తరబడి తనదైన ఒక ప్రత్యేక ముద్రతోను, ప్రకృతి సౌందర్యాలను తన కవితా సృజనతో అందిస్తూ సాగిపోతున్న ప్రముఖ కవి వి.ఆర్. విద్యార్థికి, కవయిత్రిగా, రచయిత్రిగా, వక్తగా, ఆధ్యాత్మిక ప్రసంగకర్తగా కీర్తి గడించిన డా॥కేతవరపు రాజ్యశ్రీకి ప్రతిష్టాత్మకమైన సృజన సాహితీ జీవన సాఫల్య పురస్కారాలను అందించడానికి నిర్ణయించింది. ఈ పురస్కారానికి గాను నగదు, పురస్కార పత్రం సృజన జ్ఞాపిక, శాలువలతో వీరికి సత్కారముంటుంది. త్వరలో సత్తుపల్లిలో జరిగే ప్రత్యేక సభలో ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారాలు వీరికి అందించడం జరుగుతుంది.

- జి. రామకృష్ణ, బి. మధుసూదనరాజు, గట్టేవాసు
సృజనసాహితీ సమాఖ్య నిర్వాహకులు-సత్తుపల్లి-507303

మొంబత్తి ఆవిష్కరణ సభ

శ్రీమానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయగానసభ, సంయుక్త ఆధ్వర్యంలో కె.హరనాథ్ రచించిన మొంబత్తి కవితాసంపుటి ఆవిష్కరణసభ నేటి సాయంత్రం 5.30 గంటలకు కళాసుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయగానసభ, హైదరాబాద్ నందు జరుగుతుంది. సుధామ అధ్యక్షతన జరిగే ఈ సభకు సినీనటి సంగీత ముఖ్య అతిథిగా, కళాజనార్ధనమూర్తి, కె. అనితారెడ్డి, విశిష్ట అతిథులుగా హాజరవుతారు. ఆత్మీయ అతిథిగా డా॥లక్ష్మణరేఖ గోపాలకృష్ణ పాల్గొంటారు. వి.పి. చందనరావు గ్రంథపరిచయం గావిస్తారు.

సాహిత్య వార్తలు

సలీం సాహిత్య సమాలోచన జాతీయసదస్సు

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత సయ్యద్ సలీం సాహిత్య సమాలోచన జాతీయ సదస్సు 22,23, తేదీలలో రెండు రోజుల పాటు 180 సెమినార్ హాల్, సర్ సి.వి.రామన్ సైన్స్ బ్లాక్, వై.వి.యం. కడప నందు తెలుగు శాఖ, యోగివేమన విశ్వవిద్యాలయం, శశిశ్రీ స్మారక సమితి, కడప సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతుంది. 22వ తేదీ ఉదయం 10.30 గం.లకు ప్రారంభమవుతుంది. ఈ రెండు రోజులలో ఐదు సదస్సులు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలెందరో పాల్గొంటారు. 23వతేదీ సాయంత్రం ఆరుగంటలకు ముగింపు సభ ఉంటుంది.

ఆంధ్ర షెల్లీ

వాని పాటకు పల్లవి మానవతయె
వాని మాటకు నెత్తావి భావుకతయె
వాని వచనమ్ము తెలుగు చెల్వంపు కులుకు
వాని సునిశిత వాక్కు మవ్వంపుములుకు॥

మేలి మెరుపుల అక్షర మేఘమాల
రాగపల్లకి పల్లకీలయల హొయలు
సొగసు నగిషీల కేళి ఆసుకవి శైలి
బాష్ప కవితా నయాగరా భావధార॥



నవతనే చాటు ఛందమానందవల్లి
పలుముషాయిరా సరదాల పాలవెల్లి
నడచు నాజూకు జాబిల్లి-నవ్వుమల్లి
అతడు ''దేవులపల్లి''-మా ఆంధ్ర షెల్లి॥

(ఫిబ్రవరి 24వతేదీ శ్రీదేవులపల్లి కృష్ణశాస్త్రిగారి వర్ధంతి సందర్భంగా)

- డా॥ రామడుగు వేంకటేశ్వరశర్మ
9866944287

ఇక్కడే బాగుంది..!

- కేంద్రం పిలిచినా స్పందించని ఐఏఎస్‌లు
- ఫోకల్ పాయింట్లు లేకున్నా ఇబ్బందిలేదు
- ఒత్తిళ్లూ లేవూ...అవినీతి అంతకంటే లేదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కథ అడ్డం తిరిగింది. తెలంగాణలో ఐఏఎస్ అధికారులకు సముచిత స్థానం లభిస్తోంది. గతంలో ప్రభుత్వంతో పొసగక, మెయిన్‌స్ట్రీమ్ (ఫోకల్) స్థానం దక్కక సీనియర్లు కేంద్ర సర్వీసులకు వెళ్తామంటూ ప్రభుత్వానికి ఒకింత బెదిరింపు ధోరణి ప్రదర్శించేవారు. ఢిల్లీలో పనిచేస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని ఐఏఎస్‌లు తహతహలాడేవారు. దీంతో కేంద్ర సర్వీసులకు క్యూ కట్టేవారు. ఇప్పుడా పరిస్థితి తిరగబడింది. ప్రభుత్వంనుంచి పెద్దగా ఇబ్బందులు లేకపోవడం, మంత్రుల నుంచి ఒత్తిళ్లు లేని పాలన, శాఖలపై పెత్తనం ప్రదర్శించే వెసులుబాటుతో తెలంగాణ రాష్ట్రంలో కొనసాగేందుకే మొగ్గు చూపుతున్నారు. సీఎస్ పోస్టుకు పోటీపడిన స్పెషల్ సీఎస్‌లు బీఆర్ మీనా, సురేష్‌చందా, బీపీ ఆచార్య లాంటి కీలక అధికారులు ఒకవిధంగా డిమోషన్‌తో అవమానం జరిగినా ఇక్కడే ఉండి సర్దుకుపోతున్నారు.

తెలంగాణకు కేంద్రం 163 పోస్టులను కేటా యించగా, ప్రస్తుతం 146 మంది ఐఏఎస్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. కాగా గత నెల కొరతను అధిగమించేందుకు 10 మంది నాన్ క్యాడర్ అధికారులను కన్వర్డ్ చేసింది. డీఓపిటీ కూడా ఆమోదం తెలి పింది. అయితే తాజాగా కేంద్రంనుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అందిన లేఖతో అధికారులు భిన్నమైన సమాధానం ఇచ్చారు. ప్రతీ ఐఏఎస్ అధికారి తన సర్వీసులో భాగంగా కేంద్ర సర్వీసుల్లో పనిచేయాలని, ఇందుకు రాష్ట్రంనుంచి 25కుపైగా అధికారులను డిప్యుటేషన్‌పై పంపాలని సారాంశంతో లేఖను రాసింది. అయితే ఈ లేఖ ఆధారంగా రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ ఐఏఎస్‌లకు లేఖలు రాసి వారి అభిప్రాయాలను సేకరించింది. కాగా ఇందుకు ఒక్కరు కూడా సానుకూలత వ్యక్తం చేయకపోవడం గమనార్హం. ఇప్పటికే కేంద్ర సర్వీసుల్లో ఉన్న సీనియర్లు కూడా తిరిగి రాష్ట్రానికి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

మరోవైపు పాలనకు కీలకమైన శాఖలకు బాస్‌లు లేకుండా పోయిన పరిస్థితి ఉంది. కీలక శాఖలకు ఇంచార్జిలు బాధ్యులుగా ఉన్నారు. అఖిల భారత స్థాయి అధికారుల కొరతతో రాష్ట్ర ఆవిర్భావం నుంచీ ఇబ్బందులు కొనసాగుతున్నాయి. అధికారుల కేటాయింపుపై పలు దశల్లో కేంద్రంపై ఒత్తిడి తెచ్చినా ఫలితం రాలేదు. కొత్తగా అధికారుల కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి పాలనపై భారీ ప్రభావం చూపుతోంది. కేంద్రంనుంచి ఎటువంటి నూతన కేటాయింపులకు సానుకూల వాతావరణం లేకపోవడం, రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ఈ సమస్య మరింత పెరిగింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కొత్త రాష్ట్రం తెలంగాణకు 163 ఐఏఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. ఇందులోనుంచి గతేడాది కాలంగా సీఎస్‌లు ప్రదీప్ చంద్ర, రాజీవ్‌శర్మ, స్పెషల్ సీఎస్‌లు వీకే అగర్వాల్, ఎంజీ గోపాల్, రేమండ్ పీటర్‌లు పదవీ విరమణ చేశారు. ఇవే కాకుండా కేంద్ర సర్వీసుల్లో డిప్యుటేషన్లకు వెళ్లిన అధికారులు పది మంది ఉన్నారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 163 ఐఏఎస్, 112 ఐపీఎస్, 65 ఐఎఫ్ఎస్ అధికారులను కేంద్రం కేటాయించింది. పదవీ విరమణలు, ఇతరత్రా ఖాళీలు పోనూ ప్రస్తుతం 128 మంది ఐఏఎస్‌లు, 91 మంది ఐపీఎస్‌లు, 56 మంది ఐఎఫ్ఎస్ అధికారులు రాష్ట్రంలో విధుల్లో ఉన్నారు.

ఇందులోనూ 28 మంది ఐఏఎస్‌లు, 12 మంది ఐపీఎస్‌లు 7గురు ఐఎఫ్ఎస్‌లు డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసులకు వెళ్లడంతో తాజాగా రాష్ట్రంలో ఐఏఎస్‌లు 107, ఐపీఎస్‌లు 79, ఐఎఫ్ఎస్‌లు 49గా లెక్కలు ఉన్నాయి. దాదాపు 40శాతం అదనపు కేటాయింపులు కావాలన్న ముఖ్యమంత్రి విజ్ఞప్తిని డీఓపిటీ ఇప్పటివరకు పట్టించుకోలేదు.

ఈ నేపథ్యంలో ఉన్నంతలో సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలన్న సూచనతో రాష్ట్రప్రభుత్వం భారీ కసరత్తునే చేసింది. గతేడాది ఇండియన్ రైల్వేస్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్, ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్, ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్, ఇండియన్ పోస్టల్ సర్వీస్ వంటి అఖిలభారత సర్వీస్ అధికారులను రాష్ట్రానికి రావాలని కోరుతూ ఆహ్వానించాలని నిర్ణయించింది. సెంట్రల్ డిప్యుటేషన్‌లో ఉన్న ఆయా విభాగాల అధికారుల వివరాలను కూడా సేకరించింది. కొందరు రాష్ట్రానికి వచ్చేందుకు సుముఖంగా ఉండటంతో వారి వివరాలను డీఓపిటికి పంపే ప్రయత్నాలను చేసింది.

డిజిటల్ మార్కెటింగ్‌పై జాతీయ సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డిజిటల్ ఇండియాలో మార్కెటింగ్ అవకాశాలపై నేడు, రేపు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎంటర్ ప్రైజ్ (ఐపిఈ) శామీర్ పేట్ క్యాంపస్‌లో జాతీయ సదస్సు జరగనుంది. మార్కెటింగ్ రంగంలో ట్రెండ్స్, అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై సదస్సులో చర్చించనున్నారు.

ఐపిఈలో 2018-20 సంవత్సరానికి గానూ వివిధ పిజిడిఎం కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులను స్వీకరించనున్నారు. పిజి డిప్లమా ఇన్ మేనేజ్‌మెంట్- జెనెరిక్, బ్యాంకింగ్, రీటెల్ మార్కెటింగ్, ఇంటర్నేషనల్ బిజినెస్, హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, తదితర కోర్సుల్లో ప్రవేశాలను తీసుకోవడానికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతి ఇచ్చిందని ఐపిఈ డైరక్టర్ ప్రొఫెసర్ ఆర్ కె మిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీడీపీ కలిసివస్తే కేంద్రంపై అవిశ్వాసం

- చంద్రబాబు తానా అంటే పవన్ తందానా
- అధికారంలోకి వస్తే ఆరోగ్యశ్రీ విస్తరణ: కందుకూరు బహిరంగ సభలో ఏపీ ప్రతిపక్ష జగన్మోహన్‌రెడ్డి



కందుకూరు, ప్రభ న్యూస్: తెలుగుదేశం పార్టీ కలిసొస్తే కేంద్రంపై అవిశ్వాసం పెట్టడానికి తాము సిద్ధమేనని, మార్చి చివరిలో కేంద్రంపై అవిశ్వాసం పెడతామని, టీడీపీ పెట్టినా మద్దతు ఇస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా కందుకూరులో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తానా అంటే జనసేన నేత పవన్ కల్యాణ్ తందానా... అంటూ వంత పాడుతున్నారని వారిద్దరి తీరును దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిధుల వివాదంపై పవన్ కల్యాణ్ నిజనిర్ధారణ కమిటీతో తేలుస్తాననడంలో అర్థం లేదన్నారు. అవసరమైతే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పోరాడాలన్నారు. ప్రత్యేక హోదా కోసం ఏప్రిల్ 6న వైఎస్సార్‌సీపీ ఎంపీలు తమ పదవులకు రాజీనామాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని జగన్ మరోమారు స్పష్టం చేశారు. పదవులకు రాజీనామాలు వద్దని మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని పవన్‌కల్యాణ్ సలహా ఇస్తున్నారని, ఆయన సలహా పాటించడానికి తాము సిద్ధమేనని, అయితే కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే లోక్‌సభలో 54 మంది సభ్యుల సంతకాలు చేయాలని, అంత బలం తమకు లేదని, టీడీపీ కూడా మద్దతివ్వాలని, ఇందుకు చంద్రబాబును పవన్ కల్యాణ్ ఒప్పించాలన్నారు. ప్రత్యేక హోదా సాధనకు తమతో కలిసి టీడీపీ సభ్యులు కూడా పదవులకు రాజీనామా చేయాలని మూడు రోజుల క్రితమే తాను కోరినప్పటికీ చంద్రబాబు నుంచి ఇంతవరకు ప్రతిస్పందన లేదని జగన్ విమర్శించారు. నాలుగేళ్ళుగా కేంద్ర ప్రభుత్వాన్ని పదేపదే మెచ్చుకున్న చంద్రబాబు, శాసనసభ ఎన్నికలకు ఇక సంవత్సరకాలమే ఉండటంతో బీజేపీ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రానికి అన్యాయం జరిగిందంటున్నారని, కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన తరువాతనే బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెడతారని, కేబినెట్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యులు ఉన్న విషయం మర్చిపోయారా అని జగన్ ప్రశ్నించారు.

2017 జనవరి 27న అన్ని రాష్ట్రాలకన్నా కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికే అధిక నిధులు ఇస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక తెలుగు దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారని, ఆ తరువాత ఫిబ్రవరిలో 2017-18 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను కూడా ఆయన మెచ్చుకున్నారన్నారు. కానీ హఠాత్తుగా ఇప్పుడే కొత్తగా రాష్ట్రానికి నష్టం జరిగినట్టు పల్లవి ఎత్తుకున్నారని విమర్శించారు. శాసనసభ ఎన్నికల ముందు జనాన్ని మరోసారి మోసగించడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని జగన్ ఆరోపించారు.

ఆరోగ్య శ్రీ మరింత విస్తరణ

వైఎస్ఆర్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరోగ్యశ్రీ (ఇప్పుడు ఎన్టీఆర్ వైద్యసేవ) పథకాన్ని మరింత విస్తరిస్తామని జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. వైద్య చికిత్స ఖర్చు వెయ్యి రూపాయలు దాటిన ప్రతి పేదవాడికి ఆ తరువాత చికిత్స నంతా ఆరోగ్యశ్రీ క్రింద ఉచితంగానే అందిస్తామన్నారు. తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధి పీడితులకు నెలకు పది వేల రూపాయలు పింఛను ఇస్తామని, అంతేగాక ఆరోగ్యశ్రీ కింద ఇతర రాష్ట్రాల ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫీజులు చెల్లిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలోని వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్ల దళారీలకు నాయకుడిగా తయారయ్యారని జగన్ ఆరోపించారు. శనగ, కంది, పొగాకు తదితర పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. నిరుద్యోగులను కూడా చంద్రబాబు దగాచేశారని, నిరుద్యోగ భృతి ఇంతవరకు ఆచరణలోకి రాలేదని గుర్తుచేశారు.

జడ్జీలు, సిబ్బంది వేతనాలపై మార్చిలో మధ్యంతర నివేదిక



మీడియా సమావేశంలో జస్టిస్ పి. వెంకటరామిరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశవ్యాప్తంగా సబార్డినేట్ కోర్టుల న్యాయాధికారులు, సిబ్బంది, పెన్షనర్ల వేతన సవరణకు సంబంధించిన మధ్యంతర నివేదికను మార్చిలో సుప్రీంకోర్టుకు సమర్పించనున్నట్లు నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్ చైర్మన్ జస్టిస్ పి. వెంకటరామిరెడ్డి వెల్లడించారు. తుది నివేదికను గడువు కంటె ముందే ఇస్తామన్నారు. ఆదివారం ఇక్కడ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సబార్డినేట్ జడ్జీలు(న్యాయాధికారులు), సిబ్బందితో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం వారికి చెల్లిస్తున్న వేతనాలు, మూలవేతనం, పెంచాల్సిన మొత్తం, సమస్యలను తెలుసుకున్నారు. కమిషన్ సభ్యుడు ఆర్ బసంత్, కార్యదర్శి జస్టిస్ వినయ్‌కుమార్ గుప్తాతో కలిసి వెంకటరామిరెడ్డి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 18 వేల మంది సబార్డినేట్ కోర్టుల జడ్జీలు, వారితో పాటు సిబ్బంది, పెన్షనర్లు ఉన్నారని, వారి వేతన సవరణపై నవంబర్‌లో కమిషన్‌ను నియమించించారన్నారు. 18 నెలల్లోగా నివేదికను సమర్పించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించిదని, గడువులోగానే పూర్తి స్థాయి నివేదికను సమర్పిస్తామన్నారు. జ్యుడీషియరీ ఉద్యోగుల వేతన సవరణపై అభిప్రాయ సేకరణలో భాగంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నామని, రాష్ట్రాలు కేటాయిస్తున్న నిధులు, కోర్టులకు అవసరాలపై చర్చిస్తున్నామ న్నారు. గడచిన 9 నెలల్లో 7 సమావేశాలు నిర్వహించామని చెప్పారు. మొత్తం 787 మంది న్యాయాధికారులు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నారని ఆయన తెలిపారు.

ఆర్బిట్రేషన్ హబ్‌తో ప్రయోజనం

- హైకోర్టు మాజీ న్యాయమూర్తి వామనరావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇన్‌స్టిట్యూషనల్ ఆర్బిట్రేషన్ హబ్‌తో చాలా ప్రయోజనాలున్నాయని, ముఖ్యంగా ఆర్బిట్రేషన్ ప్రొసీడింగ్స్ నిర్వహించడంలో నియమాలను కలిగి ఉంటుందని, శిక్షితులైన ఉద్యోగులు ఉంటారని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి వామనరావు అన్నారు. సుప్రీంకోర్టు పరిధిలో పని చేస్తున్న ది ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్స్ రిసాల్యూషన్ (ఐసిఎడిఆర్) ఆధ్వర్యంలో భారతదేశం ఇన్సిట్యూషనల్ ఆర్బిట్రేషన్ హబ్ అనే అంశంపై ఆదివారం సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌కు వామనరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొన్ని సందర్భాలలో ఇనిసిట్యూషన్ అవార్డులను పరిశీలించడంలోనూ, అవార్డుల్లోని తప్పుల గురించి ఆర్బిట్రేటర్లకు సలహాలివ్వడం వల్ల కోర్టుల ప్రమేయం తగ్గి వివాదాలు తొందరగా పరిష్కారమయ్యేందుకు దోహదం చేస్తాయన్నారు. ఖర్చు విషయంలో అడ్‌హక్ ఆర్బిట్రేషన్ కన్నా ఇన్‌స్టిట్యూషన్స్ ఆర్బిట్రేషన్‌లో తగ్గుతుందన్నారు. న్యాయవాదులు కూడా ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఐసిడిఆర్ ప్రాంతీయ కేంద్ర ఇన్‌చార్జి, కార్యదర్శి మాట్లాడుతూ, ఆర్బిట్రేషన్ రంగంలో సంస్కరణలు తీసుకు రావడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఈ సెమినార్ నిర్వహించడం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ రంగంలో ప్రపంచమంతా జరుగుతున్న మార్పులు మనదేశంలో జరగడం లేదన్నారు. న్యాయ వ్యవస్థను సరళీకరణ చేయడం వల్ల కాలక్రమేణా అంతర్జాతీయ న్యాయవాదులు, న్యాయ సంస్థలను అనుమతించడం వల్ల ఇది సాధ్యపడుతుందన్నారు. విదేశీ పెట్టుబడులు పెంచడానికి, అంతర్జాతీయ న్యాయ నిపుణుల రాకపోకల వల్ల వ్యాపారం, సేవల సమయ పాలన అనేవి సరళీకరణ వల్ల సాధ్యమవుతుందన్నారు. ప్రొసీడింగ్స్ జాప్యం వల్ల నిపుణులైన ఆర్బిట్రేటర్లు లేక పోవడం వల్ల భారత ఆర్బిట్రేషన్ రంగం సమస్యలను ఎదుర్కుంటుందన్నారు. ఆర్బిట్రేషన్ ప్రొసీడింగ్స్‌లోని ప్రతి విషయంలోనూ మితిమీరిన కోర్టు ప్రమేయం వల్ల సరిగ్గా పని చేయలేకపోతున్నారన్నారు.

సెంటర్ ఫర్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ లా (సిటిఐఎల్) హెడ్, ప్రొఫెసర్ జెమ్స్ జె నెడుముపారా మాట్లాడుతూ, సిటిఎల్ గురించి భారతదేశంలో సరళీకృత సర్వీసుల గురించి వివరించారు. ఈ సమావేశంలో చార్టర్డ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్బిట్రేటర్స్ కార్యదర్శి చంద్రకాంత్ కాందార్ తదితరులు మాట్లాడారు.

వైకాపా రాజ్యసభ అభ్యర్థి వేమిరెడ్డి

- వ్యూహాత్మకంగా జగన్ అడుగులు
- టీడీపీ మూడో సీటు ఆశలపై నీళ్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ అధిష్ఠానం ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేరును ఖరారు చేసింది. పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి సూచన మేరకు పార్టీ ఎంపీ విజయసాయి రెడ్డి ఆదివారం వేమిరెడ్డి అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించారు. గతంలో రాజ్యసభ ఎన్నికల సందర్భంగానే వేమిరెడ్డి వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టును ఆశించారు. పార్టీ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ఆ ఎన్నికల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డికి రాజ్యసభ అవకాశం దక్కింది. ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకున్న తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం అప్పట్లో వేమిరెడ్డిని తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తామని ఆశచూపింది. చివరి నిమిషందాక సస్పెన్స్‌లోఉంచిన టీడీపీ అధిష్ఠానం రాజ్యసభకు పార్టీ అభ్యర్థిగా కర్నూలు జిల్లాకు చెందిన మాజీ మంత్రి టీజీ వెంకటేష్‌కు అవకాశం కల్పించింది. దీంతో తీవ్రఅసంతృప్తికి గురైన వేమిరెడ్డి అప్పటినుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో నెల్లూరు జిల్లాలో పాదయాత్ర చేస్తున్నపుడు వేమిరెడ్డి పాదయాత్రలో కనిపించారు. అప్పటికే పార్టీ ముఖ్యనేతలు వేమిరెడ్డితో చర్చలు జరిపి ఈ సారి రాజ్యసభకు అవకాశం కల్పించేందుకు పార్టీ అధినేత జగన్‌ను అంగీకరింపచేస్తాని వేమిరెడ్డికి భరోసా కల్పించారు. అనుకున్నట్టుగానే జగన్ రాజ్యసభకు పార్టీ అభ్యర్థిగా వేమిరెడ్డిని ఎంపికచేసి తన మాట నిలబెట్టుకున్నారు. దీంతో ఇప్పటిదాక రాజ్యసభకు పార్టీ అభ్యర్థిగా ఎవరిని నిలబెడతారా అన్న సస్పెన్స్‌కు తెరపడింది.

చెదిరిపోకుంటే గెలుపు ఖాయమే!

త్వరలో మూడు రాజ్యసభ పదవులు ఖాళీకాబోతున్నాయి. కాంగ్రెస్ పార్టీనుంచి ప్రముఖ సినీహీరో కె.చిరంజీవి, తెలుగుదేశం పార్టీనుంచి దేవేందర్‌గౌడ్, వ్యాపారవేత్త సీఎం రమేశ్ రాజ్యసభకు ఎంపికయ్యారు. వీరి పదవీ కాలం ముగియనుండటంతో ఆ స్థానాల భర్తీకి ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో మొత్తం ఎమ్మెల్యేల సంఖ్య 175కాగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి 67మంది, టీడీపీ దాని మిత్రపక్షమైన బీజేపికి కలిపి 108మంది ఉన్నారు. అయితే మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైకాపాకు చెందిన 23 మంది ఎమ్మెల్యేలు తెలుగుదేశంలో చేరిపోయారు. దీంతో అసెంబ్లీలో వైకాపా ఎమ్మెల్యేల సంఖ్యాబలం 44కు పడిపోయింది. రాజ్యసభ ఎన్నికల్లో నెగ్గాలంటే కనీసం 44 మంది ఎమ్మెల్యేల బలం అవసరం. పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య కూడా రాజ్యసభ ఎన్నికల్లో ఒక అభ్యర్థిని గెలిపించుకునేంత ఉండటంతో జగన్ ఎన్నికలకు ఎంతో ముందుగానే పార్టీ అభ్యర్థిగా వేమిరెడ్డిని ప్రకటించారు. అయితే వైకాపా ఎమ్మెల్యేల సంఖ్య 44నుంచి ఒక్క స్థానం తగ్గినా సరే తెలుగుదేశంపార్టీ దాని మిత్రపక్షమైన బీజేపీతో కలిసి వైకాపా అభ్యర్థి విజయానికి గండికొట్టే అవకాశం లేకపోలేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి మంచి అభిమానిగా ఉన్న వేమిరెడ్డి గత 2014 సాధారణ ఎన్నికల్లో వైకాపాకు అండగా నిలిచారు.

అంతా కలిసివస్తేనే సామాజిక తెలంగాణ

- తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్ (నల్లకుంట), ప్రభ న్యూస్: సామాజిక తెలంగాణ కోసం కుల సంఘాలు, కలిసి రావాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యం నెరవేరడం లేదని అన్నారు. దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సామాజిక న్యాయం-సమగ్రాభివృద్ధి అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే సామాజిక తెలంగాణ రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు మరో ఉద్యమానికి ప్రజలను సమాయత్తం చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో టీమాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

రైతులు, నిరుద్యోగులే అజెండాగా కోదండ పార్టీ

- మార్చి 10న ప్రకటన..భారీ బహిరంగ సభ
- ఫిబ్రవరి 22, 23 తేదీల్లో పోస్టుకార్డు ఉద్యమం
- త్వరలో మార్కెట్ యార్డుల సందర్శన
- టీ జేఏసీ భేటీలో కీలక నిర్ణయాలు




హైదరాబాద్/నల్లకుంట, ఆంధ్రప్రభ : రైతు సమస్యలే ప్రధాన ఫోకస్‌గా ఉద్యమించాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ కోదండరాం తన టీమ్‌కు సూచించారు. ఆదివారం జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో కీలక నిర్ణయాలను తీసుకున్నారు. పార్టీ పెడుతున్నట్లుగా ఇప్పటికే అధికారికంగా తన నిర్ణయాన్ని ప్రకటించిన తర్వాత ఈ దిశలో పూర్తిస్థాయి కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు. మార్చి 10న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఇప్పటినుంచే ఏర్పాట్లు ముమ్మరం చేయాలని, జేఏసీ నేతలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆదివారం జరిగిన కీలక భేటీలో నిర్ణయించారు. అదే రోజున తెలంగాణ జన సమితి పేరుతో రాజకీయ పార్టీని ప్రకటించనున్న నేపథ్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఇతర పార్టీలకు ధీటుగా జన సమీకరణ జరపాలని కోదండరామ్ సూచించినట్లు తెలిసింది. పార్టీతో కలిసి వచ్చే సామీప్యత ఉన్న శక్తులను సమీకరించి భవిష్యత్ కార్యాచరణపై బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఈ నెల 22, 23 తేదీల్లో నిరుద్యోగ సమస్యపై పోస్టు కార్డుల ఉద్యమం నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించి కలెక్టర్లకు వినతి పత్రాలు అందించాలని, అయితే ఈ ఉద్యమ కార్యాచరణ తేదీలను త్వరలో ఖరారు చేయనున్నామని ఆయన జేఏసీ నేతలకు సూచించినట్లు సమాచారం.

చేతివృత్తుల ఆధునీకరణకు, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు చర్యలు తీసుకోవాలి

చేతి వృత్తుల ఆధునీకరణకు చర్యలు తీసుకొని ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోదండరాం డిమాండ్ చేశారు. చేతి వృత్తుల ఉత్పత్తులకు ముడి సరుకు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వృత్తులు- ఉపాధి- సమస్యలు -పరిష్కారాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే వృత్తులు బాగుపడతాయని భావించి అన్ని కుల, చేతి వృత్తుల వారు ఉద్యమంలో ఎంతో చురుకుగా పాల్గొన్నారని, కాని వారి ఆకాంక్షలు విరుద్ధంగా రాష్ట్రంలో పాలన సాగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు గురజాల రవీందర్‌రావు, ప్రొఫెసర్ పురుషోత్తం, చేతివృత్తుల సంఘం నాయకుడు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ఒంటిమిట్ట చెరువులో ఐదు మృతదేహాలు లభ్యం



రాజంపేట, ప్రభన్యూస్: కడప జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. జిల్లాలోని ఏకశిలానగరంగా గుర్తింపు పొందిన ఒంటిమిట్ట చెరువులో ఆదివారం ఐదు మృతదేహాలు లభించడం సంచలనం రేకెత్తించింది. మృతదేహాల మృతి వెనుక పెద్దఎత్తున అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు మూడురోజుల క్రితం చెరువులో పడి మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. విషయాన్ని తెలుసుకున్న కడప ఓఎస్‌డి ఆత్నాన్ నయీమ్ హసీమ్, రాజంపేట ఆర్డీవో వీరబ్రహ్మంల ఆధ్వర్యంలో జిల్లా అగ్నిమాపక సిబ్బంది సహకారంతో చెరువులోని ఐదు మృతదేహాలను వెలికితీశారు. ఐదుగురి శరీరాలపై షర్టులు నడుంకు టవళ్ళు ఉన్నాయి. అలాగే వెనుక వైపు స్టూడెంట్స్ బ్యాగులు తగిలించుకుని ఉన్నారు. బ్యాగులను పరిశీలిస్తే అందులో అన్నం పొట్లాలు, తాగునీటి సీసాలు, టార్చిలైట్లు ఉన్నాయి. దీంతో వీరు ఎర్రచందనం అక్రమ రవాణాలో పాల్గొనే తమిళ కూలీలా లేక పాదచారులా అన్న వ్యవహారం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఐదుమంది మృతి వెనుక అసలుకథ ఏమిటో అంతుపట్టని విషయంగా మారింది. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా మారిపోయి దుర్గంధం వెదజల్లడంతోపాటు వారికి సంబంధించి ఎటువంటి ఆధారపత్రాలు లభించకపోవడంతో పోలీసులు అయోమయంలో పడ్డారు.

కొద్దిరోజుల క్రితం లారీని ఒంటిమిట్ట పరిసరాల్లో పోలీసులు అనుమానంతో వెంబడించడం, వెంటనే తేరుకున్న లారీలోని వ్యక్తులు చెరువుకట్టపై ఆపి చెరువులో దూకి పరారైనట్లు సమాచారం. వీరికోసం పోలీసులు కూడా పెద్దఎత్తున గాలించారు. ఈ వ్యవహారం ఒంటిమిట్టలోనే కాకుండా అనేక ప్రాంతాల్లో పుకార్లు షికారు చేస్తున్నాయి. అయితే మృతిచెందిన వ్యక్తులు పాదచారులా లేక ఎవరైనా ఎక్కడైనా చంపి ఇక్కడ పడేశారా అన్న విషయాలు ప్రశ్నార్థకరంగా మారాయి. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐపీఎస్‌లు కావలెను!



- ఉన్న వారిపై పనిభారం
- కొన్నిచోట్ల ప్రమోటీలకు ప్రాధాన్యం
- అరకొర అధికారులు... అందులో కొందరు కేంద్ర సర్వీసులకు...

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నిన్నటి వరకు క్షేత్రస్థాయి సిబ్బందితో సతమతమైన తెలంగాణ పోలీసు శాఖ తాజాగా ఐపీఎస్‌ల కొరతతో ఇక్కట్లను ఎదుర్కొంటోంది. నిబంధనల మేరకు ఐపీఎస్‌లు పని చేయాల్సిన కొన్ని విభాగాలకు శాఖాధిపతులు లేకుండా పాలన సాగుతోంది. మరికొన్ని కీలక పోస్టులలో ప్రమోటీలతో నెట్టుకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారుల కొరత వల్ల కొంత మంది ఐపీఎస్ అధికారులకు ఒకటికి రెండు శాఖలు కట్టబెట్టడంతో పని భారం పెరిగి ఇబ్బందులకు గురవుతున్నారు. మరికొన్ని చోట్ల ప్రమోటీలతో కాలం వెళ్ళ దీయాల్సిన పరిస్థితి నెలకొందని అధికారులు వాపోతున్నారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ పోలీసు శాఖకు 122 మంది ఐపీఎస్‌లను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కేటాయించింది. ఇందులో డిజిపితో పాటు అయిదుగురు అదనపు డిజిపిలు, 13 మంది ఐజిలు, 11 మంది డిఐజిలు ఉండాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తేల్చింది. ఈ కేటాయింపులపై పెదవి విరిచినప్రభుత్వం పాలనకు సరిపోయే విధంగా ఐపీఎస్‌లు లేరని, 122 ఐపీఎస్ పోస్టులను 141 కి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం పలు పర్యాయాలు కోరినా కేంద్రం చేతులెత్తేసింది.

2014 జూన్ 2 తర్వాత రాష్ట్రంలో పాలనా సౌలభ్యం కోసం అదనంగా 21 జిల్లాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకుంది. జిల్లాల పెంపు, గతంలో ఉన్న అధికారులు కొంత మంది పదవీ విరమణ చేసిన దరిమిలా ఐపీఎస్ అధికారులను పెంచాలన్న వత్తిడి కేంద్రంపై రాష్ట్రం తీవ్రం చేసినా ఫలితం కనిపించడం లేదు. దీంతో కేటాయించిన 122 మంది ఐపీఎస్‌లనైనా తమకుండే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. 122 మంది ఐపీఎస్‌లకు బదులుగా ప్రస్తుతం 84 మంది మాత్రమే ఉన్నారు. 31 జిల్లాలతో పాటు ప్రత్యేక బలగాలు, పాలనా సౌలభ్యం కోసం వేర్వేరు విభాగాల పర్యవేక్షణ తదితర వాటి బాధ్యతలను కూడా ఐపీఎస్‌లే చూడాల్సి ఉంది.

కొన్ని కీలకమైన విభాగాలకు అధికారుల కొరత వల్ల ప్రమోటీలతోనే నెట్టుకొస్తున్నారు. నుంచి నేటి వరకూ కావాల్సిన మేర ఐపీఎస్‌లు లేకపోవడంతో చేసేది లేని అధికారులు ప్రమోటీలతో కాలం వెళ్ళదీస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌లతో పాటు పలు చోట్ల ప్రమోటీ డిసిపిలను నియమించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు అంటున్నారు. వాస్తవానికి వీటిల్లో గ్రూప్ 1 అధికారులను కానీ ఐపీఎస్‌లను కానీ నియమించాల్సి ఉందని అధికారులు అంటున్నారు. అదే విధంగా డిజిపి కార్యాలయంలోని కొన్ని కీలక బాధ్యతలలోనూ ప్రమోటీలతో నెట్టుకు రావాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

రాష్ట్రంలో అత్యంత కీలకమైన ఎసిబికి పూర్తి స్థాయి అధికారిని నియమించినప్పటికీ పోలీసు రిక్రూట్‌మెంట్ విభాగం బాధ్యతలను కూడా అలాగే ఉంచారు. మరో అధికారికి తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ (టిఎస్‌పిఎ) బాధ్యతతో పాటు డిజిపి కార్యాలయంలో మరో బాధ్యతను కూడా ఇచ్చారు. ఇదే తరహాలో చాలా మంది అధికారులు రెండు శాఖల బాధ్యతలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కమిషనరేట్ పరిధిలోని డిసిపిలతో పాటు జిల్లాలలో పని చేస్తున్న ఎస్‌పిలలో కొంత మంది ప్రమోటీలు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. వీరంతా సమర్థవంతంగా పని చేస్తున్నప్పటికీ నిబంధనల ప్రకారం సరైంది కాదని అధికారులు పేర్కొంటున్నారు. హైదరాబాద్ నగర టాస్క్ ఫోర్స్ విభాగానికి డిసిపి స్థాయి అధికారి పర్యవేక్షణ ఉండాల్సిన చోట అదనపు డిసిపి స్థాయి అధికారితోనే నెట్టుకు వస్తున్నారు. వాస్తవానికి హైదరాబాద్‌లోని ఆయిదు జోన్లల్లో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేయాలని ఎప్పుడో నిర్ణయిం చారు. కానీ ఉన్న టీంకే అధికారి లేకపోవడంతో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ మొత్తానికి ఒకే ఒక టాస్క్‌ఫోర్స్ బృందంతో సరిపెట్టు కోవాల్సిన పరిస్థితి ఉంది.

కేంద్ర సర్వీసులలో ఆరుగురు అధికారులు

అసలే అంతంత మాత్రంగా ఉన్న అధికారులతో శాంతిభద్రతలను కాపాడుతున్న పోలీసు ఉన్నతాధికారులకు కేంద్ర సర్వీసులకు డిప్యూటేషన్ వెళ్ళే అధికారుల సంఖ్య పెరగడం కూడా ఇబ్బందికరంగా తయారవుతోంది. ఇప్పటికే ఆరుగురు అధికారులు కేంద్రసర్వీసులలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. వీరితో సిఆర్‌పిఎఫ్ అదనపు డిజిగా సుధీప్ లక్డాకియా, ఎన్‌సిఆర్‌బి డిజిగా ఈష్‌కుమార్, ఇంటెలీజెన్స్ బ్యూరో జాయింట్ డైరెక్టర్‌గా ప్రభాకర్ అలోక్, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తరపున షిల్లాంగ్ జాయింట్ డైరెక్టర్‌గా వినాయక్ ఆప్టే, ఇంటెలీజెన్స్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్‌గా రీతుమిశ్రా, సిఐఎస్‌ఎఫ్ డిఐజిగా విక్రమ్‌సింగ్ మాన్‌లు పని చేస్తున్నారు. తాజా గా సిఐఎస్‌ఎఫ్ ఐజిగా సివి ఆనంద్, సిఆర్‌పిఎఫ్ ఐజిగా చారూసిన్హా వెళ్తున్నారు.

అధికారుల కొరతతో సతమతమవుతున్న సిఐడి

వైట్ కాలర్ నేరాలు, సైబర్ నేరాలతో పాటు పలు కీలకమైన నేరాలను విచారించే సిఐడిపై అధికారుల కొరత ప్రభావం తీవ్రంగా పడుతోంది. అదనపు డిజితో పాటు ఇద్దరు ఐజిలు, నలుగురు డిఐజిలు ఉండాల్సిన సిఐడి కేవలం ఒక ఎడిజితో పాటు ఐజి, డిఐజితోనే కాలం నెట్టుకు వస్తోంది. ఫలితంగా పలు కేసుల విచారణ కుంటుపడుతోంది.

Andhraprabha business 2018

బిజినెస్

BUSINESS

రిఫైనరీల విస్తరణకు

రూ. 70కోట్ల పెట్టుబడులు : ఐఓసీ

న్యూఢిల్లీ : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) చమురుశుద్ది సామర్థ్యాన్ని పెంచడానికి 2030 నాటికి రూ.70వేల కోట్ల పెట్టుబడులు పెడుతుంది. ఐఓసీ ప్రస్తుతం 80.7 మిలియన్ టన్నుల చమురుశుద్ది సామర్థ్యాన్ని 2030 నాటికి 116.55 మిలియన్ టన్నులుకు పెంచుతుందని కంపెనీ ఉన్నతా ధికారి ఒకరు చెప్పారు. ప్రస్తుతం వినియోగం కం టే ఉత్పత్తి ఎక్కువగా ఉం ది. సుమారు 247.6 మిలియన్ టన్నులని ముడిచమురు అవసరమని, ఏడాదికి 3.5 నుంచి 4శాతం వినియోగం పెరు గుతోంది.. ఈ డిమాండ్‌ను తట్టుకోవడానికి సామర్థ్యాన్ని పెంచుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కాగా అమెరికాకు చెందిన ఎనర్జీ ఇన్ఫర్మేషన్ ఏజెన్సీ అంచనా ప్రకారం 2040 నాటికి భారతీయ 434 మిలియన్ టన్నుల ఇంధన అవసరం ఏర్పడు తుందని, ప్రస్తుతం 194 మిలియన్ టన్నులని తెలిపింది. అయితే ఇండియన్ ఎనర్జీ ఏజెన్సీ మాత్రం 450 నుంచి 492 మిలియన్ టన్నుల వరకు ఇంధన అవసరాలుండవచ్చునని అంచనా వేసింది. ప్రభుత్వ రంగానికి చెందిన మిగిలిన చము రుసంస్థలు కూడా చమురుశుద్ది సామర్థ్యాన్ని పెంచుకునే ఆలోచనలో ఉన్నాయి.



కేటాయింపులతో 'రాబడులు'

సంస్కరణలతో.. వ్యవస్థలో మార్పు

- మేగ్నటిక్ మహారాష్ట్ర సదస్సులో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ
- రూ. 10లక్షల కోట్లు పెట్టుబడులే లక్ష్యం
- 35లక్షల మందికి ఉపాధి
- మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్



ముంబై : బీజేపీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం బడ్జెట్‌లో సంస్కరణల ద్వారా కొత్త పని సంస్కృతిని తెచ్చిందని తెచ్చిందని.. దీంతో దేశవ్యాప్తంగా సామాజిక ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులు కనిపిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇక్కడ జరుగుతున్న మేగ్నటిక్ ఇండియా సదస్సులో మాట్లాడుతూ అన్నారు. సంక్షోభ సమయంలో తమ ప్రభుత్వం పలు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. తమ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులకే పరిమితం కాకుండా వాటి ఫలితాలను రాబడుతున్నామని ఆయన అన్నారు. గత మూడున్నర సంవత్సరాలా కాలంలో కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల ద్వారా బలహీనమైన ఆర్థిక వ్యవస్థ నుంచి బలమైన ఆర్థిక వ్యవస్థగా మారిందని త్వరలోనే భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారనుందన్నారు. త్వరలోనే మహారాష్ట్ర కూడా ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుతుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. పటిష్టమైన విధానాలు.. పక్కా ప్రణాళిక, నిర్వహణ ద్వారా దేశాన్ని మరింత అభివృద్ది పథంలోకి తీసుకుపోవచ్చునని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇక్కడ చెప్పారు. గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ 'మాగ్నెటిక్ మహారాష్ట్ర' సదస్సును ఆయన ఆదివారం ప్రారంభించారు. తన ప్రసంగంలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించిన రాష్ట్రంగా మహారాష్ట్ర రికార్డు కెక్కుతుందన్నారు. ఈ సదస్సుకు సుమారు 150 మంది పెద్దకంపెనీల సీఈవోలు హాజర య్యారు. ప్రస్తుతం దేశం సరైన దిశలో ముందుకు పోతోందని.. అన్ని లావాదేవీలు పారదర్శకంగా పనిచేస్తున్నా యన్నారు. ప్రభుత్వం విధానాలతో పాటు ప్రజాస్వామ్య బద్దంగా ప్రభుత్వం అన్నిటికి బాధ్యత వహిస్తోందన్నారు. దేశ అభివృద్ది పథంలో దూసుకుపోవాలంటే సంపూర్ణదృష్టితో చూడాలని, అప్పుడే పురోభివృద్ది చెందుతున్నారు. తన ప్రభుత్వం పటిష్టమైన విధానం, పక్కా ప్రణాళిక, నిర్వహణతోనే దేశం ముందుకు పోతుందని భావిస్తున్నామన్నారు. తన అంచనా ప్రకారం మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ(రూ.65లక్షల కోట్లు)కు చేరుతుందన్నారు. గతమూడుసంవత్సరాలనుంచి మహారాష్ట్రప్రభుత్వం పెట్టుబడులు ఆకర్షిం చడానికి గట్టి చర్యలు తీసుకుందన్నారు. మహారాష్ట్ర అభివృద్దిని చూసే తమ ప్రభుత్వం భవిష్యత్తులో భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటుందన్నారు. ఫ్రోస్ట్ అండ్ సుల్లివాన్ ర్యాంకింగ్‌లో మహారాష్ట్ర దేశంలో నెంబర్ వన్ స్థానాన్ని సాధించిందని.. అన్ని రంగాల్లో అభివృద్ది పథంలో దూసుకుపోతోందని ప్రధాని అన్నారు. ఫిబ్రవరి 2016లో ముంబైలో ప్రధానమంత్రి మేకిన్ ఇండియాను ప్రారంభించిన తర్వాత మళ్లీ ఆ స్థాయిలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. దీని ట్యాగ్‌లైన్ 'మేడ్ ఫర్ బిజినెస్' అని పెట్టారు. 5,000 ఎంఓయులపై ఒప్పందాలు : ఇదిలా ఉండగా మహారాష్ట్రప్రభుత్వం ఈసదస్సులో కనీసం 5,000 ఎంఓయులు అవగాహన ఒప్పందాలు కుదర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని ద్వారా రూ. 10 లక్షల కోట్లు పెట్టుబడులు రాబట్టాలని చూస్తోంది. సుమారు 35 లక్షల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఈ బిజినెస్ సదస్సుపాటు ఈ నెల 23 వరకు ఎగ్జిబిషన్ ను కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 23 ప్రాజెక్టులను ఈ ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా ఉంచుంది. వాటిలో ముంబై మెట్రో, ముంబై - నాగపూర్ సూపర్ కమ్యూనికేషన్ ఎక్స్‌ప్రెస్‌వే, ముంబై - కోస్టల్ రోడ్, ముంబై ట్రాన్స్ - హార్బర్ లింక్, నవీ ముంబైఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ దీనికి ప్రధానమంత్రి మోడీ ఆదివారం నాడు శంకుస్థాపన చేశారు.

నాలుగు సూత్రాలపై మేగ్నటిక్ మహారాష్ట్ర :ఫడ్నవీస్

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ మెగ్నెటిక్ మహారాష్ట్ర మొత్తం నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉందని.. అవి ఉద్యోగం, స్థిరత్వం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (మౌలిక), భవిష్యత్ పరిశ్రమలపై ఆధారపడి ఉందన్నారు. పారిశ్రామికాభివృద్దికి మహారాష్ట్ర మహాద్వారం(గేట్‌వే) అవుతుందన్నారు. వినూత్నమైన పారిశ్రామిక వాడలకు స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు చి రునామా మహారాష్ట్ర అవుతుందన్నారు.

మహీంద్రా గ్రూపు పెట్టుబడులు రూ.2,325 కోట్లు



మహీంద్రా గ్రూపు మహారా ష్ట్ర లో మొత్తం మూడు ప్రా జెక్టులపై రూ.2,300 కోట్లు పెట్టు బడులు పెడుతుంది. వాటి లోనే సుమారు రూ.1,700 కోట్లు వినో ద కార్యక్ర మాల ప్రాజెక్టును ఇక్కడి కాందివల్ ప్రాంతంలో మెగాపోలిస్ వద్ద పెట్టు బడులు పెడుతున్నట్టు ఎంఅండ్ఎం గ్రూపు చైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. నాగపూర్‌లో టెక్ మహీంద్రా రూ.125 కోట్ల పెట్టుబడితో గ్రీన్ టెక్ హబ్‌ను ఏర్పాటు చేస్తుందని సు మారు రూ.2,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఇ పృటికే మహీంద్రా గ్రూపు నాలుగు లీజర్ సర్వీసెస్‌ను విజ యవంతంగా నడిపిస్తోందన్నారు. మహీంద్రా హాలీడేస్ పర్యా టక రంగంలో దూసుకుపోతుందన్నారు. మరో రూ.500 కోట్లను కొత్త ఎలక్ట్రిక్ వెహికిల్ విధానానికి కేటాయిస్తామని మహీంద్రా అన్నారు.

ముంబై -పూనే హైపర్‌లూప్ ప్రాజెక్టు వర్జిన్‌గ్రూపు..



మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొని ముంబై - పూనేల మధ్య హైపర్‌లూప్ రవాణా వ్యవస్థ నిర్మాణ వ్యవస్థను చేపట్టబోతోంది. దీంతో ముంబై - పూనే మధ్య ప్రస్తుతం ప్రయాణానికి సుమారు మూడు గంటల సమయం పడుతుంది. హైపర్‌లూప్ అందుబాటులోకి వస్తే రెండు నగరాల మధ్య ప్రయాణం కేవలం 20 నిమిషాల్లో చేరుకోవచ్చు. మహారాష్ట్రప్రభుత్వం వర్జిన్ గ్రూపు ఒప్పందం కుదుర్చుకుందని గ్రూపు చైర్మన్ రిచర్డ్ బ్రాన్సన్ చెప్పారు. ఆయన కూడా ఈ సదస్సుకు హాజరయ్యారు. సంవత్సరానికి హైపర్‌లూప్ ద్వారా 1.5కోట్ల మంది ప్రయాణించవచ్చునని ఆయన అన్నారు. దీంతో మహారాష్ట్ర రవాణా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ ప్రాజెక్టుపై సుమారు 5500 కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరం అవుతాయని.. వేలాది మందికి ఉద్యోగాలు కల్పించవచ్చునని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు వ్యయంతో పాటు ఎన్ని సంవత్సరాల్లో పూర్తవుతుందో వివరాలు మాత్రం ఇంకా ప్రకటించలేదు.

ముఖేష్ అంబానీ వాటా రూ.60వేల కోట్లు



బిలియనీర్ ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీతో పాటు దాని గ్లోబల్ భాగస్వా ములు కలిసి మహారాష్ట్రలో ఇంటిగ్రే టెడ్ డిజిటల్ రంగం గంలో సుమారు రూ.60వేల కోట్లు పెట్టుబ డులు పెడతామని ఆయన ఇక్కడ జరుగుతున్న మాగ్నెటిక్ మహారాష్ట్ర ఇన్వెస్టర్ సమ్మిట్‌లో ప్రకటించారు. అయితే ఈ పెట్టుబడులు ఎక్కడెక్కడ పెడతామనే విషయాన్ని స్పష్టం గా చెప్పలేదు. అయితే తమ ప్రాజెక్టులకు గ్లోబల్ ఇన్వెస్టర్లను మంచి స్పందన లభించిందన్నారు. వారం రోజుల్లోగా 20 గ్లోబల్ కంపెనీలు తమ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయని అంబాని అన్నారు. వాటిలో సిస్కో,సీమన్స్; హెచ్‌పీ, డెల్, నోకియా, నివిడా లని వివరించారు. ఆయన మాట్లాడుతూ తయారీరంగంలో చైనా విప్లవాత్మకమైన విజయాలు సాధించి రికార్డు సాధిస్తే, భారత్ దాని కంటే వేగంగా తయారీరంగంలో పారిశ్రామిక విప్లవాన్ని సాధిస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికే టెలికంరంగంలో జియోఎలెక్ట్రిక్వర్క్ పేరుతో రూ.1.40 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టింది. తాజాగా మరో రూ.60వేల కోట్లు పెట్టుబడులు పెడతామని ముందుకొచ్చింది.

నీరవ్ తర్వాత.. కొఠారి?

- రోటోమాక్ పెన్ అధినేత



కాన్పూర్ : ఇటీవల వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకుకు సుమారు రూ.11,400 కోట్లు కుచ్చుటోపీ పెట్టాడు. తాజాగా బ్యాంకింగ్ వర్గాల సమాచారం ప్రకారం ఈ స్కాం రూ.17,600 కోట్లని చెబుతున్నారు. ప్రస్తుతం మోడీ బ్యాంకుకు పంగనామాలు పెట్టి అమెరికాలోని జెడబ్ల్యు మారియట్ హోటల్‌లో విలాసవంతమైన సూట్‌లో సేదతీరుతున్నాడు. ఇదిలా ఉండగా తాజాగా రోటోమాక్ పెన్స్ యజమాని విక్రం కొఠారి కూడా కాన్పూర్ నుంచి మాయమయ్యాడని చెబుతున్నారు. ఆయన బ్యాంకులకు సుమారు రూ.837 కోట్లు బకాయిపడ్డారని చెబుతున్నారు. మోసగాళ్లకు ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు కామధేనువులుగా తయారయ్యాయి. కొఠారి విషయానికి వస్తే అలహాబాద్ బ్యాంకుకుచెందిన కాన్పూర్ బ్రాంచీ నుంచి రూ.352 కోట్ల రుణం తీసుకున్నారు. వీటిలో పాటు బ్యాంకు ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, యూనియన్ బ్యాంకుల నుంచి సుమారు రూ.485 కోట్ల వరకు రుణాలు తీసుకున్నారని విశ్వసనీయవర్గాల సమాచారం. అలహాబాద్‌కు చెందిన రికవరి ఏజెంట్ రమేశ్‌గుప్తా మాత్రం కొఠారికి చెందిన ఆస్తులను జప్తు చేయనున్నామని ప్రకటించారు. అలహాబాద్ బ్యాంకు విక్రం కొఠారి నుంచి బకాయిలు వసూలు చేసే పనిలో పడింది. ఆయన ఆస్తులను తనఖా పెట్టకొని రుణాలు ఇవ్వామని బ్యాంకు చెబుతోంది. కాబట్టి ఆయన వీలైనంత వరకు ఎక్కువ మొత్తంలో రుణాలు వసూలు చేసుకుంటామని బ్యాంకు భరోసా వ్యక్తం చేస్తోంది. కొఠారి ఖాతాను బ్యాంకు ఎన్‌పిఏ కింద తన పద్దుల్లో రాసుకుంది. గత వారం నుంచి కాన్పూర్‌లోని కొఠారి కార్యాలయం మూసివేయబడింది. ఆయన కూడా అందుబాటులో లేరు. పీఎన్‌బీ మోసం వేసు బట్టబయలు కాగానే కొఠారి కూడా మాయం అయ్యారని చెబుతున్నారు.

వడ్డీరేట్లు యథాతథం

- కొటక్ పరిశోధన పత్రం

kotak

న్యూఢిల్లీ : ఈ ఏడాది జూన్ వరకు రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించే అవకాశాలున్నాయని బ్రోకరేజి సంస్థలు నివేదికలు పేర్కొన్నాయి. పెరిగిపోతున్న రిటైల్ ద్రవ్యోల్బణంతో పాటు రుతుపవనాలపై స్పష్టతవచ్చేంత వరకు ప్రస్తుత కనీస మద్దతు ధర, ముడి చమురు ధరల తదితర అంశాలు వడ్డీరేట్ల తగ్గింపునకు అడ్డంకిగా మారాయని కొటక్ పరిశోధన పత్రం లో ప్రకటించింది. రిటైల్ ద్రవ్యోల్బణం జూన్ నాటికి 5.85 శాతానికి ఎగబాకే అవ కాశాలున్నాయని పత్రంలో వివరించింది. మొత్తానికి ఆర్‌బీఐ పరిస్థితులను నిశి తంగా గమనిస్తోందని పేర్కొంది. ఫిబ్రవరి 7న జరిగిన ద్రవ్య పరపతి సమీ క్షలో ఆర్‌బీఐ వడ్డీరేట్లను యథాతథంగా 6 శాతంగా కొన సాగించడానికి నిర్ణయం చేసింది. ఇదిలా ఉండగా గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ మార్గాన్ స్టాన్లీ మాత్రం 2018 చివరి త్రైమాసికంలో వడ్డీరేట్లను పెంచుతాయని ప్రకటించింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడంతో పాటు ద్రవ్యోల్బణం పెరిగే అవకా శాలున్నందు వల్ల కొన్ని క్వార్టర్‌లో వడ్డీరేట్లు పెరుగుతాయని మోర్గాన్‌స్టాన్లీ అంచనా వేసింది.

పీఎస్‌యూ బ్యాంకుల నుంచి

వాటాలు తగ్గించుకోండి

- ప్రభుత్వానికి అసోచామ్ సూచన



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400 కోట్ల భారీ స్కాం బహిర్గతం కావడంతో.. ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకుల్లో తమ వాటాను 50 శాతం కంటే తగ్గించుకోవాలని భారత పారిశ్రామిక మండలి అసోచామ్ ప్రభుత్వాన్ని కోరింది. ప్రైవేట్ బ్యాంకుల మాదిరిగా పీఎస్‌యు బ్యాంకులు వ్యవహరించడానికి అనుమతించరాదని, వాటాదారులకు బాధ్యతను వహించాల్సి ఉంటుందన్న స్పృహ ఉండాలని, అదేసమయంలో డిపాజిటర్ల ప్రయోజనం కాపాడాల్సి బాధ్యత ఉంటుందని అసోచామ్ ప్రభుత్వానికి గుర్తు చేసింది. పీఎన్‌బీ ముంబై బ్రాంచీ నుంచి రూ.11,400కోట్ల విలువ చేసే లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్స్ (ఎల్ఓయు)లు మోసపూరితంగా జారీ చేసి బిలియనీర్ నగల వ్యాపారి నీరవ్ మోడీకి అప్పగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పీఎస్‌యు బ్యాంకులు ఒక సంక్షోభం తర్వాత మరో సంక్షోభంలో కూరుకుపోతున్నాయని, దీనికి ఒక హద్దు అంటూ ఉండాలని ప్రభుత్వానికి గుర్తు చేసింది. పన్ను చెల్లింపుదారుల డబ్బుతో బ్యాంకులకు ఎన్ని సార్లు బెయిల్ అవుట్ ప్యాకేజీలు ఇచ్చి ఆదుకుంటారని ప్రశ్నించింది.

ప్రస్తుతం పీఎస్‌యు బ్యాంకుల్లో పని చేసే ఉన్నతాధికారులు ప్రభుత్వం ఉద్యోగులా భావిస్తున్నారని, ప్రస్తుతం సీనియర్ మేనేజ్‌మెంట్ హోదాలో పనిచేసే వారు ప్రభుత్వ ఉన్నతాధికారుల కనుసన్నల్లో పనిచేస్తున్నారని, వారు రోజు వారి బ్యాంకింగ్ వ్యవహారాల్లో అనవసరపు జోక్యం చేసుకుంటున్నారని అసోచామ్ ఆవేదన వ్యక్తం చేసింది. బ్యాంకు ఉన్నతాధికారులు వివిధ సమయాల్లో ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో గడపడం వల్ల బ్యాంకుల్లో జరిగే కీలకలావాదేవీలపై ముఖ్యంగా రిస్క్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి పెట్టలేకపోతున్నారని పేర్కొంది. ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకుల్లో తమ వాటాను 50 శాతం కంటే తగ్గించుకుంటే బ్యాంకులు స్వయం ప్రతిపత్తి తో పాటు సీనియర్ మేనేజ్‌మెంట్ బాధ్యతతో వ్యవహరిస్తారని అసోచామ్ పేర్కొంది. బ్యాంకు బోర్డులో జవాబుదారీ విధాన నిర్ణయాలు తీసుకోవాలని, సీఈవోలు పూర్తిస్థాయిలో బాధ్యతతో పనిచేయాలని, ప్రభుత్వ అధికారుల ఆదేశాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు దురాదని పేర్కొంది. ప్రస్తుతం రోజుకో కొత్త కొత్త టెక్నాలజీ రావడంతో బ్యాంకింగ్ రంగం కూడా వాటిని అమలు చేస్తోంది. ఈ టెక్నాలజీలు ఇటు వరంగాను శాపంగా మారిపోతున్నాయని తెలిపింది. అసోచామ్ సెక్రెటరీ జనరల్ డీఎస్ రావత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగం దీనిపై పూర్తిస్థాయిలో ఆత్మపరిశోధన చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బ్యాంకింగ్ రంగానికి స్వయంప్రతిపత్తి కల్పించాలని కోరుతూనే, బ్యాంకింగ్ రంగం వ్యాపారంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని ఆయన కోరారు. దీనికి రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా నాయకత్వం వహించి, బ్యాంకింగ్ రంగంలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.

ప్రాజెక్టుల ఆలస్యం...

ప్రభుత్వానికి ఆర్థిక భారం

- 349ఇన్‌ఫ్రా ప్రాజెక్టులపై రూ. 2లక్షల కోట్లపైనే....



న్యూఢిల్లీ : ప్రభుత్వ చేపట్టిన మౌలికరంగానికి చెందిన ప్రాజెక్టులు ఆలస్యం అయ్యే కొద్ది ఈ ప్రాజెక్టులపై వ్యయం మరింత పెరుగుతూపోతోంది. ఇప్పటి వరకు 349 ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు ఒక్కో ప్రాజెక్టు రూ.150 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ విలువ చేసేవి. ఈ ప్రాజెక్టులు వివిధ కారణాల వల్ల ఆలస్యం కావడంతో వీటిపై వ్యయం అదనంగా రూ.2 లక్షల కోట్లు దాటిపోతోందని ప్రభుత్వం విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడించింది. మౌలికరంగానికి చెందిన ప్రాజెక్టులు రూ.150 కోట్లు లేదా అంతకంటే విలువైన ప్రాజెక్టును కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ ప్రాజెక్టు అమలుపై పర్యవేక్షిస్తోంది. వ్యవహారంగా చూస్తే మొత్తం 1283 ప్రాజెక్టులు రూ.15,58,352.33 కోట్ల వ్యయం చేయాల్సి ఉండగా.. వివిధ కారణాల వల్ల జాప్యం కావడంతో ఈ ప్రాజెక్టులపై వ్యయం ప్రస్తుతం రూ.17,59,448 3.87కోట్లను దాటిపోతోంది. వాస్తవ ప్రాజెక్టు వ్యయం కంటే అదనంగారూ.2,01,091.54 కోట్లు లేదా వాస్తవ వ్యయం కంటే 12.90 శాతం పెరుగుతుందని మంత్రిత్వశాఖ విడుదల చేసిన తాజా నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక అక్టోబర్ 2017లో విడుదల చేసింది. మొత్తం 1283 ప్రాజెక్టుల్లో 349 ప్రాజెక్టుల వ్యయం 302 రెట్లు పెరిగింది. ఈ ప్రాజెక్టులపై 6,59, 009.46 కోట్లు వ్య యం అవుతుందని భావిస్తే ప్రస్తుతం ఇది 37.46 శాతం పెరిగా యి. 1283 ప్రాజెక్టు ల్లో 12 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. 34 కొత్త ప్రాజెక్టులను ఈ నెలలో మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్టుపై పర్యవేక్షణ జరుపుతుంది. 13 ప్రాజెక్టులు మాత్రం షెడ్యూలు కంటే ముందు న్నాయి. 317 ప్రాజెక్టులు షెడ్యూలు ప్రకారం పనులు కొనసాగుతు న్నాయి. 302 ప్రాజెక్టులు ఆలస్యంగా కొనసాగుతున్నాయి. 349 ప్రాజెక్టుల వ్యయం మాత్రం భారీగా పెరిగిపోతోంది. 105 ప్రాజెక్టుల విషయానికి వస్తే ఇటు ఆల స్యంతో పాటు వ్యయం కూడాపెరిగిపోతోందని నివేదికలో వివరించింది. మొత్తానికి చూస్తే 258 ప్రాజెక్టుల్లో ఆలస్యం కొంత తగ్గించుకుంటూ వచ్చాయి.. తాజాగా షెడ్యూలు పూర్తి సవరించారు. 302 ఆలస్యం ప్రాజెక్టుల గురించి ప్రస్తావిస్తూ 49 ప్రాజెక్టులు 1 నెల నుంచి 12 నెలల వరకు, 66 ప్రాజెక్టులు 13 నుంచి 24 నెలల వరకు, 108 ప్రాజెక్టులు 25 నుంచి 60 నెలల వరకు, 79 ప్రాజెక్టులు 61 నెలల అంతకంటే ఎక్కువ సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టుల ఆలస్యం అయ్యి వ్యయం పెరగడానికి దారి తీసిన పరిణామాల గురించి వివరిస్తూ.. భూసేకరణ ఆలస్యంతో పాటు అటవీ అనుమతులు, పరికరాలు సమయానికి సరఫరా చేయకపోవడం, నిధులు కొరత, మావోల ఇబ్బందులు, న్యాయపరమైన చిక్కులు, శాంతిభద్రతల పరిస్థితుల కారణంగా ప్రాజెక్టుల ఆలస్యం అవుతున్నాయని నివేదికలో వివరించింది.

ఈ వారం మార్కెట్

పీఎన్‌బీ సంక్షోభం...గ్లోబల్ పరిణామాలు


- ముడి చమురు ధరలు కీలకం
- ఫలితాల సీజన్ సమాప్తం



న్యూఢిల్లీ : ఈ వారం స్టాక్ మార్కెట్లకు కీలకం కానున్న అంశాల విషయానికి వస్తే గ్లోబల్ మార్కెట్లో సంభవించే పరిణామాలు, ముడిచమురు ధరలతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంకుల్లో జరిగిన భారీ కుంభ కోణం ప్రభావితం చేయబోతున్నాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే డిసెంబర్ త్రైమాసికం ఫలితాల సీజన్ దా దాపు ముగిసినట్లు లెక్క. ఇక దేశ ఆర్థిక వ్యవస్థ పరిణామాలకి వస్తే ఆందోళన కలిగించే అంశా నికి వస్తే.. పెరిగిపోతు న్నాన్న వాణి జ్యలోటు అని వారు చెబుతు న్నారు. ఇప్పటికి మార్కెట్లో 5 శాతం కరెక్షన్ కనిపిస్తోంది. ఇక్కడి నుంచి మా ర్కెట్ స్థిర పడే అవకాశాలున్నా, ఇన్వె స్టర్లకు ప్రధా నంగా ఆందో ళన కలిగించే అంశం వాణిజ్య లోటు అని వారు చెబుతు న్నారు. పీఎస్ యు బ్యాంకుల్లో ఏదో ఒకరూపంలో రోజుకో స్కాం బయట పడుతుండడంతో మిగిలిన బ్యాంకుల పై కూడా ఇన్వెస్టర్లు ఆందో ళన వ్యక్తం చేశారు. తాజాగా పీఎన్‌బీలో రూ.11,400 కోట్ల స్కాం వెలుగు చూడ్డంతో దాని ప్రభావం మిగిలిన పీఎస్‌యు బ్యాంకులపై కనిపిస్తోంది. పీఎన్‌బీ జారీ చేసిన ఎల్‌ఓయు తీసుకొని వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ యూనియన్ బ్యాంకు, అలహాబాద్, యాక్సిస్ బ్యాం కుల నుంచి రుణా లు తీసుకున్నారు. ఈ బ్యాంకులు కూడా పరో క్షంగా నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డా యి. స్కాం బహిర్గతం కావడంతో పీఎన్‌బీఐ 52 వా రాల కనిష్టానికి దిగివచ్చింది. దీంతో మిగిలిన పీఎస్‌యు బ్యాంకుల షేర్లపై ప్ర భావం కనిపిం చింది. శుక్రవారం నాడు పీఎన్‌బీ, ఎస్‌బీఐ, యూనియ న్ బ్యాంకు, అలహాబాద్, యాక్సిస్ బ్యాంకుల నష్టాలను చవిచూశాయి. దేశీయ పరిణామాలతో పాటు ముడి చమురు ధరలు ఈ వారం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపించ బోతున్నాయి. గత వారం స్టాక్ మార్కెట్ 286.71 పాయింట్ల నష్టపోగా.. నిఫ్టీ 93.20 పాయింట్లు క్షీణించింది

విస్తరణబాటలో

రెయిన్‌బో హాస్పిటల్స్



హైదరాబాద్ : చిల్డ్రన్స్ హెల్త్‌కేర్ చెయిన్ రెయిన్‌బో గ్రూపు ఆఫ్ హాస్పిటల్స్ కొత్త గా రెండు ఆస్పత్రు లను అందుబాటు లోకి తేబోతోం ది. వచ్చే ఏడాది చివరి నాటికి రూ.150 కోట్లు పెట్టుబడులతో మొత్తం 320 పడకల ఆస్పత్రిని ప్రారం భించబోతోంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం మొత్తం పది ఆస్పత్రుల్లో 1080 పడకల ఆస్పత్రి నిర్వహిస్తోంది. మరో రెండు పిల్ల ల ఆస్పత్రులను చెన్నై, విశాఖపట్నంలలో 150 పడకల ఆస్పత్రిని ప్రారం భించబోతున్నట్లు రెయిన్‌బో గ్రూపు హాస్పిటల్స్ చైర్మన్ ఎండీ రమేశ్ కంచర్ల తెలిపారు. వీటితో పాటు ప్రస్తుతం బెంగళూరు, విజ యవాడలో ఉన్న ఆస్పత్రులను విస్తరి స్తున్నట్లు వీటికి అదనపు పడకలను పెంచు తున్నట్లు ఆ యన తెలిపారు. మొత్తం పెట్టుబడులు రూ.150 కోట్ల వరకు ఉంటా యన్నారు. పెట్టుబడులు అంతర్గతంగా సమకూర్చుకుం టామ న్నారు. ఈ గ్రూపు 1999లో ప్రారం భించింది. మల్టీస్పెషా లిటి చిల్డ్రన్ హాస్పిటల్స్ హైదరా బాద్, విజయవాడ, బెంగళూరు, ఢిల్లీలో చిన్న పిల్లల ఆస్పత్రులను నిర్వహిస్తోంది.

ఐపీఓకు 8 పీఎస్‌యూ కంపెనీలు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన మొత్తం ఎనిమిది కంపెనీలు వచ్చే ఆర్థిక సం వత్సరంలో ఐపీవో మార్కెట్‌కు రానున్నా యి. వాటిలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్, రైట్స్‌లున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీవో)కు రావడం ద్వారా ప్రభుత్వం లి స్టింగ్ చేయ మి తెలుస్తోంది. కంపెనీల బాధ్యతను తంగా పనిచేయడానికి వీలుంటుంది. డిపా ర్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) కార్యదర్శి నీరజ్‌గుప్తా మాట్లాడుతూ.. ఈ కంపెనీ ఇష్యూ ధర, మార్కెట్లోకి ఎప్పుడు వస్తాయి త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఐపీవోకు రావడం ద్వారా సెబీ నుంచి అనుమతులు కూడా తీసుకోవాలి. ప్రభుత్వం ఈ కంపెనీ నుంచి పది శాతం వాటాలు విక్రయించాలనే ఆలోచనలో ఉంది. వీటితో పాటు నాలుగు పీఎస్‌యులు, రైట్స్, ఐఆర్‌సీఓఎన్, భారత్ డైనమిక్స్, మిధానిలు ఇప్పటికే సెబీ వద్ద ఐపీఓ దరఖాస్తు చేసుకున్నాయి. రైట్స్ ఐపీఓ ద్వారా ప్రభుత్వం 12 శాతం వాటాలు విక్రయించి సుమారు రూ.600కోట్లు సేకరించాలనే ఆలోచనలో ఉంది. దీంతో పాటు 13.90 శాతం వాటాలను ఇండియన్ రెన్యుబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్ఈడీఏ),రక్షణ రంగానికి చెందిన భారత్ డైనమిక్స్‌లో 12 శాతం, మిశ్రధాతు నిగంలో 25 శాతం వాటాలు విక్రయించాలనే ఆలోచనలో ఉన్నాయి.

వైద్య పీజీ సీట్లకు నేషనల్ పూల్ పద్ధతి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ :ఈసారి పీజీ వైద్య సీట్లకు నేషనల్ ఫూల్ పద్ధతిని అమలు చేయనున్నారు. దీంతో రాష్ట్ర విద్యార్థులు దేశవ్యాప్తంగా వైద్య పీజీ సీట్లలో 15 శాతం కోటాకు పోటీ పడనున్నారు. అలాగే రాష్ట్రంలోని 15 శాతం సీట్లను దేశవ్యాప్తంగా ఉండే అభ్యర్థుల మెరిట్ ప్రాతిప దికన దక్కించుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు వైద్య విద్య పీజీ సీట్ల భర్తీకి కాళోజీ ఆరోగ్య విజ్ఞాన వర్శిటీ ఏర్పాట్లు చేస్తోంది.

రెండు, మూడురోజుల్లో ర్యాంకులు

నేషనల్ బోర్డు ఎగ్జామినేషన్ నీట్ పీజీ 2018 ఫలి తాలను శుక్రవారం విడుదల చేసింది. రాష్ట్రాల వారీగా ర్యాంకుల జాబితాలను రెండు, మూడు రోజుల్లో సిద్ధం చేయనుంది. అల్లోపతి, ఆయుష్, నర్సింగ్, ఫిజియో థెరఫీ అన్ని కోర్సులు కలిపి రాష్ట్రంలో మొత్తం 2,262 పీజీ వైద్య సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో 805, ప్రైవేటు కాలేజీల్లో 1,451 సీట్లు ఉన్నాయి. అల్లోపతి వైద్య విద్య పీజీ సీట్లు రాష్ట్రంలో 1,405 ఉన్నాయి. వీటిలో 683 సీట్లు ప్రభుత్వ కాలేజీల్లోనే ఉన్నాయి.

పెరిగిన 6 పీజీ వైద్య విద్య సీట్లు

రాష్ట్రంలో ఈసారి 6 పీజీ వైద్య విద్య సీట్లు పెరిగాయి. గాంధీ వైద్య కాలేజీలో కొత్తగా 3 ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ సీట్లను ప్రారంభించేందుకు అనుమతి చ్చింది. నిజామాబాద్‌లోని ప్రభుత్వ వైద్య కాలేజీలో కొత్తగా 3 పీజీ సీట్లను ఫార్మా కాలేజీ (ఔషధ) విభాగంలో కేటా యించింది. 2018-19 విద్యాసంవత్స రంలో కొత్త సీట్లను భర్తీ చేయనున్నారు. రాష్ట్రాల వారీగా ర్యాంకుల జాబితా అందగానే సీట్ల భర్తీ కోసం కాళోజి వర్సటీ నోటిఫికేషన్ జారీ చేయనుంది.

'ఉచిత'అక్రమాలకు చెక్

- సబ్జెక్టుల వారీగా నంబర్లు
- అక్రమాలు జరగకుండా ఉండటం కోసం చర్యలు
- ప్రారంభమైన ముద్రణ



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాల్లో అవినీతి, అక్రమాలు జరగకుండా ఉండటం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వచ్చే ఏడాది 2018-19లో విద్యార్థులకు పంపిణీ చేసే ఉచిత పాఠ్యపుస్తకాలకు సబ్జెక్టుల వారీగా సీరియల్ నంబర్లను వేయనున్నారు. తద్వారా ఉచిత పాఠ్యపుస్తకాలు ఎక్కడా అమ్మకుండా తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పాఠశాల విద్య శాఖ భావిస్తోంది. ఈ మేరకు ప్రారంభం అయిన ఉచిత పుస్తకాలకు సీరియల్ నంబర్లను వేయాలని ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా సీరియల్ నంబర్లను వేయనున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత పుస్తకాలను కొందరు అమ్ముతున్నారని పాఠశాల విద్య కమిషనర్‌కు పలు ఫిర్యాదులు అందాయి. ఇటువంటి ఫిర్యాదులు ప్రతి సంవ త్సరం వస్తూనే ఉన్నాయి. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసు కుంటున్నప్పటికీ ప్రభు త్వం పంపిణీ చేస్తున్న ఉచిత పుస్తకాలు ఏదోరకంగా బయట అమ్ముకుంటున్నారు.

ఈ నేప థ్యంలో దీనిని అరికట్టడం ఎలా ఆలోచించిన పాఠశాల విద్య శాఖ ఉచితంగా పంపిణీ చేసే పుస్తకాలకు సబ్జెక్టుల వారీగా సీరి యల్ నంబర్లను ఇవ్వాలని నిర్ణయిం చింది. అది కూడా 2018-19 నుంచే అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆ పనిని మొదలు పెట్టింది.

2.16 కోట్ల పుస్తకాలు అవసరం

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ అన్ని కలిపి 41,286 వరకు ఉన్నాయి. వాటిలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 60 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరికి మొత్తంగా 2.16కోట్ల పుస్తకాలు అవసరం ఉంటాయి. వాటిలో 1.80 కోట్లు ఉచిత పుస్తకాలు అవసరం ఉండగా, మరో 86 లక్షల అమ్మకపు పుస్తకాలు అవసరం ఉంటున్నాయి. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొన్ని ప్రైవేటు స్కూల్స్ సిలబస్‌ను వేరుగా ఉంటున్న నేపథ్యంలో వారు ప్రభుత్వం ముద్రిస్తున్న పుస్తకాలను కాకుండా వారు రూపొందించిన పాఠ్యాంశాలు ఉన్న పుస కాలను ఉపయోగించుకునే వీలుంటున్న నేపథ్యంలో వారు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు అవసరం అయిన కొన్ని పుస్తకాలను వారే ముద్రించుకుంటున్నారు. అవి కాకుండా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠ్య పుస్తకాలనే ఉపయోగించాల్సి ఉంటుంది.

జూన్ నాటికి స్కూల్స్‌కి పుస్తకాలు

జూన్ 1 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అయి నప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండేలా పాఠశాల విద్యా శాఖ చర్యలు తీసుకుంది. అందు లో భాగంగా 2017-18 సంవత్సరంలో చేరిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠ్యపుస్తకాల ముద్రణను ఇప్పటికే ప్రారంభించింది. ముద్రణను ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయంలో ప్రారంభించింది.

60 లక్షల మంది విద్యార్థులు...

రాష్ట్రంలో 60 లక్షల మంది విద్యార్థులకు 2.16 కోట్ల పుస్తకాలు అవసరం కాగా అందులో ఉచిత పుస్తకాలు 1.80 కోట్లు అవసరం అవుతాయి. ప్రభుత్వ ముద్రణాలయంలో 30 లక్షల పుస్తకాల వరకు మాత్రమే ముద్రించే అవకాశం ఉంది. మిగిలిన 1.50 కోట్ల పుస్తకాలను ఇతర ప్రైవేటు ముద్రణాలయాల్లో ముద్రించాల్సి ఉంటుంది. వాటి ముద్రణకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. త్వరలోనే ప్రైవేటు ముద్రణాలయాల్లో కూడా ఉచిత పుస్తకాల ముద్రణ ప్రారంభం కానుంది.

తెలంగాణ ప్రభుత్వం రైతు వ్యతిరేకి

మహారాష్ట్ర మాజీ సీఎం చౌహాన్



భైంసా, ప్రభన్యూస్ : రైతు కష్టాలను తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ రావ్ చౌహన్ విమర్శించారు. ఆదివారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. కొద్దిసేపు విలేకరులతో మాట్లాడిన ఆయన రైతు సమస్యలపై కాంగ్రెస్ పార్టీ విధానాలు స్పష్టంగా ఉన్నాయని , గతంలోతమ పార్టీ ప్రభుత్వాల పాలనే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

ఆయన వెంట ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావ్ పటేల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రామారావ్ పటేల్ ఆనంద్ రావ్ ప టేల్, కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ కిషన్ గౌడ్, శ్యాంరావ్ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వం విఫలం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

సూర్యాపేట(టౌన్), ప్రభన్యూస్: ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్రప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ విమర్శించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుమంగళ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేందుకు పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. చట్టబద్ధత కల్పించడంలో కేంద్రంలోని అధికార పార్టీ భాజపా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించలేని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు విఫలమయ్యాయన్నారు. ఉద్యమాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలను కేసీఆర్ ప్రభుత్వం అణివేయడంలో భాగంగా అక్రమ కేసులు బనాయించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ పోలీట్ బ్యూరో సభ్యులు గుద్దెడి యల్లయ్య మాదిగ, చింతలపాటి చిన్నశ్రీరాములు, రుద్రవరం లింగస్వామి, బోడ శ్రీరాములు, యాతాకుల రాజయ్య, కందుకూరి సోమయ్య, ఎర్ర వీరస్వామి, బొజ్జ సైదులు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐటీఐల పనితీరు భేష్

కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి అనంతకుమార్ హెగ్డే



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణలో పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ) పని తీరు బాగుందని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖా మంత్రి అనంతకుమార్ హెగ్డే ప్రశంసించారు. హైద రాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం సమీపంలోని నోవాటెల్ హోటల్‌లో ఆదివారం రాష్ట్ర హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, కేంద్ర మంత్రి అధికారులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యార్థులతో పోల్చు కుంటే ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఐటీఐ కళాశాలలను మరింత అభివృద్ధి చేసినట్లయితే విద్యార్థుల భవిష్యత్ మెరుగ్గా ఉంటుందన్నారు. అనంతరం మంత్రి నాయిని మాట్లా డుతూ అప్రెంటీస్ యాక్ట్-1961 అనుసరించి ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు అప్రెంటీస్ శిక్షణను ఇస్తున్నా మని దీనికోసం ప్రధానమంత్రి కౌశిల్ వికాస్ యోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రభు త్వ, ప్రైవేటు ఐటీఐ సీట్లు 73,378 ఉండగా వాటిలో 32 ట్రేడ్‌లు ఉన్నాయన్నారు. సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా చేప డుతున్నామని ప్రతి ప్రభుత్వ ఐటీఐలలో ప్లేస్‌మెంట్ సెల్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలోని పరిశ్ర మల ఒప్పందాలు చేసుకోవడం ద్వారా బీడీఎల్, మిధా ని, హెచ్ఏఎల్, టాటా ఏరోస్పేస్, టయోట, మారుతి సుజుకి, హ్యుండాయ్, ఫోర్డ్ ఇండియాలో ఉద్యోగ సంబంధ శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. కౌశల్ వికాస్ యోజన పథకం కిదం రిజిస్ట్రేషన్ అక్రిడేషన్ 40 నుంచి 60 రోజుల సమయం తీసుకుంటుందని ఈ సమయాన్ని తగ్గించాలని మంత్రి నాయిని కేంద్ర మంత్రిని కోరారు. దీనికి కేంద్ర మంత్రి స్పందిస్తూ త్వరలోనే దీనిపై మార్గదర్శకాలను విడుదల చేస్తానని ఆయన హామీనిచ్చారు. కార్మిక మరియు ఉపాధి కల్పన శాఖ ముఖ్య కార్యదర్శి శశాంక గోయల్, ఉపాధి కల్పన డైరెక్టర్ వై.బి.నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతరాష్ట్ర సర్వీసులపై 'ఫోకస్'

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి



తాండూరు టౌన్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్రంలోని ఆర్టీసీ సంస్థల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, పెట్రోల్ బంక్‌లు, మినీ థియేటర్లు అందుబాటులోకి తీసుకురావడం జరగుతుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా, తాండూరు ఆర్టీసీలో తాండూరు - బెంగుళూరు అంతర్‌రాష్ట్ర ఏసీ బస్సు సర్వీసును మంత్రి మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. దీంతో పాటు తాండూరు నియోజకవర్గం యాలాల మండలంలోని ఆడాల్‌పూర్ గ్రామానికి పల్లె వెలుగు బస్సు సర్వీసును కూడ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీకి చెందిన 850 నుంచి వెయ్యి బస్సుల ద్వారా మహారాష్ట్ర, కర్ణాటక వంటి అంతర్ రాష్ట్రాలకు రవాణా సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. తాజాగా బెంగుళూరుకు బస్సును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దూర ప్రాంతాల రవాణా ద్వారా అధిక లాభాలు వస్తాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని దూర ప్రాంతాలతో పాటు అంతర్‌రాష్ట్ర సర్వీసులపై ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని 97 డిపోలలో 29 డిపోలు లాభాల్లో ఉండగా.. 47 డిపోలు నష్టాల్లో కొనసాగుతున్నాయని, మిగతా డిపోలు మధ్యలో ఉన్నాయని వివరించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ప్రయాణిలకు సేవలందిస్తుందని పేర్కొన్నారు.

మావోల కొత్త దళపతిగా దళితనేత

- గణపతి స్థానంలో తిరుపతి
- పిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీయే కొత్త దళపతి
- కేంద్ర కమిటీ కార్యదర్శి పదవి నుంచి తప్పుకోనున్న గణపతి
- పోలీసులకు లభించిన పలు కీలక పత్రాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మావోయిస్టు పార్టీ నాయకత్వంలో పలు మార్పులు జరుగబోతున్నాయని, కేంద్ర కమిటీ కార్యదర్శి ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతిని తప్పించి ఆ బాధ్యతలను ఇతరులు ఇతరులకు అప్పగించాలనే చర్చ చాలా కాలంగా జరుగుతుంది. దళిత యువకుడిని లక్ష్మణరావు స్థానంలో నియమించాలని ఆ పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కొంత కాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్, ఒడిషాల సరిహద్దులలో మావోయిస్టుల కార్యకలాపాలు పెరగడంతో పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెట్టారు. కొద్ది రోజుల క్రితం పోలీసులకు మావోయిస్టులకు చెందిన పలు కీలక డాక్యుమెంట్లు లభించాయి. లభించిన డాక్యుమెంట్లను విశ్లేషించగా మావోయిస్టు పార్టీలో నాయ కత్వం మార్పు అంశం వెల్లడైనట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీలో రెండవ స్థానంలో ఉన్న సంబాళ కేశవరావు అలియాస్ బసవరాజ్‌ను కేంద్ర కమిటీ కార్యదర్శిగా నియమించొచ్చని మొదట్లో ప్రచారం జరిగింది. కానీ పార్టీలో ఇటీవలి పరిణామాలతో పాటు దళిత వర్గానికి చెందిన వారికి నాయకత్వం అప్పగించాలన్న ప్రతిపాదనలు రావడంతో జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన పిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి పగ్గాలు అప్పగించనున్నట్లు లభించిన డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరం పోలీసులు నిర్ధారించుకున్నారు.

రేసులో కంబాళ కేశవరావు

మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీకార్యదర్శిగా, పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ చీఫ్ కమాండర్‌గా ఉన్న సంబాళ కేశవరావు అలియాస్ బసవరాజ్‌ను నియమించవచ్చనే ప్రచారం కూడా జరుగుతోంది. రెండు మాసాల క్రితం ఛత్తీస్‌ఘఢ్‌లోని అబూజ్‌మడ్‌లో నిర్వహించిన మావోయిస్టు ప్లీనరీలో ఈ దిశగా చర్చించినట్లు తెలిసిందని ఆంధ్రా - ఒడిషా సరిహద్దు (ఎఒబి) పోలీసులు అంటున్నారు. కొన్ని నెలల క్రితం అరెస్టయిన మావోయిస్టుల విచారణలో, ఎన్‌కౌంటర్ల సందర్భంగా లభించిన పత్రాల విశ్లేషణలో ఈ విషయం వెల్లడైనట్లు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జిఎన్ పేటకు చెందిన సంబాళ కేశవరావు ప్రస్తుతం పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సిఎంసి) చీఫ్ కమాండర్‌గా ఉన్నారు.

2004 నుంచి గణపతి నాయకత్వం

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రా ల్లో విస్తరించి ఉన్న పీపుల్స్ వార్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కొండపల్లి సీతారామయ్యను 1992లో తొలగించారు. అప్పటి నుంచి గణపతి పార్టీ ప్రధాన కార్యదర్శిగా, 2004లో విప్లవ సంస్థలన్నీ కలిసి ఏర్పాటైన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయనకు వయసు మీద పడటం, అనారోగ్యం కారణంగా కేంద్ర కమిటీ కార్యదర్శి పదవి నుంచి తప్పుకోవాలని యోచిస్తున్నట్లు గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. 2007లో మావోయిస్టు పార్టీ నిర్వహించిన ప్లీనరీ సందర్భంగా నాయకత్వం వహించే వారి వయసు 60 ఏళ్ళ వరకే ఉండాలన్న చర్చ జరిగిందని, అప్పుడే నాయకున్ని మార్చాలనుకున్నారు.

కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల ఇంతకాలం ఆయననే కొనసాగించారు. వాస్తవానికి అప్పట్లో కేంద్ర కమిటీలో ఉన్న సంబాళ కేశవరావు, ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్, ప్రస్తుతం జైళ్ళో ఉన్న కోబాడ్ గాంధీలలో ఒకరు కార్యదర్శిగా ఎంపికవచ్చన్న ప్రచారం జరిగింది. ఇక వీరితో పాటు పార్టీ కేంద్ర కమిటీలో కటకం సుదర్శన్, మల్లా రాజిరెడ్డి, వేణుగోపాల్‌రావు, అక్కిరాజు హరగోపాల్, మోడెం బాలకృష్ణ ఒగ్గు సత్యాజీ, రావుల శ్రీనివాస్, పిప్పిరి తిరుపతి, జీనుగు నర్సింహారెడ్డిలతో పాటు బీహార్ మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్, బీహార్ మావోయిస్టు పార్టీ యూనిట్‌ల నుంచి మరో 10 మందిసీనియర్ నాయకులున్నారు. మొత్తంగా వీరంతా 50 ఏళ్ళు పైబడిన వారే. 12 మందికి 60 ఏళ్ళ వయసు కూడా నిండింది.

అందరికన్నా చిన్నవాడు

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న 19 మందిలో తిరుపతి అలియాస్ దేవ్‌జీ అందరికన్నా చిన్నవాడు. దళిత వర్గానికి చెందిన తిరుపతి కేంద్ర కమిటీలో సిసి మెంబర్‌గా ఉన్నారు. చదువుకునే రోజుల నుంచి తిరుపతి తన ప్రియ శిష్యుడు కావడంతో ఆయనపైనే గణపతి మొగ్గుచూపే అవకాశాలున్నాయనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రస్తుతం దేశంలోని విప్లవ సంస్థలు మావోయిజాన్ని, అంబేద్కరిజాన్ని కలిపి ఉద్యమం నిర్మించాలని మేధావులు సూచిస్తున్నారు. పలు సందర్భాల్లో విప్లవ సంస్థల్లోనూ అగ్రవర్ణాల పెత్తనం నడుస్తోందని పరోక్షంగా గణపతిని ఉదహరిస్తూ విమర్శలు కూడా వచ్చాయి. దాంతో మావోయిస్టు పార్టీలోని కేంద్ర కమిటీలో రిజర్వేషన్లు అమలు చేస్తూ మహిళలు, దళితులకు అవకాశమిచ్చారు. తాజాగా గణపతి తప్పుకోనుండటంతో అందరి దృష్టి దళితుడైన తిరుపతిపై పడింది.

ఏపీలో 3వ భాగస్వామ్య సదస్సుకు ముమ్మర ఏర్పాట్లు

విశాఖపట్నం, ప్రభ న్యూస్: మూడు రోజులపాటు విశాఖలో నిర్వహించబోతున్న మూడవ అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు సీఐఐలో 14 దేశాల నుంచి వాణిజ్యమంత్రులు హాజరుకానున్నారని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. ఈనెల 24 నుంచి 26 వరకూ విశాఖపట్నంలో నిర్వహించే భాగస్వామ్య సదస్సు 2018కు 40 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ముఖ్యంగా ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు ప్రారంభోత్సవంలో పాల్గొంటుండగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు రోజులూ సదస్సులో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా విశాఖపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత రెండు భాగస్వామ్య సదస్సులో సుమారు పదకొండు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చినట్లుగా ఆయన వెల్లడించారు. మానవ వనరుల మంత్రిత్వ శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సహితంగా నిర్వహించిన ఈ సమావేశంలో అధికారులతో సంబంధిత ఏర్పాట్లను కూడా ఆయన సమీక్షించారు. ఈ సదస్సు చారిత్రాత్మకంగా గుర్తుండిపోయేలా నిర్వహించాలని భావించారు. ఎక్కడా రాజీపడకుండా, ఎలాంటి లోపాలూ తలెత్తకుండా ఉండాలని ఆశించారు. అధికారులు పూర్తి సమన్వయంతో ప్రోటోకాల్‌కు భంగం వాటిల్లకుండా పర్యవేక్షించాలన్నారు. వైర్‌లెస్ సెట్లను ఉపయోగిస్తూ తక్కువ సంఖ్యలో పోలీసు వ్యవస్థను వినియోగించాలన్నారు. అలాగూ. సైరన్లు, హారన్ల శబ్ధాలను వీలైనంత వరకూ లేకుండా చూడాలన్నారు. వైద్యశిబిరం, అంబులెన్సు, ఫస్టు ఎయిడ్ వంటివన్నీ అందుబాటులో ఉండేలా చూసి, అత్యవసర సేవల కోసం అగ్నిమాపక వ్యవస్థనూ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. క్రమశిక్షణతో భాగస్వామ్య సదస్సును ఆదర్శవంతంగా నిర్వహించాలని ఆయన భావించారు. మీడియా కేంద్రం ఏర్పాటు, లైవ్ టెలికాస్టు ఏర్పాట్లు చేసి, వుడా జీవీఎంసీలు నగర సుందరీకరణ, ముఖ్య పర్యాటక ప్రాంతాల సందర్శకు ఆయా శాఖలు ఏర్పాట్లు చూడాలని ఆదేశించారు.

అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు

లింగాయత్, వక్కలిగ, కురుమలతో సమావేశాలు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా ఉన్న కాంగ్రెస్ అధిష్టానం ఆ దిశలో పావులు కదుపుతోంది. అన్ని శక్తులను కాంగ్రెస్ గొడుగు కింద సమైక్యం చేసేందుకు వ్యూహరచన చేస్తోంది. 2019 శాసనసభ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర మాత్రమే గడువు ఉండడంతో పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తోంది. టీపీసీసీ నాయకులు పాదయాత్రలు, బస్సుయాత్రలతో రాష్ట్ర మంతా హోరెత్తించనున్నారు. ఇంటింటి యాత్రలను కూడా చేపట్టేందుకు అధిష్టానం స్థానిక నాయకులకు స్వేచ్ఛనిచ్చింది. మరోవైపు ఇతర రాష్ట్రా ల నుంచి హైదరాబాద్ వచ్చి స్థిరపడిన వారిపై దృష్టిసారించాలని అధిష్టానం నిర్ణయించింది. హైదరాబాద్‌తో పాటు మొత్తం తెలంగాణలో ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రకు చెందిన వారు లక్షల సంఖ్యలో గుర్తించింది, వారితో పాటు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, బీహార్‌కు చెందిన వారు కూడా ఉన్నారని వారిని కూడా పార్టీ వైపు తిప్పితే రాష్ట్రంతో పాటు వారి సొంత రాష్ట్రా ల్లో కూడా కాంగ్రెస్ ఇమేజ్ పెంచుకోవచ్చని కాంగ్రెస్ ఆలోచన. అందులో భాగంగా ఏపీకి చెందిన నాయకులకు హైదరాబాద్‌తో పాటు ఖమ్మం, నిజామాబాద్‌లలో ఎమ్మెల్యే,ఎంపీ టిక్కెట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. వారి తర్వాత కన్నడిగులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని అంచనా వేసింది. హైదరాబాద్‌తో పాటు కర్నాటక సరిహద్దు ప్రాంతాలైన గద్వాల, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కర్నాటకకు చెందిన లింగాయత్, వక్కలిగ, కురుమ, ఎస్సీ,ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలను తమ పార్టీవైపు తిప్పుకునేందుకు కార్యాచరణ రూపొందించే పనిలో ఉన్నట్లు సమాచారం.

తెలంగాణలో ఎంత తక్కువనుకున్నప్పటికీ 25 లక్షల మంది కన్నడిగులు ఉన్నారని పార్టీ ఒక అంచనాకు వచ్చింది. టీపీసీసీకి తెలియకుండానే ఏఐసీసీ నేరుగా రంగంలోగి దిగి ఈ వర్గాల మద్దతును ఏ విధంగా కాంగ్రెస్ వైపు మరల్చేందుకు వీలవుతుందో కర్నాటకకు చెందిన నాయకులతో ఇప్పటికే సంప్రదింపులను ప్రారంభించింది. కాంగ్రెస్ వ్యూహకర్త సిరివెళ్ల ప్రసాద్ ఈ విషయమై కర్నాటక సీఎం సిద్ధరామయ్యతో ఇప్పటికే చర్చించారు.

కర్నాటక ఎన్నికల తర్వాత ఆయన తెలంగాణపై ప్రత్యేక దృష్టిసారించే అవకాశం ఉందని సమాచారం. కన్నడిగులతో ప్రత్యేకంగా సభలు, సమావేశాలు నిర్వహించేందుకు ఆయన అంగీకరించారు. కర్నాటకలో ఎన్నికల బిజీలో ఉన్న సిద్ధరామయ్య తమ రాష్ట్రంలో ఉన్న తెలుగువారిని ఆకర్శించేందుకు బీజేపీకి ధీటుగా వ్యూహా లు పన్నుతున్నారు. అక్కడి ఎన్నికల్లో గెలిచేందుకు వీలైనంత వరకు తెలుగువారి సహకారం తీసుకునేందుకు ఇక్కడి నేతలతోప్రచార వ్యూహం ఇప్పటికే ఖరారైంది.

ముందుచూపే రక్షణ విధానాలకు వెన్నెముక



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవి ష్కరించుకోవడం, ముందు చూపు, వినూత్న మార్గదర్శకత్వమే ఏరో స్పేస్, రక్షణ విధానాలకు వెన్నెముకలాంటివని డీఆర్‌డీఓ చైర్మన్, కార్యదర్శి డాక్టర్ ఎస్ క్రిస్టఫర్ అన్నారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆటమిక్ కంట్రోల్ (ఐఫ్ఎసి) మూడో అంతర్జాతీయ సమావేశం ఆదివారం ఇక్కడ జరిగింది.ఈ సందర్భంగా క్రిస్టఫర్ మాట్లాడుతూ, భవిష్యత్‌లో తయారయ్యే ఆయుధాలు సున్నితంగా ఉంటాయని, కానీ, లక్ష్యాన్ని ఛేదించడంలో మాత్రం ముందుంటాయని తేజాస్, ఎడిఎ కోంబాట్ ఎయిర్ క్రాఫ్ట్‌ను గూర్చి వివరించారు. ఎయిర్‌క్రాఫ్ట్,సబ్ మెరైన్స్, మిసైల్స్ సామర్థ్యాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు.ఈ సదస్సులో రక్షణ మంత్రి సహాదారు డాక్టర్ జి సతీష్ రెడ్డి, ఐఫ్ఎసి ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఫ్రాంక్ ఆల్‌గోవర్, ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ బిఎన్ సురేష్, డీఆర్‌డిఎల్ డైరెక్టర్ ఎంఎస్ఆర్ ప్రసాద్, ఎఎస్ఎల్ డైరెక్టర్ డాక్టర్ టెస్సీ థామస్, ఆర్‌సిఐ డైరెక్టర్ బీహెచ్‌విఎస్ నారాయణమూర్తి, ఎసిడిఓఎస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రామ్‌కళ్యాణ్ మాట్లాడారు. దాదాపు 500 మంది ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ సోమవారం 19 ఫిబ్రవరి 2018

ఊపిరి తీస్తున్న కాలుష్యం!

(మొదటిపేజీ తరువాయి)

యూనిట్లుగా నమోదైంది. ఇది సాధారణ కాలుష్య స్థాయి కంటే 17 శాతం ఎక్కువ. వార్షిక కాలుష్య స్థాయి సరాసరి కన్నా కూడా ఇది రెండు రెట్ల కంటే ఎక్కువేనని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని 15 నగరాల్లో వాయుకాలుష్య తీవ్రత ఆందోళనకరంగా ఉందని సర్వేలు పేర్కొంటున్నాయి. పీఎం-10 కంటే ఎక్కువ తీవ్రతలోనే కాలుష్య స్థాయి ఉందని గ్రీన్‌పీస్ ఇండియా పేర్కొంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన తీవ్రతకన్నా కాలుష్య స్థాయి మూడు రెట్లు అధికమని ఈ సర్వే పేర్కొంది. ఈ వాయుకాలుష్యం అరికట్టలేకపోతే రెండు రాష్ట్రాల్లో పర్యావరణం ప్రమాదకరంగా మారి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని పర్యావేరణవేత్తలు పేర్కొంటున్నారు.

నాలుగేళ్లలో 11 ఎంజీలకు పైగా పెరుగుదల

తెలంగాణలో నాలుగేళ్లలో గణనీయంగా సూక్ష్మ, దూళి కణాలు పెరిగాయని ఓ సర్వే పేర్కొంది. నాలుగేళ్ల వ్యవధిలోనే అది 11 ఎంజీలకు పైగా పెరిగిందని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. చెత్తను కాల్చడం, వాహనాలు, నిర్మాణ పనుల వలన నిత్యం గాల్లోకి 40 రకాల కాలుష్య ఉద్గారాలు విడుదలవుతుంటాయని, అతి సూక్ష్మ, దూళి కణాలు పీఎం 2.5, పీఎం 10, సల్ఫర్ డైయాక్సడ్, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ తదితర కాలుష్యకారకాలు అందులో ఉన్నాయి. తల వెంట్రుక మందంలో పీఎం-10 ఐదో వంతు ఉంటుందని, కానీ అది చేసే నష్టం అంతా ఇంతా కాదని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు.

శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం

గాలిని కలుషితం చేయడంతో పాటు శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలపై ఎక్కువగా ప్రభావం చూపుతుందని గమనించాల్సిన విషయంగా పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిర్దేశిత పరిమిత ప్రకారం ఘనపు మీటరు గాలిలో పీఎం-10 వార్షిక సగటు 60 మైక్రోగ్రాములు మించరాదని, ఆ మార్కును దాటితే ఆ ప్రాంతం కాలుష్యకోరల్లో చిక్కుకున్నట్టుగా పరిగణిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) సంస్థ 20 మైక్రోగ్రాములు దాటితే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది.

సీపీసీబీ క్రమం తప్పకుండా దేశవ్యాప్తంగా ఉన్న 79 నగరాల్లో, పట్టణాల్లో పీఎం 2.5 తీవ్రతను క్రమం తప్పకుండా లెక్కిస్తోంది. ఢిల్లీని వెనక్కి నెట్టేసి చండీఘడ్ 123 మైక్రోగ్రాముల మొదటి స్థానంలో నిలవగా, ఢిల్లీ 118 మైక్రో గ్రాములతో రెండో స్థానంలో నిలిచింది. హైదరాబాద్ 13వ స్థానంలో ఉంది. నిర్దేశించిన దానికన్నా తెలంగాణలో 18 మైక్రోగ్రాములు ఎక్కువగా నమోదైందని అధికారులు పేర్కొన్నారు.

నీరు, నేలా కూడా కలుషితమే...

మనం పీల్చే గాలితో పాటు నీరు, నేలా నిలువెల్లా విషంగా మారిందని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. పలు కంపెనీలు శుద్ధి చేయకుండానే రసాయనాలు విడుదల చేస్తుండడంతో భూగర్భ జలాలు పనికిరాకుండా పోతున్నాయి. కొన్ని వేల ఎకరాలు పంటలు పండక సాగుయోగ్యతను కోల్పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని భూములు ఆముదం పంటకు పనికిరాకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశ్రామిక కాలుష్యం పచ్చని పంట పొలాలు కాలుష్యపు కోరల్లో విలవిల లాడుతున్నాయి.

నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘన

పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేయాల్సిన పరిశ్రమలు నిబంధనల్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. విష రసాయనాలు, హానికర వ్యర్థాలను శుద్ధి చేయకుండా సమీపంలోని చెరువుల్లోకి, భూముల్లోకి వదిలేస్తున్నాయి. దీంతో జలాలు విషతుల్యం అవుతున్నాయి. ఆ భూముల్లో ఏ పంట వేసినా రోజుల వ్యవధిలోనే పనికి రాకుండా పోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

రెండు విడతలుగా పెట్టుబడి సాయం

- చెక్కుల పంపిణీ ఏప్రిల్‌లో రూ. 2వేలు, జూన్‌లో మరో రూ. 2వేలు
- బ్యాంకుల్లో కరెన్సీ కొరతపై కేంద్రం స్పందించని కారణంగా ఈ నిర్ణయం


(ఫైల్ ఫొటో)

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రతిష్టాత్మక పథకం 'పెట్టుబడి మద్దతు' అమలుకు కరెన్సీ కొరత ఏర్పడిన నేపథ్యంలో ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. ఇటు ప్రభుత్వానికి, అటు రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ప్రతిపాదిత మొత్తాన్ని రెండు విడతలుగా పంపిణీ చేసేందుకు ఆదేశాలు ఇచ్చింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం చెక్కుల రూపంలోనే పెట్టుబడి రాయితీ మొత్తాన్ని ఇవ్వనున్నారు. నిధుల సమకూర్పు సమస్య నుంచి బయటపడేందుకు త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌ను సంబంధించి ఏప్రిల్‌లో రూ.2వేలు, జూన్‌లో మరో రూ.2వేలు రైతులకు ఇవ్వాలని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. గత నెల రోజుల కాలంగా సంప్రదింపులు జరుపుతున్నా బ్యాంకుల్లో కరెన్సీ కొరతపై కేంద్రం స్పందించని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయాన్ని రైతులకు తెలియజెప్పి అవగాహన కల్పించేందుకు త్వరలో జరిగే ప్రాంతీయ సదస్సుల్లో రైతు సమన్వయ సమితుల సభ్యులకు మార్గదర్శకాలు ఇవ్వనున్నారు.

పెట్టుబడి మద్దతు పథకంపై మంత్రివర్గ ఉపసంఘం ముఖ్యమంత్రికి సమర్పించిన నివేదిక ప్రకారం అధికార యంత్రాంగం ముందడుగు వేస్తోంది. బేరర్ చెక్కుల రూపంలో ఎకరాకు రూ.4వేల చొప్పున ఏప్రిల్ 20 నుంచి పంపిణీ చేసేందుక ు వ్యవసాయశాఖ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ పథకానికి ప్రతిపాదించిన అంచనాల ప్రకారం రూ.6వేల కోట్ల నగదును సమకూర్చుకోవడంలో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో సమస్యను అధిగమిస్తామని ముందుగా అధికారులు ధీమా వ్యక్తం చేసినప్పటికీ ఆశించిన స్పందన రాకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నారు. ఇందుక ు సంబంధించిన నిధులను సమకూర్చుకునేందుకు, ప్రత్యామ్నాయ పద్ధతుల్లో కరెన్సీ కొరతను అధిగమించేందుకు ఆర్థికశాఖ అధికారులు మార్గాలను అన్వేషించి ముఖ్యమంతికి నివేదించారు. ఈ పథకం అమలుకు సులువైన మార్గాలపై తాజాగా రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) ఇచ్చిన నివేదిక ప్రకారం చెక్కుల పంపిణీలో వ్యూహాత్మక టైమ్ షెడ్యూల్‌ను అమలు చేస్తున్నారు. గ్రామ, మండల రైతు సమన్వయ సమితుల భాగస్వామ్యంతో, స్థానిక బ్యాంకుల సమన్వయంతో లబ్ధిదారులైన రైతులు చెక్కులను విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. అయితే ఒక్కో మండలం పరిదిలో ఒక్కో తేదీని ఖరారుచేసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలో ఉన్న నగదును రొటేషన్ పద్దతిలో సర్ధుబాటు చేసేందుకు వ్యూహాత్మక ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ విధానాన్ని అవలంబిస్తే కొంత ఎక్కువ సమయం అవసరమవుతున్నందున ఏప్రిల్ రెండోవారం నుంచే చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. వారం, పది రోజులపాటు విస్తృతస్థాయి చర్చలు, సంప్రదింపులతో కసరత్తు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఇటీవలే ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించింది. ఈ పథకం అమలు విషయంలో తలెత్తిన అనేక సందేహాలను నివృత్తి చేస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది. బీడు భూములు మినహాయించి వ్యవసాయ యోగ్యమైన భూములు కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ పెట్టుబడి రాయితీ పథకాన్ని వర్తింపజేయాలని స్పష్టం చేసింది. అలాగే బేరర్ చెక్కుల రూపంలోనే ఈ మొత్తాన్ని పంపిణీ చేయాలని తేల్చి చెప్పింది.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 5వేల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒకరి చొప్పున నియమించిన వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు), గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వోలు), పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇంటింటికీ తిరిగి నిర్దేశిత మొత్తానికి చెక్కులను పంపిణీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. తాజా సమాచారం మేరకు వారంలోగా పెట్టుబడి మద్దతు పథకం అమలుకు మార్గదర్శకాలు వెలువడనున్నాయి. పెట్టుబడి మద్దతు పథకం ద్వారా జరిగే వ్యవసాయ రంగాభివృద్ధి, రైతులకు కలిగే వెసులుబాటు తదితర అంశాలను కూడా ప్రతి రైతు తెలుసుకునే విధంగా గ్రామగ్రామాన విస్తృత ప్రచారం చేయనున్నారు. ఈ పథకం అమల్లో తలెత్తిన చిక్కుముడి సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించుకోవడం కష్టసాధ్యంగా మారడంతో కేంద్రాన్ని సంప్రదించక తప్పలేదు. ప్రతిపాదిత మొత్తాన్ని రైతులకు నగదు రూపంలో చెల్లించేందుకు ఆర్థిక నిబంధనలు అడ్డొస్తున్నందున వెసులుబాటు కోరారు. సుమారు రూ.6వేల కోట్లకు పైగా ఏకకాలంలో కరెన్సీ అవసరమవుతున్నందున ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆర్బీఐ గవర్నర్ ఉజ్జిత్ పటేల్‌లను కలిసి నిధుల సర్ధుబాటును ప్రతిపాదనలను అందజేశారు. రాష్ట్రంలో మొత్తం 71.75 లక్షల రైతు ఖాతాలకు సంబంధించిన ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేసిన మంత్రివర్గ ఉపసంఘం ప్రత్యామ్నాయ మార్గంలో కరెన్సీని సర్దుబాటు చేసుకుని పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. దేశంలోనే మొదటిసారిగా 1.42 కోట్ల ఎకరాల వ్యవసాయ భూమికి రూ.4వేల చొప్పున పెట్టుబడి రాయితీ మొత్తాన్ని చెల్లిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికి మాత్రమే దక్కనుంది.

మహానుభావులందరికీ ధన్యవాదాలు

జేఎఫ్‌సీ విజయవంతంపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న పరస్పర విరుద్ధ ప్రకటనల వల్ల ప్రజల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించడానికి జనసేన చొరవతో ఏర్పాటైన ఫాక్ట్స్ ఫైండింగ్ కమిటీ (జెఎఫ్‌సీ) సమావేశాలను విజయవంతం చేసిన మహానుభావులందరికీ తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. తన ప్రయత్నాన్ని ఆశీర్వదించి,ప్రోత్సహిస్తున్న తెలుగు వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. రెండు రెండు రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో లోతైన చర్చలు పారదర్శకంగా జరిగాయని అన్నారు. న్యాయ కోవిదులు,ప్రజా పరిపాలనలో అనుభవజ్ఞులు,రాజకీయాలలో అపారమైన అనుభవం ఉన్న ప్రజా నేతలు పెద్ద మనసుతో, తెలుగు ప్రజలకు మేలు కలగాలన్న బలమైన కాంక్షతో ఈ చర్చల్లో పాల్గొనడం తనకెంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఇచ్చిన హామీలు, చేసిన చట్టాలు, ఆ తర్వాత ఏర్పడిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన నిధులు,తెలుగు రాష్ట్రాలకు వచ్చిన నిధులు వంటి అంశాలపై కమిటీలో ఉన్న నిపుణులు విశ్లేషించడం ప్రారంభించారని అన్నారు. జె.ఎఫ్.సి కొన్ని ఉప కమిటీలను నియమించిందన్నారు. వాటి వివరాలను త్వరలోనే ప్రజల ముందు ఉంచుతామన్నారు. జె.ఎఫ్.సి.కి అవసరమైన రాజ్యాంగ పూర్వక సలహాలను అందించడానికి సుముఖత వ్యక్తం చేసి, సమావేశానికి హాజరైన జస్టిస్ గోపాల్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదే విధంగా సమావేశాలలో పాల్గొన్న కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్‌నారాయణ, అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్య కార్యదర్శిగా పని చేసిన ఐవీఆర్ కృష్ణారావు, ఐఎఎస్ అధికారిగా పని చేసిన తోట చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాను అడగ్గానే కార్యక్రమంలో పాల్గొనడానికి అంగీకారం తెలిపిన సీనియర్ పార్లమెంటేరియన్ ఉండవల్లి అరుణ్‌కుమార్, సీపీఎం, సీపీఐ కార్యదర్శులు మధు,రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాసరావు, కాంగ్రెస్ ప్రతినిధులు గిడుగు రుద్రరాజు, జంగా గౌతమ్, వివిధ రంగాల్లో నిపుణులైన ప్రమోద్‌రెడ్డి, అరుణ, తార, మహేశ్వర్‌పేరి, అమీర్‌ఖాన్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

మేఘాలయలో మిలిటెంట్ల దాడి

- ఎన్సీపీ అభ్యర్థి సహా ఇద్దరి హత్య

షిల్లాంగ్ : అసెంబ్లీ ఎన్నికల వేళ మేఘాలయలో మిలిటెంట్లు రెచ్చిపోయారు. తురా అసెంబ్లీ నియోజకవర్గంనుంచి ఎన్నికల బరిలోకి దిగిన ఎన్సీపీ నాయకుడు జే. సంగ్మా సహా మరో ఇద్దరిని మిలిటెంట్లు హతమార్చారు. తూర్పు గారో హిల్స్ జిల్లాలో కాన్వాయ్‌లో వెళ్తున్న సంగ్మా లక్ష్యంగామిలిటెంట్లు ఐఈడీలు విసురుతూ కాల్పులు జరిపారు. 60 అసెంబ్లీ స్థానాలున్న మేఘాలయలో ఈనెల 27న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ దాడి జరగడం కలకలం రేపుతోంది.

రష్యాలో చర్చిపై సాయుధుడి కాల్పులు

- ఐదుగురు మహిళలు మృతి

మాస్కో: రష్యాలో సాయుధుడు రెచ్చిపోయాడు. డగెస్టాన్ చర్చి లక్ష్యంగా సాయుధుడు జరిపిన కాల్పుల్లో 5 గురు మహిళలు మృతి చెందారు. ఓ ఆగంతకుడు చర్చిలోని మహిళలే లక్ష్యంగా రైతులతో కాల్పుల మోత మోగించి నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.కాల్పుల్లో నలుగురు మహిళలు అక్కడికక్కడే మరణించగా.. మరో మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. సాయుధుడి దాడిని అడ్డుకోబోయిన ఇద్దరు పోలీసులకు కూడా బుల్లెట్ గాయాలయ్యాయి. కాల్పులు జరిపిన వ్యక్తి 20ఏళ్లలోపు వాడేనని స్థానిక మీడియా వెల్లడించింది. కాల్పులు జరుపుతున్న సమయంలో సాయుధుడు ఓ మతానికి సంబంధించిన నినాదాలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎంసీఐ రిజిస్ట్రేషన్లు ఆలస్యం

- అసిస్టెంట్ ప్రొఫెసర్ల దరఖాస్తులకు అనర్హులుగా మారిన వైద్యులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎంసీఐ (మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) జాప్యంతో 500 మంది డాక్టర్లు ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ కోర్సులు చేసిన వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోలేక పోయారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే ఎంసీఐలో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ విషయంలో జాప్యం ఏర్పడడంతో ఈ సమస్య తలెత్తిందని వైద్యులు ఆరోపిస్తున్నారు. అసిస్టెంట్ పోస్టుల నియామకాలకు ఇంతవరకు తెలంగాణ ప్రభుత్వ కటాఫ్ తేదీ ప్రకటించలేదు. అయితే దీనికి సంబంధించి నియామకాలు మాత్రం ప్రారంభమయ్యాయి. పోస్టు గ్రాడ్యుయేట్ డాక్టర్స్ ఎవరైతే ప్రభుత్వ కళాశాలల్లో పీజీ చేసి ఉన్నారో వారికి దీనికి సంబంధించి ఆటంకం కలుగుతుంది. ఈ విషయమై పీజీ వైద్య విద్యార్థులు 2104 సంవత్సరంలో ధర్నా కూడా చేశారు. ఆ సమయంలోనే వారు 2 సంవత్సరాల కాలాన్ని కోల్పోయారు. ఆ తరువాత నవంబర్ 2017 పీజీ విద్యార్థుల రూరల్ సర్వీస్ పూర్తవుతుంది. కానీ సెప్టెంబర్12, 2107లోనే అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల దరఖాస్తులకు చివరితేదీగా పబ్లిక్ సర్వీసు కమిషన్ పేర్కొంది. దీంతో ఎంసీఐలో రిజిస్ట్రేషన్ చేసుకోకపో వడం వలనే అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు అనర్హుల య్యామని పీజీ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ గడువు పొడిగించడంతో పాటు ఎంసీఐలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని జూనియర్ డాక్టర్ల సంఘం సలహాదారుడు డా. శ్రీనివాస్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

అరకొరగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు

- ఇంటర్, డిగ్రీలకు కావాల్సింది రూ. 430 కోట్లు
- పీజీ ఇతర కోర్సుల్లో 4.50 లక్షల మందికి కావాల్సిన నిధులు రూ. 1800 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వారు సంఖ్యాపరంగా 70 శాతంగా ఉన్నారు. వారి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అవసరమైన నిధులు ప్రభుత్వం కేటాయించిన వాటిలో 20 శాతం మాత్రమే ఉంటుంది. అయినా వారు ప్రతి ఏటా ఆయా నిధుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో ఆలస్యం అయితే వారే ఏదో రకంగా ఫీజులను చెల్లించుకోవాలి. లేకపోతే కాలేజీ యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వరు. దీంతో వారు డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరడానికి వీలు లేకుండా పోతోంది.... ఇదీ రాష్ట్రంలోని ఫీజురీయింబర్స్‌మెంట్ పొందుతున్న ఇంటర్, డిగ్రీ విద్యార్థుల గోస... రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ, ఈబీసీ, వికలాంగులైన విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. ఈ వర్గాలకు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ కోసం కేటాయిస్తున్న నిధులు ప్రతి ఏటా సుమారు రూ. 2400 కోట్ల వరకు ఉంటున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫీజురీయింబర్స్‌మెంట్‌లో జూనియర్, డిగ్రీ కాలేజీల విద్యార్థులకు అవసరమయ్యే నిధులు కేవలం రూ. 430 కోట్లు మాత్రమే. వివిధ కోర్సుల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, వికలాంగ విద్యార్థులు సుమారు 13.50 లక్షలకు పైగా ఉంటున్నారు. వీరిలో ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో విద్యను అభ్యసిస్తున్న వారు సుమారు 9.85 లక్షల మంది ఉంటున్నారు. అంటే రీయింబర్స్‌మెంట్ పొందుతున్న మొత్తం విద్యార్థుల్లో ఇంటర్, డిగ్రీ విద్యార్థులు 70 శాతం వరకు ఉంటుండగా... వారికి అవసరం అయిన నిధుల్లో మాత్రం ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ కోసం కేటాయించిన నిధుల్లో 20 శాతం మాత్రమే అవసరం అవుతున్నాయి. ఫీజురీయింబర్స్‌మెంట్ పొందుతున్న వారిలో ఇంటర్ విద్యార్థులు 4.60 లక్షల మంది ఉండగా... వారికి ప్రభుత్వం చెల్లిస్తున్న రీయింబర్స్‌మెంట్ రూ. 90 కోట్లు. డిగ్రీ విద్యార్థులు 5.25 లక్షల మంది ఉండగా... వారికి ఇస్తున్న నిధులు రూ. 340 కోట్లు. మొత్తంగా రీయింబర్స్‌మెంట్ పొందుతున్న వారు ప్రతి ఏడాది 13.50లకు పైగా ఉంటున్నారు. గత మూడు సంవత్సరాలుగా రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి... 2015-16లో 14,11,477 మంది, 2016-17 విద్యా సంవత్సరంలో 13,65,102 మంది ఉండగా, 2017-18లో అది కాస్త 13,34,227 కు తగ్గింది. ఇలా ప్రతి ఏటా రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే వారు 13.50 లక్షలకు పైగానే ఉంటున్నారు.

పీజీ, ఇతర కోర్సుల వారికి 70 శాతం నిధులు

రీయింబర్స్‌మెంట్ పొందుతున్న వారిలో ఇంటర్, డిగ్రీ వారు కాకుండా పీజీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల్లో చేరే వారు సుమారు 4 లక్షల నుంచి 4.50 లక్షల వరకు ఉంటున్నారు. కానీ వారికి ప్రభుత్వం చెల్లిస్తున్న ఫీజురీయింబర్స్‌మెంట్ మాత్రం సుమారు 1800 కోట్ల వరకు ఉంటున్నాయి. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌కు కేటాయించిన నిధుల్లో సుమారు 70 శాతం నిధులను ఇంటర్, డిగ్రీ ఆపై ఉన్నత విద్యను అభ్యసించే వారికే కేటాయిస్తోంది. ఇంటర్, డిగ్రీ వారికి ఇవ్వాల్సిన రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం సక్రమంగా విడుదల చేయకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులు ఉంటున్నాయని అసోసియేషన్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లోనే పరీక్షల బహిష్కరణ: ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల అసోసియేషన్

రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాల కష్టాలను పరిగణనలోకి తీసుకొని తమకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఇంటర్, డిగ్రీ ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాల అసోసియేషన్ నేతలు గౌరీ సతీష్, రమణారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాము గత 42 నెలలుగా ఫీజురీయింబర్స్‌మెంట్ రాకపోవడంతోనే నిస్సహాయ స్థితిలోనే ఇంటర్ పరీక్షల బహిష్కరణకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రభుత్వంతో తాము ఘర్షణ పడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేకపోవడంతో యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోందని తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

కాలేజీ నిర్వహణకు రూ. 40 లక్షలు అవసరం

ఇంటర్, డిగ్రీ కాలేజీని నిర్వహించాలంటే ఏడాదికి కనీసం రూ. 40 లక్షల వరకు ఖర్చు అవుతుంది. బోధన, బోధనేతర సిబ్బంది జీతభత్యాలు, కరెంటు బిల్లులు, అద్దెలు, విద్యార్థుల గుర్తింపుకు ఇచ్చే చెల్లింపులు అన్ని కలిసి సుమారు రూ. 40 లక్షల వరకు అవసరం అవుతోంది. అయితే ఒకకాలేజీలో ఎంబీసీ, బైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు ఉంటాయి. వీటిలో ఒక్కో సెక్షన్‌కు 80 మంది లాగా సీట్ల కేటాయింపు ఉంటుంది. వీటిలో ప్రభుత్వం వీరికి ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ. 10 లక్షల వరకు ఉంటుంది. విద్యార్థుల నుంచి ఫీజుల ద్వారా రూ. 25 లక్షల వరకు ఆదాయం వస్తోంది. మొత్తంగా సుమారు రూ. 35 లక్షల వరకు ఆదాయం వస్తోంది. ఖర్చు మాత్రం రూ. 40 లక్షలు. ఈ విధంగా ప్రతి ఏడాది లోటుతో కాలేజీలను నడిపించలేక మూడు సంవత్సరాల్లో 30 కాలేజీలను మూసేసినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

పెట్టుబడి చెక్కులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి అంశాన్ని పర్యవేక్షించే బాధ్యతను రైతు సమన్వయ సమితుల వ్యవస్థకు అప్పగించాలన్నారు. ఈ అంశంపై ప్రత్యేకంగా ఆదివారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పెట్టుబడి మద్దతు పథకం అమల్లో పాటించాల్సిన జాగ్రత్తలు, నియమ, నిబంధనలపై అధికార యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేశారు.

త్వరలోనే 42 మంది సభ్యులతో రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితి పాలకమండలిని ఏర్పాటు చేస్తామని సీఎం ఈ సందర్భంగా ప్రకటించారు. ఇందులో 30 జిల్లాలకు సమాన ప్రాతినిధ్యం ఉంటుందని స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లో వ్యవసాయ రంగ నిపుణులను, వారి కృషిని గుర్తించి రైతు సమన్వయ సమితి కార్పొరేషన్‌లో డైరెక్టర్లుగా నియమిస్తామన్నారు. అలాగే ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేతలకు కూడా చోటు కల్పించనున్నట్లు ప్రకటించారు. ఈ నెల 25, 26 తేదీల్లో గ్రామ, మండల, జిల్లా రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా సీఎం కేసీఆర్ సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్వహించే ప్రాంతాయ సదస్సును రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని ఎంపిక చేయాలన్నారు. ఇక్కడ నిర్వహించే సదస్సుకు జనగామ, మెదక్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన రైతు సమన్వయ సమితి సభ్యులను ఆహ్వానించాలన్నారు.

అలాగే 26న రెండో ప్రాంతీయ సదస్సును కరీంనగర్‌లో నిర్వహించాలన్నారు. ఈ సదస్సుకు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొమురం భీం ఆసిఫాబాద్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్ధిపేట జిల్లాలకు చెందిన రైతు సమన్వయ సమితి సభ్యులను ఆహ్వానించాలని సూచించారు. సమితి సభ్యులు, రైతులందరికీ ప్రయాణ, భోజన సదుపాయాలు కల్పించాలన్నారు. ఈసారి వ్యవసాయం, అనుబంధ రంగాలు కలుపుకుని అసెంబ్లీలో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో వారం, పది రోజుల్లగా ముసాయిదాను సిద్ధం చేయాలని కేసీఆర్ ఆదేశాలిచ్చారు. పంట పెట్టుబడి మద్దతు పథకానికి సంబంధించిన ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో రెండు విడతలుగా అందించనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రత్యేక సబ్సిడీపై నాట్లేసే యంత్రాలను సరఫరా చేయాలన్నారు.

రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి

హైదరాబాద్, కరీంనగర్‌లలో జరిగే ప్రాంతీయ రైతు సమన్వయ సమితి సభ్యుల సదస్సుల్లో సీఎం కేసీఆర్ పాల్గొంటారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సుల్లో ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి సందేశాలతో పాటు రైతులతో తాను నేరుగా సంభాషించే విధంగా ఏర్పాట్లు చేయాలని కేసీఆర్ అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలపై వ్యక్తిగత అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలతో పాటు అనుబంధ విభాగాల అధికారులు ఈ సదస్సుల్లో విధిగా పాల్గొనాలని ఆదేశించారు.

రైతులను సంఘటితం చేయడమే లక్ష్యం కావాలి

రైతులను సంఘటితం చేయడం, రైతు వేదికల నిర్మాణం, నిర్వహణ, రైతులకు నిరంతర శిక్షణ, పెట్టుబడి మద్దతు పథకం, అన్ని పంటలకు కనీస మద్దతు ధరలుమార్కెట్లకు ఉత్పత్తుల తరలింపు, వాటిపై నియంత్రణ, మేలైన సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయ విధానం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, నిర్వహణ, క్రాప్ కాలనీల ఏర్పాటు తదితర అంశాలన్నీ రైతు సమన్వయ సమితుల సర్వేక్షణలోనే జరుగాలని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా అధికారులతో స్పష్టం చేశారు. ఆ దిశగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేయాలన్నారు. ఈ అంశాలపై ప్రాంతీయ సదస్సుల్లో కరదీపికలు అందించడంతో పాటు ప్రతి అంశంపై వివరంగా చర్చించి విశదీకరించాలని సూచించారు. రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితిలో చోటు కల్పించేవారి కోసం వ్యవసాయ రంగాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసిన వారిని గుర్తించి వారి పేర్లను ప్రభుత్వానికి నివేదించాలని అధికారులకు సీఎం బాధ్యతలు అప్పగించారు.

నవంబర్ 18 నుంచి యాసంగి పెట్టుబడి

యాసంగి సీజన్‌కు సంబంధించి నవంబర్ 18 నుంచి పెట్టుబడి మద్దతు పథకం నిధులను పంపిణీ చేయాలని సీఎం కేసీఆర్ సూచించారు. వచ్చే సీజన్‌పై నిర్లక్ష్యం చేయకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ మొత్తానికి సబంధించిన నిధులను ఈ బడ్జెట్‌లోనే కేటాయిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను యాంత్రీకరణ వైపు మళ్ళించే ప్రయత్నం చేయాలని, ఆ దిశగా ప్రోత్సాహకాలు, రాయితీలు అందించాలని సూచించారు. ఏఏ యంత్రాలను సబ్సిడీపై ఇస్తున్నామనే విషయంపై విస్తృతస్థాయి ప్రచారం నిర్వహించాలన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. అయితే ఈ కార్యక్రమాలకు ఎక్కడా నిధుల సమస్య తలెత్తకుండా అధికారులు ముందుజాగ్రత్త చర్యలను చేపట్టాలన్నారు.

ఈ సమావేశంలో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, బాల్క సుమన్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు శేరి సుభాష్‌రెడ్డి, బాలమల్లు, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి, కమిషనర్ జగన్మోహన్, వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ప్రవీణ్ రావు, ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో నిర్భయ ఘటన

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు తెలియని వ్యక్తి బాలికను అడ్డగించి బెదిరించాడు. అనంతరం చెట్ల పొదల్లోకి లాక్కెళ్లాడు. అరవకుండా నోట్లో గుడ్డలు కుక్కి రాడ్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాలికపై అత్యాచారం జరిపి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన బాలికను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకుని బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు కలవడానికి వెళ్లిన స్నేహితుడే ఈ దారుణానికి ఒడిగట్టాడా? లేక ఎవరైన బాలిక కదలికలు గమనించి అత్యాచారం చేశారా? అన్న కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటన జరిగి రెండు నెలలు కావస్తున్నా నిందితుడిని పట్టుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిందితుడి కోసం తీవ్రంగా గాలిస్తున్నామని మరోవైపు పోలీసులు చెబుతున్నారు.

ఆరోగ్యశ్రీలో నిబంధనలకు నీళ్లు

- పేదల సొమ్ము నొక్కేస్తున్న వైద్యులు
- అక్రమాలను పట్టించుకోని అధికారులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆరోగ్య శ్రీ పథకంలో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోంది. పేదల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తోన్న సొమ్మును కొందరు వైద్యులు నొక్కేస్తున్నారన్న ఆరోప ణలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోగ్యశ్రీ కోసం ప్రభుత్వం మంజూరు చేసే నిధుల్లో ప్రభుత్వ వైద్యులకు కేటాయింపులు ఉంటాయి. ఈ చెల్లింపులో భారీగా అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ఆస్ప త్రుల్లో కూడా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. రెండు చోట్లా అధికారికంగా వైద్యులకు ఇచ్చే నిధులను తమ ఖాతాలో వేసుకుం టున్నారు. ఆరోగ్యశ్రీ మార్గదర్శకాలకు పూర్తి విరుద్ధంగా జరుగుతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆరోగ్యశ్రీ ట్రస్టు ఉన్నతాధికారులు, పర్యవేక్షణా అధికారులు ప్రైవేటు ఆస్పత్రులతో సంబంధమున్న వారే కావడంతో ఈ అక్రమాలకు అడ్డులేకుండా పోతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు నష్టపోతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.

35 శాతం ప్రభుత్వ వైద్యులకు

ఆరోగ్యశ్రీ కింద పేదల కోసం ఏటా రూ.500 కోట్లను ప్రభుత్వ ఖర్చు చేస్తోంది. ఈ కుటుంబాల్లోని 2.75 కోట్ల మందికి ఆరోగ్యశ్రీ వర్తిస్తోంది. వీరికి వైద్యం అందించిన ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ ట్రస్టు ఎప్పటికప్పుడు చెల్లింపులు జరుపుతోంది. ప్రైవేటు ఆస్పత్రిలో అయితే శస్త్రచికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును ఆయా ఆస్పత్రి యాజమాన్యాలకు చెల్లిస్తోంది. ప్రభుత్వాసుపత్రుల్లో శస్త్రచికిత్స జరిగితే దీనికయ్యే ఖర్చులో 20 శాతం మొత్తాన్ని రివాల్వింగ్ ఫండ్‌గా పక్కనబెడతారు. మిగిలిన 80 శాతం మొత్తాన్ని ఆరోగ్యశ్రీ ట్రస్టు సదరు ఆస్పత్రికి విడుదల చేస్తోంది. ఈ 80 శాతంలో 35 శాతం శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యులకు వైద్య సహాయ సిబ్బందికి ఇస్తారు. వైద్య సిబ్బందికి చెల్లించే ఈ 35 శాతం నిధుల విషయంలోనే అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో లేకున్నా కొందరి సహకారంతో శస్త్ర చికిత్స చేసిన వైద్య సిబ్బంది బృందంలో సభ్యులుగా నమోదవుతూ ఆరోగ్యశ్రీ నిధుల్లో వాటా తీసుకుంటున్నారు. ఆయా ఆస్పత్రుల్లోని తమ విభాగం పరిధిలోని ఇతర వైద్యుడు చేసే శస్త్ర చికిత్సకు రెసిడెంట్ వైద్యులు చేసే చికిత్సలకు సైతం విధి నిర్వహణలో లేని వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి.

లక్ష్యం సాధించిన కేవీఐసీ

• 2008-09లో 50 %కి దిగువన

• 2016-17లో 100.37%

• ఫలితాలిస్తున్న ప్రధానమంత్రి ఉపాధి కల్పన • మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలోవెల్లడి

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా (పీఎంఈజీపీ) 2016-17కు గాను నిర్దేశించిన లక్ష్యాన్ని ఖడి అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) సాధించింది. గుర్గావ్‌కు చెందిన మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ తెలిపిన వివరాల ప్రకారం... 2008-09లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా ఖడి అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ లక్ష్యాన్ని నిర్దేశించింది. 2008-09లో ఉపాధి కల్పించడంలో కేవీఐసీ 50 శాతానికి దిగువనే ఉండిపోయింది. కానీ 2016-17 వచ్చే సరికి అనూహ్యమైన మార్పు వచ్చింది. నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి ఔరా అనిపించుకుంది. 100.37 శాతం సాధించి పేరొందిన కంపెనీల సరసన చేరుకుంది. దేశ వ్యాప్తంగా ఉన్న 10,044 ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమ కేంద్రాల నుండి (కేవలం 5 శాతం కేంద్రాలు మాత్రమే...) లబ్ది పొందిన వారి నుండి డాటాను సేకరించడం జరిగింది. ఇందులో వాటాదారులతో పాటు అదనపు వనరులను అధ్యయనం చేసిన తరువాత... ఒక్కో ప్రాజెక్టు నుంచి సగటున 7.66 మందికి ఉద్యోగం కల్పించినట్టు వెల్లడైంది. ఒక్కో యూనిట్ నుంచి ఉపాధి కల్పించడానికి సగటున రూ.94,855 ఖర్చు అవుతున్నది. అదేవిధంగా ఒక్కో ప్రాజెక్టుకు సగటున వ్యయం లెక్కించగా రూ.7,26,760గా నిర్ధారించడం జరిగింది. యూనిట్ ఎంప్లాయ్‌మెంట్‌ను కల్పన కోసం గరిష్ట, కనిష్టంగా ఖర్చులు ఆయా రాష్ట్రాల్లో పలు రకాలుగా ఉంది. నాగాలాండ్‌లో రూ.2,65,412 ఖర్చు అవుతున్నది. అదే తమిళనాడులో అయితే రూ.25,070గా నిర్ధారించడం జరిగింది. మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ చేసిన అధ్యయనం ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ బీసీ నుండి ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద లబ్ది పొందుతున్న వారి వయస్సును సగటున లెక్కించగా.. 36.8 ఏళ్లుగా ఉంది. దేశవ్యాప్తంగా 42.39శాతం ఎస్సీ, ఎస్టీ ఓబీసీ అభ్యర్థులు లబ్ది పొందుతున్నారు. మైనార్టీల్లో చూస్తే 5.8 శాతంగా ఉంది. అంటే కేవలం 10 శాతం మాత్రమే మహిళలు ఉన్నట్టు అధ్యయనం వెల్లడైంది. తయారీ రంగంలో 53 శాతం మంది, సర్వీసెస్‌లలో 45 శాతం మంది పథకంలో భాగంగా లబ్ది పొందుతున్నారు. బ్యాంకుతో సంబంధం ఉన్న రంగంలో 46 శాతం మంది ఉపాధి పొందగా, బ్యాంకుల ద్వారా ఆస్తుల వసూళ్లకు సంబంధిత రంగంలో 54 శాతం మంది ప్రధానమంత్రి ఉపాధి కల్పనలో భాగంగా ఉపాధి పొందుతున్నారు. ఉపాధి చూపించే విషయమై కేంద్రం లోతుగా విచారణ చేపట్టిందని.. కేంద్రం ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించడంచాలా సంతోషంగా ఉందని. కేవీఐసీ చైర్మన్ వినయ్‌కుమార్ తెలిపారు.

భూములతోనే పారిశ్రామిక ప్రగతి

• భూ బ్యాంక్ బలోపేతం

• ప్రభుత్వ భూముల సంరక్షణ

• 1.45 లక్షల ఎకరాల నిధి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ భూ నిధి మరింత ద్విగుణీకృతమవుతున్నది. ఆక్రమిత భూములను పరిరక్షించడమే కాకుండా... ప్రభుత్వ భూముల సంరక్షణే లక్ష్యంగా ప్రభు త్వం అడుగులు వేస్తోంది. వివాదాలు, కోర్టు కేసులను అధిగమిస్తూ మరింత బలోపేతంగా భూ బ్యాంక్ పతిష్టమవుతోంది. స్వరాష్ట్రంలో సత్వర ప్రగతికి, పారిశ్రామిక అవసరాలకు భూ బ్యాంక్ తప్పనిసరని గుర్తించిన ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ ముమ్మరం చేసింది. ఇందుకు కార్యాచరణ నిర్ధేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. తద్వారా విలువైన భూములతో పారిశ్రామిక రంగానికి ఇతోధిక సాయం చేసేం దుకు ఉద్యుక్తమవుతోంది. భూ ముల విలువలు భారీగా పెరుగుతున్న తరుణం లో పారిశ్రామిక, ప్రజావసరాలకు ఎటువంటి ఇబ్బందులకు లేకుండా కృషి చేస్తోంది. కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను భూమి బ్యాంకుకు చేర్చి వాటిని ప్రజావసరాలకు వీలుగా పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీలను నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మిగతా ప్రాంతాల్లో భారీ ఎత్తున ఉన్న భూ పార్శిళ్లను పారిశ్రామిక వినియోగానికి కేటాయిస్తోంది. తద్వారా పారిశ్రామీకీకరణకు ఇబ్బందులులేని రీతిలో భూముల కల్పనకు పాటుపడుతోంది.

పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తున్న సర్కార్ అందుకు అనువైన వసతుల కల్పనలో

ల్యాండ్ బ్యాంక్ బలోపేతం

ఇందులో భాగమే తెలంగాణ ల్యాండ్ బ్యాంక్‌ను సర్కార్ మరింత బలోపేతం చేసే చర్యలు. తాజాగా ప్రభుత్వ చర్యలతో విలువైన భూములు ఖాతాలోకి చేరడంతో భూమి బ్యాంక్ మరింత విలువను సంతరించుకుంటోంది. భూ దస్త్రాల పరిశీలన తర్వాత పూర్తిగా స్పష్టత రావడంతో పారిశ్రామిక అవసరాలు, ప్రజావసరాలే వేదికలుగా సర్కార్ కృషి ఆరంభించింది. ఒకవైపు పరిరక్షణకు సాధ్యం కాని విలువైన భూములను వేలం వేస్తున్న సర్కార్ అంతే ముందుచూపుతో మరోవైపు భవిష్యత్ అవసరాలకు లాండ్ బ్యాంక్‌ను పతిష్టం చేస్తోంది.భవిష్యత్ వాణిజ్య, పారిశ్రా మిక అవసరాలకు కూడా ముందుగానే భూము లను సేకరించి పెట్టాలని భావించింది తెలంగాణ సర్కార్. టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 1,45,682.99 ఎకరాల విస్తీర్ణంలోని భూములను పారిశ్రామిక ప్రయోజనకారిగా గుర్తిస్తూ ఇటీవలే నిర్ణయం తీసుకుంది. వీటిని భూమి బ్యాంక్‌కు చేర్చి భవిష్యత్ అవసరాలకు వినియోగించాలని యోచిస్తోంది.

నూ అంతే ప్రాధాన్యతతో ముందుకు వెళుతోంది. టీఎస్ఐపాస్ ద్వారా పరిశ్రమల అనుమతు లతో అంతర్జాతీయ ఖ్యాతిగడించిన ప్రభుత్వం అందుకు అనుకుగా మౌలిక వసతుల కల్పన లోనూ అంతే జాగ్రత్తగా వ్యవహరి స్తోం ది. తద్వారా అంతర్జాతీయ, జాతీయ పరిశ్రమలు ఎక్కడా వెనుక డుగు వేయకుండా పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లను చేస్తోంది రాష్ట్రప్రభుత్వం. ప్రభుత్వ, ప్రజోపయోగ అవసరాలకే కాకుండా పారిశ్రామిక అవసరా లకూ భూముల ను గుర్తిం చి పొదుపు చేస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా ల్యాండ్ బ్యాంక్‌ను వేదికగా చేసుకుంటోంది.

ప్రభుత్వ భూముల రక్షణకు...

మునిసిపాలిటీలు, మండల కేంద్రాల్లోని విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమణదారు లనుంచి పరిరక్షించే చర్యలను యుద్ధప్రాతిప దికన చేపట్టింది. ఇప్పటివరకు రూ. 14,284 కోట్ల విలువైన 10410.16 ఎకరాల భూములను గుర్తించింది. ఒక్క హైదరాబాద్‌లోనే 96 పార్శిళ్లద్వారా 90.18 ఎకరాల భూమిని ల్యాండ్ బ్యాంక్‌లో జమ చేసింది. వీటి విలువ దాదాపు రూ.700కోట్లుగా గుర్తించారు. మరోవైపు మున్సిపాలిటీలకు చెందిన 4753ఎకరాలను, మండల కేంద్రాలకు చెందిన 5656 ఎకరాల భూములను గుర్తించి వాటి పరిరక్షణకు కీలక ఏర్పాట్లను చేస్తోంది.

మద్దతు ధర విషయంలో జాప్యమొద్దు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మద్దతు ధర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడకుండా సకాలంలో నిర్ణయం తీసుకుని రైతులకు అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాలు ఉద్రుతమవుతాయని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో ఎర్రజొన్న, కంది రైతులు మద్ధతు ధర లభించక గత మూడు రోజులుగా ఆందోళన బాట పట్టిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో పంట ధరలను రైతులు కాక వ్యాపారులు నిర్ణయిస్తున్నారని, ఫలితంగా వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో రైతాంగం క్రమంగా ఆందోళన బాట పడుతున్నారని పేర్కొన్నారు. గిట్టుబాటు ధరల గురించి ప్రభుత్వాలచే నియమించబడిన కమిషన్ల మద్ధతు ధర అమలు చేయాల్సిన తీవ్రతను తెలిపినప్పటికీ పాలకులు అమలుకు పూనుకోవడం లేదని, ప్రకటించిన మద్ధతు ధరలు కూడా అమలు కావడం లేదన్నారు.ఎకరం జొన్న పంటకు రూ. 3560 లు ఖర్చు పెడితే కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధర కూడా రైతుకు అందడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరా కందు సాగుకు రూ. 7601 లు రైతుకు ఖర్చు కాగా క్వింటాల్‌కు రూ. 5450లు మాత్రమే మద్ధతు ధర ప్రకటించారన్నారు.

ఎర్రజొన్న రైతన్న ఆక్రందన తీరేదెలా?

• రంగంలోకి దిగిన వ్యవసాయ శాఖ

• సోమవారం నుంచి మూడు జిల్లాల్లో కొనుగోళ్లు

• మద్దతు ధర రూ.2,300కే అమ్మాలని రైతులకు విజ్ఞప్తి

• మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రత్యేక నిఘా

• సంయమనం పాటించండి : మంత్రి పోచారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎర్రజొన్న రైతుల సమస్య చిలికి చిలికి గాలివానలా మారుతోంది. ఆర్మూరు, నిజామాబాద్, సిరిసిల్ల జిల్లాల్లో పెద్దఎత్తున పండించిన ఈ పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపినప్పటికీ ఆందోళన విరమించేది లేదని రైతులు స్పష్టంచేశారు. దీంతో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. గత వారం రోజులుగా మూడు జిల్లాల్లో తీవ్రంగా కొనసాగుతున్న రైతుల ఆందోళనల నేపథ్యంలో సోమవారం నుంచి ఎర్రజొన్నలను కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ సంస్థకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే క్వింటాలు ఎర్రజొన్నలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2300లకు కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధమైనప్పటికీ ఆ ధర తమకు ఏమాత్రం గిట్టుబాటు కాదని రైతులు స్పష్టంచేస్తున్నారు. గత ఏడాది రూ.4వేల వరకు అమ్ముడుపోయిన తమ పంట ఈసారి ప్రభుత్వ మద్దతు ధరకు అమ్మినా నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏ విధానాన్ని అవలంబిస్తే బాధిత రైతులకు న్యాయం జరుగుతుందన్న అంశంపై మంత్రి అధికారులతో సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ, ఎర్రజొన్నల కొనుగోలు విధి విధానాలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూడు జిల్లాల్లో మొత్తం 50వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగైందని, పండించిన రైతులందరికీ న్యాయం జరిగేలా చూడాలని స్పష్టంచేశారు.మొదటగా ఐదు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ఎర్రజొన్నలను కొనుగోలు చేయాలని, అవసరం మేరకు ఆ కేంద్రాలను పెంచాలని సూచించారు. నిజామాబాద్, ఆర్మూరు, వెల్పూర్, కమ్మరపల్లి, బాల్కొండ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

టోకెన్ల ఆధారంగా కొనుగోళ్లు

వ్యాపారులు, దళారుల ప్రమేయం లేకుండా ఉండేందుకు ఎర్రజొన్న పండించిన రైతులందరికీ వ్యవసాయశాఖ అధికారుల ద్వారా టోకెన్లు ఇస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. టోకెన్లపై ఉంది తేదీ, సమయాన్ని దృష్టిలో పెట్టుకుని తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకురావాలని ఈ సందర్భంగా రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ ప్రతులను తీసుకుని రావాలన్నారు. అమ్మిన పంటకు సరిపడే నగదు మొత్తాన్ని ఆర్‌టీజీఎస్ ద్వారా ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రైతులు మధ్యవర్తులకు అమ్మి మోసపోవద్దని అన్నారు.

అందరికీ ఆరోగ్యమే ఆయుష్ లక్ష్యం

• ఆహారపు అలవాట్ల మూలంగానే ఊబకాయం

• ప్రకృతి వైద్యంపై అవగాహన పెరగాలి: కేంద్రమంత్రి శ్రీపాద్ నాయక్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: అందరికీ ఆరోగ్యం కల్పించడమే ఆయుష్ శాఖ లక్ష్యమని కేంద్ర ఆయుషశాఖ మంత్రి శ్రీపాద్‌నాయక్ అన్నారు. సక్రమమైన ఆహారపు అలవాట్లు లేకపోవడం మూలంగానే ఊబకాయం వంటి రోగాలు వస్తున్నాయని, అందుకే ప్రతి వ్యక్తి మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. ప్రజల్లో ప్రకృతి వైద్యంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. హైదరాబాద్‌లో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సహజ ఆహార పండుగ ముగింపులో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి, తెలంగాణ ఆయుష్ డైరక్టర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి డైరక్టర్ డాక్టర్ సత్యలక్ష్మి, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. జాతీయ సహజ ఆహారపు పండగ హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరిగింది. వివిధ రాష్ట్రా లకు చెందిన ఆయుష్ కాలేజీల విద్యార్థులు వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. జాతీయ సహజ ఆహారపు పండుగ సందర్భంగా ఆయుష్ కాలేజీల విద్యార్థులకు వివిధ పోటీలను ఎన్ఐఎన్ నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ప్రైజ్‌మనీతోపాటు, ప్రశంసా పత్రాన్ని కేంద్ర, రాష్ట్ర మంత్రులు అందించారు. ప్రజల ఆహారపు అలవాట్ల మూలంగానే ఊబకాయం, మధు మేహం, ఒత్తిడి వంటి రోగా లు వస్తున్నాయని కేంద్ర మంత్రి శ్రీపాద్‌నాయక్ అన్నారు. ఆహారపు అలవాట్లను మార్చుకుంటే కొన్ని రోగాలకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. మానవులు ఆహారపు అలవాట్లను నియంత్రిం చుకోవాలని సూచించారు. ప్రకృతి వైద్యంపై ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సిన అవ సరం ఉందన్నారు. ఇందుకు ప్రభుత్వాలు తగిన కృషి చేయాలని, వాటితో పాటు స్వచ్ఛంధ సంస్థలు కూడా ముందుకు వచ్చి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలన్నారు. సహజసిద్ధంగా లభిం చ ఆహారం లో పౌష్టి కాలు ఎక్కువ గా ఉంటాయని, వాటిని తీసుకోవ డం ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని తెలిపారు.

ప్రకృతి వైద్యంపై అవగాహన పెరగాలి



ప్రకృతి వైద్యంపై అవగాహన పెరుగుతోం దని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి తెలిపారు. జాతీయ సహజ ఆహారపు పండుగకు మంచి ఆదరణ ఉందని, కనీసం వారం రోజులపాటు ఉంటే బాగుంటుందని ప్రజలు కోరు కుంటు న్నారని అన్నారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు బంగారు తెలంగాణ సాధనలో ఆరోగ్య తెలంగాణ కోసం కృషి చేస్తున్నారని తెలి పారు. 6 నెలల్లో ఇంటిం టికి నల్లా నీరు అందిం చడ మే కాకుండా, సాగు నీటిని సైతం అందించేలా పథ కాల ను అమ లు చేస్తు న్నట్టు మంత్రి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

ఎత్తిపోతలకు 10621 మెగావాట్ల విద్యుత్

• 51 లక్షల ఎకరాలకు సాగునీరు

• దశలవారీగా కాళేశ్వరం పనులు పూర్తి

• ఫలిస్తున్న సీఎం కేసీఆర్ కల



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఓ వైపు కృష్ణా, మరో వైపు గోదావరి నదీజలాలతో తెలంగాణ రాష్ట్రం ఇపుడిపుడే జవసత్వాలు పుంజుకుంటోంది. మిషన్ భగీరధ, మిషన్ కాకతీయ వంటి బృహత్తర పథకాలతో ఇంటింటికీ తాగునీటి అవసరాలు తీర్చటమే కాకుండా వ్యవసాయరంగాన్ని కొత్తపుంతలు తొక్కించటంతోపాటు , పారిశ్రామిక రంగాల అభివృద్ధితో రాష్ట్ర జీడీపీని పెంచేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ప్రణాళిక ఫలితాల దిశగా అడుగులు వేస్తోంది. తెలంగాణ రాష్ట్ర భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కృష్ణా,గోదావరి నదీజలాలను ఉపయోగించుకు నేందుకు చేపట్టిన ఎత్తిపోతల పథకాల పనులు వేగం పుంజుకున్నాయి. ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన పనులు కూడా గడువు లోపే పూర్తి చేయాలని ట్రాన్స్‌కో లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో ఇప్పటికే 15 చిన్న తరహా సాగునీటి ఎత్తిపోతల పథకాలు నడుస్తున్నాయి. వీటికి 577.90 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. ఏటా ఈ పథకాల ద్వారా 1987.15 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను ఉపయోగించుకుంటున్నారు. అదే విధంగా మరో 4 మద్యతరహా సాగునీటి ఎత్తిపోతల పథకాలు నడుస్తున్నాయి. వీటికి 705మెగావాట్ల డిమాండ్ వుండగా , వీటి ద్వారా ఏటా 1997.52 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉపయోగించు కుంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 32 ఎత్తిపోతల సాగునీటి పథకాలను చేపట్టారు. అందులో 9 మేజర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు కాగా, 13 మీడియం లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు ఉన్నాయి. ఇవికాక మరో 10 స్మాల్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు ఉన్నాయి. ఈ పథకాలకు మొత్తం 10621 మెగావాట్ల విద్యత్ అవసరం కానుంది. ఎత్తిపోతల పథకాల సివిల్ పనులకు తగ్గట్టుగానే విద్యుత్ పనులు కూడా సమాంతరంగా ప్రారంబిం చారు. చిన్న తరహా ఎత్తిపోతల పథకాలకు 419.60మెగావాట్లు, మద్యతరహా ఎత్తిపోతల పథకాలకు 2510.50మెగావాట్లు, భారీ ఎత్తిపోతల పథకాలకు 7691 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ అంచనావేసి అమేరకు పనులు చేపట్టారు. వీటిలో పలు పథకాలకు విద్యుత్ పనులు గడువుకు ముందే పూర్తి చేయాలని ట్రాన్స్‌కో లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఎత్తిపోతల పథకాల విభాగం డైరెక్టర్ జి.సూర్యప్రకాష్ అంధ్రప్రభ ప్రతినిధితో పేర్కొన్నారు. గోదారి జలాల ఆధారంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి 4000మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేసి సుమారు రూ.2500కోట్లతో పనులు చేపట్టారు . ఈ ఏడాది డిసెంబర్‌లోగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం విద్యుత్ పనులు పూర్తికానున్నాయి. అదే విధంగా రూ.200కోట్లతో చేపట్టిన శ్రీరాంసాగర్ వరదకాలువ ఎత్తిపోతల పథకం పనులు కూడా మూడు దశల్లో చేపట్టారు. 150మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌తో చేపట్టిన ఈ పథకం పనులు కూడా గడువుకు ముందే పూర్తి కానున్నాయని ట్రాన్స్‌కో వర్గాలు పేర్కొన్నాయి.

రబీలో విద్యుత్‌కు డిమాండ్

• 120 శాతానికి చేరిన వరిసాగు • యాసంగికి అండగా 24గంటల విద్యుత్

• 11500 మెగావాట్లకు డిస్కమ్‌లు సిద్ధం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో చలివాతావరణం క్రమేపి తగ్గిపోయి ఆ స్థానంలో ఉష్ణోగ్రతలు పెరిగుతూ వస్తున్నాయి. రబీ సీజన్‌లో పంటల సాగు అదను కూడా ముగింపు దశకు చేరుకుంది. టీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న సాహపేత నిర్ణయం అమల్లోకి వచ్చి ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరా ప్రారభమైంది. దీంతో పంటల సాగుపట్ల రైతాంగంలో కొండంత ధైర్యం పెరిగింది. భూగర్భ జలాల ఆధారంగా రైతులు వరిసాగు పట్ల మొగ్గటంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతూ వస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలోని రెండు డిస్కంల పరిధిలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్దాయిలో 9622మెగావాట్లకు చేరినట్టుతెలంగాణ రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ ఉన్నతాధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో యాసంగి పంటల విస్తీర్ణం గణనీయంగా పెరగటమే ఇందుకు కారణం అని పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో వరి సాగు సాగు సాధారణ విస్తీర్ణం 6.5లక్షల హెక్టార్లు కాగా వివిధ జిల్లాల నుంచి అందిన సమాచారం మేరకు ఇప్పటికే రాష్ట్రంలో వరిసాగు విస్తీర్ణం 7.41లక్షల హెక్టార్లు దాటిపోయింది. మొత్తం యాసంగి పంటల సాధారణ సాగు విస్తీర్ణం 12.77 లక్షల హెక్టార్లు కాగా, అన్ని రకాల పంటలు కలిపి 12.56లక్షల హెక్టార్లతో సాగు విస్తీర్ణం 98శాతంకు చేరుకుంది.

11500మెగావాట్లకుసిద్ధం

రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరాను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ పంపిణీ సంస్థలు కూడా అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 23లక్షల వరకూ ఉన్నాయి. ఈ యాసంగిలో తొలిసారి విద్యుత్ సరఫరాలో డిమాండ్ గరిష్టంగా 9622మెగావాట్లకు చేరిపోయింది. సాధారణంగానే మార్చి , ఏప్రిల్ నెలల్లో ఉష్ణోగ్రతలు పెరిగి పైర్లకు నీటి తడుల అవసరం కూడా మరింత అధికం కానుంది. ఈ నేపద్యంలో విద్యుత్ డిమాండ్ కూడా 11000వేల నుంచి 11500మెగావాట్ల దాక చేరే అవకాశం ఉన్నట్టు అంచనా వేశారు. డిస్కంలు కూడా అందుకు తగ్గట్టుగానే విద్యుత్ సరఫరా ప్రణాళికలు సిద్దం చేసుకున్నాయి.

ప్రపంచలోనే తొలి ఐటీ సదస్సు

• నేడు హైదరాబాద్‌లో ప్రారంభం

• మూడు రోజులపాటు నిర్వహణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రపంచంలోనే తొలిగారిగా ఐటీ సదస్సు నేడు హైదరాబాద్‌లో జరుగుతోంది. నాస్కామ్ నేతృత్వంలో కేంద్ర ఐటీ శాఖ భాగస్వామ్యంతో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. 35 దేశాల నుంచి సుమారు 5వేల మంది ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. టెక్నాలజీ పరివర్తన, దాని ఫలితాల్లపై ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీ నుంచి లైవ్ టెలికాస్ట్ ద్వారా ప్రసంగించనున్నారు. కేంద్ర ఐటీశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావులతో పాటు జాతీయ, అంతర్జాతీయస్థాయి ఐటీ సంస్థల అధిపతులు, నిపుణులు ఈ ప్రతిష్టాత్మక సదస్సులో పాల్గొననున్నారు.

ప్రతిభగల కళాకారులను ప్రోత్సహించాలి

• కొన్ని కుటుంబాలకే పరిమితమైన రాజకీయాలు, సినిమారంగం

• ఇది మంచి సంప్రదాయం కాదు • సినిమా రంగంలోనూ తెలంగాణ యువత రాణించాలి • భాజపా తెలంగాణ సినీ స్వర్ణకమలం వేడుకలో కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రస్తుత రాజకీయాలు, సినిమారంగం కొన్ని కుటుంబాల ఆధిపత్యంలో ఉన్నాయని భాజపా శాసనసభ పక్షనాయకుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఈ సంస్కృతి కొన్నేళ్ళుగా వస్తోందన్నారు. ఇది ఎంత మాత్రం మంచి సంప్రదాయం కాదన్నారు. ఏ రంగంలోనైనా ప్రతిభ, కృషి, పట్టదలతో స్వయంకృషితో రాణించాలన్నారు. ముఖ్యంగా సినిమారంగంలో వస్తున్న వారసత్వ నటులకు ఏ మాత్రం ప్రతిభలేకపోయినప్పటికీ బలవంతంగా సినిమాలను తీసి ప్రజల నెత్తిన రుద్దుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోకూడా ఎంతో ప్రతిభ గల కళాకారులకు కొదవలేకపోయినప్పటికీ, వారికి సరైన అవకాశాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని గుర్తించి ప్రోత్సహిస్తున్న తెలంగాణ భాజపా సినిమా సెల్ విభాగం నాయకులను ఆయన అభినందించారు.ఆదివారం నగరంలో సారిధి స్టూడియోలో తెలుగు సినిమా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్ర కళాకారులను తెలంగాణ సినీ స్వర్ణకమలం పేరిట అవార్డులను ఇచ్చి సత్కరించారు. భాజపా రాష్ట్ర సినిమా సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అవార్డులను అందుకున్న కళాకారులను ఉద్దేశించి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, సహజసిద్ధమైన కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలోని కళాకారులకు ఒక భరోసా ఇచ్చినట్లు అవుతుందన్నారు. తెలంగాణ సంస్కృతి, సాహిత్యంపై అనేక సినిమాలు రావాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఔన్నత్యాన్ని చాటిచెప్పే విధంగా సినిమాలను తీయాలని కిషన్‌రెడ్డి సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సుమారు నాలుగు సంవత్సరాలు అవుతున్నప్పటికీ మన రాష్ట్ర ప్రభుత్వం ఇంకా కళాకారులకు అవార్డులను ప్రకటించకపో వడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అవార్డులు ఇచ్చేంత వరకు భాజపా పక్షాన కాకతీయుల పేరిట అవార్డులను నిర్వహించాలని సూచించారు. పార్టీ సినిమా సెల్ పక్షాన మూడు సంవత్సరాలుగా అవార్డులను స్వర్ణకమలం పేరిట ఇస్తున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్రా నికి కాకతీయ రాజులు ఎంతో వన్నె తీసుకవచ్చారన్నారు. ఈ నేపథ్యంలో ఇకపై కాకతీయల పేరిట అవార్డులను అందజేయాలని సూచించారు. అలాగే తెలంగాణ కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ వద్దకు తీసుకవెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ఆర్థికంగా చితికిపోయిన కళాకారులను ఆదుకునేందుకు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకవస్తానన్నారు. అలాగే పార్టీ పక్షాన కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం సినిమా రంగంలోని వివిధ కళల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నటీ, నటులు, గాయనీ, గాయకులు, దర్శక, నిర్మాతలను సత్కరించారు. సత్కారం అందుకున్న వారిలో అశోక్‌కుమార్, వడ్డేపల్లి శ్రీనివాస్, ఆర్‌కె.మామా, టిఎల్. రాజా, మాభూమి యాదగిరి, ప్రభాతర్‌జైనీ, అయేషా, సత్యప్రియ, కోటగిరి మురళీ, టార్జాన్ శ్రీను, మధుప్రియ, రమేష్‌బాబు తదితరులు ఉన్నారు. భాజపా సినిమా సెల్ కన్వీనర్ సిఎల్ నరసింహ్మారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరమణి, ప్రధాన కార్యదర్శి చింతాసాం బమూర్తి, శాసమండలిలో పార్టీ నాయకుడు రాంచందర్‌రావు, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

బాసరలో గోదావరికి మహా హారతి



బాసర, ప్రభన్యూస్: నిర్మల్ జిల్లా, బాసర గోదావరి నదికు ఆదివారం సాయంత్రం వేద పండితులు మహా హారతి ఇచ్చారు. గోదావరి తీరాన మూడు రోజులుగా నిర్వహిస్తున్న వైదిక సమ్మేళనంలో భాగంగా రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలు పాల్గొన్నారు. గోదావరి నది తీరానికి చేరుకున్న మంత్రి, ఎమ్మెల్యేలను వేద భారతీ పీఠం నిర్వహకులు వేద విద్యానందస్వామి సాదారంగా స్వాగతం పలికారు. ద్యాగ మండపంనందు మంత్రి దంపతులచే ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం దక్షణ గంగ వేద నిత్య హారతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి నది తీరాన దక్షణ గంగా హారతి పేరిట ప్రతీరోజు హారతి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశంలో కాశీలోని గంగకు ప్రతీరోజు సాయంత్రం హారతినివ్వడం ఆనవాయితీ. అలాగే శ్రీజ్ఞాన సరస్వతీ దేవి కొలువైన బాసర గోదావరి నది తీరానికి నిత్య హారతి నిర్వహించడం శుభసూచికమన్నారు. ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ తరపున ప్రత్యేకంగా సహాయ సహకారాలు అండిస్తామన్నారు.

మా రక్తంలోనే ప్రజాస్వామ్యం

- ప్రజాస్వామ్యమే బీజేపీకి పరమావధి
- పార్టీ సిద్ధాంతాలు, విలువలకు కట్టుబడి ఉన్నాం
- జాతి ప్రయోజనాల కోసమే జనసంఘ్ పుట్టింది
- దేశ భక్తికి సంకేతంగానే కాషాయం
- బీజేపీ నూతన కేంద్ర కార్యాలయ ప్రారంభంలో ప్రధాని మోడీ



సీనియర్ నాయకుడు మురళీ మనోహర్ జోషితో ప్రధాని మోడీ మాటామంతి ... చిత్రంలో మౌనంగా కూర్చున్న అద్వానీ

న్యూఢిల్లీ: బీజేపీ అణువణువునా ప్రజాస్వామ్యంతో నిండి ఉందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రతీ అంశాన్ని ప్రజాస్వామ్యయుతంగా ఆలోచించడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని అభివర్ణించారు. న్యూఢిల్లీలో బీజేపీ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించిన ప్రధాని.. భారతీయ జన సంఘ్ నాటి నాటి నేటి బీజేపీ వరకు ప్రజల కోసం తమ పార్టీ చేసిన కృషిని మోడీ స్మరించుకున్నారు. 1951లో భారతీయ జనసంఘ్ ఆవిర్భవించింది మొదలు.. నేటి వరకు పార్టీ సిద్ధాంతాలు, విలువలు, దేశభక్తి విషయంలో ఎక్కడ తప్పలేదన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన వారిలో చాలా మంది నాయకులు కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేసినప్పటికీ.. ఆ తర్వాత కాలంలో వారి వారి రాజకీయ లబ్ది కోసం నూతన పార్టీలను ప్రారంభించాలని గుర్తు చేశారు. ఒకటి లేదా రెండు బలమైన జాతీయ పార్టీల ఆవశ్యకమైన నేపథ్యంలోనే స్వాతంత్ర్యానంతరం జనసంఘ్ పార్టీ పుట్టిందన్నారు. స్వాతంత్ర్యానంతరం భారతీయ జనసంఘ్ ,బీజేపీ జాతి ప్రయోజనాలకు కోసం ఎన్నో రకాల పోరాటాలు చేశాయి. ఆవిషయంలో మేమెంతో గర్వపడతాం. అందుకే బీజేపీకి దేశభక్తికి సంకేతమైన కాషాయ రంగును ఎంచుకున్నారు. ఒకానొక సమయంలోఎన్డీఏ కూటమి భాగస్వాములైన పార్టీలు(టీడీపీ సహా) బీజేపీతో తమ భేధాభిప్రాయాలను బయటపెట్టాయి. కానీనాటి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వ ఏర్పాటులో ఎన్ని అవాంతరాలెదురైనా అధిగమించారని గుర్తు చేసుకున్నారు. ప్రాంతీయ పార్టీలతో మమేకమై కూటమిని ఏర్పాటు చేయడంలోవాజ్‌పేయి కృషి చిరస్మరణీయమని కొనియాడారు. నాడు ఆయన కృషి ఫలితంగా దేశంలో ప్రాంతీయ పార్టీలకు కూడా ధీమా కలిగిందన్నారు. ప్రజాస్వామ్యం తమ నరనరాల్లో ఉందని.. అందుకే అందరికే కలిసిపోయి పాజిటివ్ ఆలోచనలు చేస్తున్నామని చెప్పారు. పార్టీ కొత్త భవనం పనుల కోసం కావచ్చు కానీ... దాని పరిధి మాత్రం దేశ సరిహద్దుల వరకు ఉంటుందన్నారు.కార్యకర్తలే పార్టీకి ఆత్మలాంటి వారిని మోడీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ బేరర్లు,కేంద్ర మంత్రులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన

నవీ ముంబయిలో అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. రూ.16వేల 700 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఈ ఎయిర్ పోర్టు పూర్తయితే 21 ఏళ్ల ముంబై వాసుల కల నెరువేరినట్లే. ఈ ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం 1997 లో ప్రతిపాదనలు వచ్చినా.. ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం చత్రపతి శివాజీ విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగిపోవడంతో కేంద్రం అంతర్జాతీయ ఎయిర్ పోర్టును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు వేగవంతం చేసింది.

7వేల 900 కోట్ల ప్రాజెక్టుకు ప్రధాని శ్రీకారం




నవీ ముంబై: దేశంలోనే అతిపెద్ద నౌకాశ్రయం జెఎన్‌పీటీ నాలుగవ టర్మినల్ ను ప్రధాని మోడీ జాతికి అంకితం చేశారు. 7వేల 900 కోట్ల విలువైన ఈప్రాజెక్టు ద్వారా దేశంలోనే అతిపెద్ద కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం కలిగిన కంటేనర్ పోర్టుగా జెఎన్‌పీటీ మరో రికార్డు సృష్టించింది. నాలువల టర్మినల్ ప్రాజెక్టుతో జేఎన్పీటీ సామర్థ్యాన్ని రెండింతలు కానుంది. ప్రస్తుతం జెఎన్పీటీ కంటైనర్ సామర్థ్యం 4.8 మిలియన్ స్టాండర్డ్ గా ఉండగా.. తాజాగా ప్రారంబించిన టెర్మినల్ తో మరో 2.4 మిలయన్ స్టాండర్డ్ కంటైనర్ యూనిట్లు సామర్థ్యం తోడైంది. రెండో దశ పనులు 2022 నాటికి పూర్తయితే మరో 2.4 మిలియన్ స్టాండర్డ్ కంటైనర్ యూనిట్ల సామర్థ్యం జెఎన్పీటీకి వస్తుంది..దీంతో దాదాపు 10 మిలియన్ల స్టాండర్డ్ కంటేనర్ యూనిట్ల సామర్థ్యం కలిగిన పోర్టుగా జెఎన్‌పీటీ... ప్రపంచంలోనే 33వ అతిపెద్ద పోర్ట్ గా రికార్డుకెక్కనుంది. ఎన్పీటీ ఫస్ట్ తొలిదశ నాలుగవ టర్మినల్ ప్రారంభించిన తర్వాత ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా మనకు చోటు కల్పించాలంటే జలమార్గాలను మరింతగా విస్తరించుకోవాల్సిన ఆవశ్యతక ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.

ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ ఆఫీస్

న్యూఢిల్లీలో ప్రధాని మోడీ ప్రారంభించిన బీజేపీ కేంద్ర కార్యాలయం ప్రపంచంలో అతిపెద్దదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. 1.70 లక్షల చదరపు గజాల స్థలంలో నిర్మించిన ఇంతపెద్ద కార్యాలయం ఏ ఇతర రాజకీయ పార్టీకి కూడా లేదని చెప్పుకొచ్చారు. దేశంలోని ప్రతీ జిల్లాలో బీజేపీకి సొంత ఆఫీసులున్నాయన్న షా..2015 లో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లోనే దేశంలోని 694 జిల్లాల్లో 635 పార్టీ కార్యాలయాలు నిర్మిం చాలని నిర్ణయించామన్నారు. కొత్త హెడ్ ఆఫీసును ఆధునిక హంగులతో రూపొందిం చామని..నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని ఛాంబర్లలో అందుబాటులో ఉంచామన్నారు. సోషల్ మీడియాకు కూడా ప్రత్యేక వింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

రాజ్‌నాథ్‌కు 10 మిలియన్ల ఫాలోవర్లు



న్యూఢిల్లీ: కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దేశంలో అత్యధిక ట్విట్టర్ ఫాలోవర్లు కలిగిన టాప్-5 నేతల్లో ఒకరుగా మారారు. రాజ్‌నాథ్ ట్విట్టర్‌ను ఫాలో అవుతున్నవారి సంఖ్య శనివారం రాత్రికి 10మిలియన్ల మార్కు దాటిందని హోంమంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. రాజ్‌నాథ్‌తో పాటు మరో నలుగురికి మాత్రమే 10మిలియన్ల దాటిన ఫాలోవర్లు ఉన్నారు. వీరిలో ప్రధాని నరేంద్ర మోదీ 40.3 మిలియన్ల ఫాలోవర్లతో ప్రథమ స్థానంలో ఉన్నారు. అనంతరం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ 13.3 మిలియన్ల ఫాలోవర్లతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. ఈయన తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 11.8 మిలియన్లతో తృతీయ స్థానంలో ఉన్నారు. ట్విటర్ వేదికగా చేసుకుని ఎంతోమంది బాధార్తులను ఆదుకొంటున్న భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ 11.8 మిలియన్లతో దేశవ్యాప్తంగా నాలుగోస్థానంలో నిలిచారు. టాప్-5లో ఐదోస్థానంలో కేంద్ర హోం మినిస్టర్ రాజ్‌నాథ్ నిలిచారు.

షరీఫ్ ఆస్తులు రూ.400 కోట్లు

- 18 ఏళ్ల కిందటే 58 మిలియన్లు



ఇస్లామాబాద్: పాకిస్థాన్‌కు చెందిన అవినీతి నిరోధకశాఖ మాజీ ప్రధాని షరీఫ్‌కు 18ఏళ్ల కిందటే 58మిలియన్ల డాలర్ల ఆస్తులు ఉన్నాయని కోర్టులో తెలిపిందని స్థానిక మీడియా తెలిపింది. నవాజ్ షరీఫ్ (68), అతని కుటుంబ సభ్యులపై మూడు అవినీతి కేసులు సుప్రీంకోర్టు ఆదేశంతో గత సెప్టెంబరు 8న నమోదు చేశారు. సుప్రీం తీర్పు తో షరీఫ్ ప్రధాని పదవికి అనర్హత పొందటంతో ఆయన పదవినుంచి తప్పుకున్న సంగతి విదితమే. కాగా ఈ కేసుపై తదుపరి విచారణ ఈ నెల 22న జరగనుంది.

ఎఫ్‌బీఐపై ట్రంప్ అసహనం



వెస్ట్‌పాం బీచ్: ఫ్లోరిడా స్కూలు కాల్పులు ఘటనలి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎఫ్‌బిఐ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కేసులో చాలా సంకేతాలు అందినా ఎఫ్‌బిఐ వాటిని పట్టించుకోలేదన్నారు. ఈసందర్భంగా ట్రంప్ శనివారం రాత్రి ట్విటర్ వేదికగా స్పందించారు. వారి పనితీరు సమంజసంగా లేదన్నారు. వారు సమయమంతా ఎన్నికల ప్రచారంలో రష్యా పాత్రపై దృష్టి కేంద్రీకరించేం దుకే వినియోగిస్తున్నారన్నారు. అయితే వారి ఆలోచిస్తున్నట్టుగా ఏ కుట్ర లేదన్నారు. ఇప్పటికైనా వారు తమ పనితీరుతో పూర్వవైభవాన్ని సాధించాలన్నా రు. ఇదిలా ఉండగా ఎఫ్‌బిఐ గతనెలలో ఫ్లోరిడా స్కూలు కాల్పుల కేసులో నిందితుడు ఈ దురాగతానికి పాల్పడబోతున్నట్టు ముందుగానే సమాచారం అందించినా వారు ఖాతరు చేయలేదు. ఎఫ్‌బిఐ అధికారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ అధికారులు సరైనవిధంగా దర్యాప్తు చేయటంలో విఫలమయ్యారని తెలిపారు. ఫ్లోరిడా గవర్నర్ రిక్ స్కాట్ ఎఫ్‌బిఐ డైరెక్టర్ క్రిస్టోఫర్ రేను పిలిచి రిజైన్ చేయవలసిందిగా కోరారు. ఇదిలా ఉండగా ఎఫ్‌బిఐకి ప్రధాన విమర్శకుడిగా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్నాడని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇరాన్‌లో విమానం కూలి.. 66మంది దుర్మరణం

టెహ్రాన్: ఇరాన్ పాసింజర్ విమానం కూలిపోవటంతో సిబ్బందితో సహా 66మంది ప్రయాణికులు మృతి చెందారు. ఈ ఘటనపై ఎయిర్‌లైన్స్ అధికారి మొహమ్మద్ టాబాత్బాయ్ మీడియాతో వెల్లడించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఈపీ 3704 విమానం టెహ్రాన్ నుంచి సుమారు 500కిలోమీటర్లు దూరంలో ఉన్న యసూజ్‌కు బయలుదేరిందన్నారు. ఎటీఆర్.72 డబుల్ ఇంజిన్‌గల ఈ విమానం 1993నుంచి సర్వీస్ చేస్తుందన్నారు.కాగా ఆదివారం టెహ్రాన్ నుంచి యసూజ్‌కు బయలుదేరిన 45నిమిషాల తరువాత రాడార్ తెర నుంచి విమానం అదృశ్యమైందన్నారు. ప్రమాద సమయంలో ఒక చిన్నారితో కలిసి మొత్తం 60మంది ప్రయాణికులు ఉన్నారన్నారు. వీరితోపాటు మరో 6మంది సిబ్బంది ఉన్నారన్నారు. అనంతరం విమానం కోసం గాలింపు చేపట్టగా దురదృష్టవశాత్తూ విమానం కూలిపోయిందని తెలిసిందని మొహమ్మద్ తెలిపారు. అయితే ఈ ఘటనలో మొత్తం అందరూ చనిపోయారని తెలిపిన ఆయన అనంతరం రక్షణ సిబ్బంది సంఘటన ప్రాంతానికి ఇంకా చేరుకోనందున విమానంలో ఉన్న 66మంది చనిపోయారని ఖచ్చితంగా నిర్ధారించి చెప్పలేమన్నారు. అత్యవసర సిబ్బంది నుంచి వైరుధ్యమైన నివేదికలు వస్తున్నాయన్నారు. విమానం కూలిపోయిన పర్వత శ్రేణుల్లోని వాతావరణం రక్షణ సిబ్బందికి ప్రతికూలంగా ఉందన్నారు. మంచు తుపాను కారణంగా అధికారులు పంపిన హెలికాప్టర్ ఘటన ప్రాంతానికి చేరుకోలేకపోయిందన్నారు. దీంతో కొన్ని రక్షణ దళాలును రోడ్డుమార్గంలో పంపించామన్నారు. 5రెస్క్యూ, రిలీఫ్‌టీమ్‌లు పనిచేస్తున్నాయన్నారు. కానీ వారు ఇప్పటికీ సంఘటన ప్రాంతానికి చేరుకోలేదన్నారు.

త్రిపుర పోలింగ్ 74%...

- గతంలో కంటే17 శాతం తగ్గిన పోలింగ్
- 59 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- మార్చి3న ఎన్నికల ఫలితాలు
- గెలుపుపై సీపీఎం, బీజేపీ ధీమా



పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్ల

అంబస్సా: కమ్యూనిస్టుల కంచుకోట త్రిపురలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా తగ్గింది. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో 91.82 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి 17 శాతం తగ్గి..74 శాతం నమోదైంది. ఎన్నికల ఫలితాలు మార్చి 3న ప్రకటిస్తారు. మొత్తం 60 అసెంబ్లీ నియోజక వర్గాలకుగాను 59 స్థానాల్లో పోలింగ్ జరిగింది.చరిలం సీపీఎం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి రామేంద్ర నారాయణ దేబ్ వారం రోజుల క్రితం మృతి చెందడంతో అక్కడ పోలింగ్ నిర్వహించలేదు. ఆ నియోజక వర్గానికి మార్చి 12న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ ఎన్నికల్లో మొత్తం 292 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 23మంది మహిళా నాయకులు కూడా ఉండటం విశేషం. పోలింగ్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 3వేల 174 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. గత 25 ఏళ్లుగా త్రిపుర అధికారాన్ని హస్త గతం చేసుకున్న వామపక్షాలు ఈసారి కూడా గెలుపుపై ధీమాగా ఉండగా.. బీజేపీ మాత్రం ఈసారి విజయం తమనే వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాని మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా త్రిపురలో ర్యాలీ, బహిరంగ సభలతో హోరెత్తించారు. అయితే గత ఎన్నికలకు ఈ ఎన్నికలకు తేడా ఉంటుందని బీజేపీ నాయకులు చెబుతున్నారు. మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం గిరిజనులకు పెద్దపీట వేస్తోందని.. త్రిపుర ప్రజలు వామపక్షాల పాలనలో విసిగిపోయారని అంటున్నారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటింగ్ శాతం 1.87. అయితే 2014 లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ గిరిజనులపై ప్రత్యేక శ్రద్ధపెట్టింది. దీంతో 2015 స్వయంప్రతిపత్తి జిల్లా మండలి ఎన్నికల్లో గతంలో కంటే మెరుగైన ఫలితాలను రాబట్టగలిగింది. అయితే త్రిపుర విభజన కోరుతున్న పార్టీలతో బీజేపీ జతకట్టింది.కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇటీవల పర్యటనలో త్రిపుర విభజన అంశాన్ని ఉన్నతస్థాయి కమిటీ వేసి పరిశీలిస్తామని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్నదే ఆసక్తికరంగా మారింది. కమ్యూనిస్ట్ లకు కంచుకోటగా చెప్పుకునే త్రిపురలో 20 స్థానాలు గిరిజనులు నివసించే ప్రాంతంలో ఉన్నాయి. ప్రతీసారి ఎన్నికల్లో గెలుపును ఈ స్థానాలే నిర్ణయిస్తాయి. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల ర్యాలీ నిర్వహించిన సంతిర్ బజార్‌లోనూ గిరిజనుల ఓటు అత్యధికం. ప్రస్తుతం త్రిపురలో అధికారంలో ఉన్న సీపీఎం మాత్రం మరోసారి విజయం తమదే అని ఢంకాబజాయిస్తోంది. ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ బీజేపీపై విమర్శలు గుప్పింస్తూ..కమలదళం తమ రాష్ట్రాన్ని విభజించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. వామపక్షాల ఆధ్వర్యంలోనే రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో వెలుగులు నింపాలమన్నారు. ఇతర రాష్ట్రాల్లోని వారికంటే తమ రాష్ట్రంలోని గిరిజనుల పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయన్నారు. త్రిపురలో మొత్తం 25 లక్షల 73వేల 413 మంది ఓటర్లుండగా.. పురుష ఓటర్ల సంఖ్య 13 లక్షల 5వేల 375 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 12 లక్షల 68వేల 27 మంది ఉన్నారు. థర్డ్ జెండర్‌లలో త్రిపుర దేశంలోనే 11 స్థానంతో 47వేల 803 మంది ఓటర్లను కలిగిఉంది.

హజ్ వాలంటీర్లుగా ట్రాన్స్ జెండర్లు

ఇస్లామాబాద్: హజ్ యాత్రికులకు సహాయ సహకారాలు అందించేందుకు పాకిస్తాన్ ట్రాన్స్ జెండర్లను పంపుతోంది. హజ్ వాలంటీర్లుగా ట్రాన్స్ జెండర్లు సేవలందించనుండడం చరిత్రలో ఇదే తొలిసారి. 2018 హజ్ యాత్రికుల సహాయాత్రం తమ దేశం నుంచి ట్రాన్స్ జెండర్లను పంపనున్నట్లు పాక్ ప్రకటించింది. బ్లూ వెయిన్స్ అనే ట్రాన్స్ జెండర్ సంక్షేమ సంస్థ ఈ విషయంలో సమన్వయ కర్తగా వ్యవహరిస్తుందని అధికారులు పేర్కొన్నారు. సౌదీ అరేబియా కు హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం ప్రతీ స్కౌటింగ్ కమ్యూనిటీలో ఇద్దరు నుంచి ముగ్గురు ట్రాన్స్ జెండర్లు ఉండారని తెలిపారు. సింధ్ ప్రావిన్స్ నుంచి 40 మంది ట్రాన్స్ జెండర్లను ఇప్పటికే పాకిస్తాన్ బాయ్స్ స్కౌట్స్ అసోసియేషన్‌కు ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు. ట్రాన్స్ జెండర్లపై సమాజంలో ఉన్న వ్యతిరేకత తొలగిపోయేందుకు ఇదొక రకంగా దోహదపడుతుందని పేర్కొన్నారు.

గెలుపు కోసం అత్తా, అల్లుళ్ల పోటాపోటీ



బోపాల్: మధ్యప్రదేశ్‌లోని కొలారాస్ ఉప ఎన్నికలు రసవత్తరంగా మారింది. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటు వేస్తే ప్రభుత్వ పథకాలకు దూరమౌతారని వివాదాస్పద వ్యాఖ్యలు ఛేసిన రాష్ట్ర మంత్రి యశోధరా రాజే అంతటితో ఆగకుండా ప్రచారంలో దూసుకుపోతున్నారు. 2008 ఎన్నికల్లో కొలారాస్ నుంచి గెలుపొందిన దేవేంద్ర జైన్‌కు ఓటేస్తే వన్ ప్లస్ వన్ ఎమ్మెల్యేలు వస్తారని పేర్కొన్నారు. ఒక ఎమ్మెల్యేకు ఓటు వేస్తే మరో ఎమ్మెల్యేఫ్రీ అని వ్యాఖ్యానించారు. తన మేనల్లుడు, కాంగ్రెస్ కీలక నాయకుడు జ్యోతిరాధిత్య సింధియాకు పోటీగా వసుంధర ప్రచారాన్ని నిర్వహించడం గమనార్హం. సాధారణంగా మధ్యప్రదేశ్ లో సింధియా కుటుంబీకులు రెండు వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ పోటాపోటీగా ప్రచారం చేసుకోరు. ఈనెల 24న జరగనున్న ఉప ఎన్నికల నేపథ్యంలో అత్త,అల్లుళ్లు పోటీ పడుతున్నారు.

ఇక వారి అనుమతి అవసరం లేదు..

రియాద్: సౌదీ అరేబియా మహిళలకు అక్కడి ప్రభుత్వం మరో శుభవార్తనందించింది. ఇక మీదట సౌదీ మహిళలు సొంతంగా వ్యాపారం చేసుకోవచ్చు. ఇందుకు అడ్డంకి ఉన్న నిబంధనలను ఎత్తివేస్తూ ప్రభుత్వ అధికారిక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు సౌదీ అరేబియాలో మహిళలు ఏదైనా వ్యాపారం చేయాలంటే భర్త,తండ్రి లేక సోదరుల అనుమతి అవసరం ఉండేది. కానీ ఇప్పుడు ఆ అవసరం లేకుండా ప్రభుత్వం నిబంధనలు సడలించింది. మహిళలు పురుషుల అనుమతి లేకుండా వ్యాపారం చేసుకోవచ్చని సౌదీ అరేబియా వాణిజ్యశాఖ ఉత్తర్వులిచ్చింది. ప్రైవేట్ రంగంలో కూడా మహిళలు రాణించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

చైనా దురాక్రమణపై ఫిలిప్పీన్స్ ఆగ్రహం



బీజింగ్: దక్షిణచైనా సముద్రంలో చైనా అనుసరిస్తున్న దురాక్ర మణ ధోరణిపై ఫిలిప్పీన్స్ ప్రజల్లో నిరసన వెల్లువెత్తుతోంది. దేశాధ్యక్షుడు రొడ్రిగో డుటెర్టే చైనాతో సంబంధాలను పునరుద్ధరించుకోవాలని చూస్తున్నా, ప్రజలు అందుకు ససేమిరా అంటున్నారు. స్వదేశం తీర ప్రాంతాన్ని రక్షించుకోవాలనీ, ఈ విషయంలో చైనాతో కరకుగా ఉండాల్సిందేనని రొడ్రిగోపై ప్రజలు ఒత్తిడి తెస్తున్నారు.ఆసియాలో అమెరికా వైఖరి ఏమిటో ఇదమిత్థంగా తెలియకపోవడంతో ఆగ్నేయాసియాలో తన ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు చైనా తీవ్రయత్నాలు సాగిస్తోం ది. ఆగ్నేయాసియా దేశాల సంఘానికి సింగపూర్ నేతృత్వం వహిస్తోంది.సింగపూర్ అమెరికాతోనూ, తైవాన్‌తోనూ సంబంధాలను మెరుగుపర్చుకుంటుండటం వల్ల చైనా, సింగపూర్‌ల మధ్య సంబంధాలు సజావుగా లేవు. అంతేకాక, దక్షిణ చైనా సముద్రంలో ఫిలిప్పీన్స్ హద్దుల విషయమై అంతర్జాతీయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పునకు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేయడంవల్ల కూడా సింగపూర్, చైనాల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగా ఉండేవి. ఇటీవల కాలంలో అవి క్రమంగా పుంజుకుంటున్నాయి.వివాదాస్పదమైన స్పార్ట్‌లీ దీవుల్లో చైనా 2,90,000 చదరపు మీటర్ల మేర తవ్వకాలు జరిపినట్టు వార్తలు వచ్చాయి. ఈ దీవులు తమవేనని ఫిలిప్పీన్స్‌తో సహా పలు దేశాలు ముందు నుంచి పేర్కొంటు న్నాయి. చైనా ఈ ప్రాంతంలో వ్యూహాత్మకంగా తన ప్రాబల్యాన్ని పెంచుకుంటోంది. పొరుగుదేశాలకు ఇది సవాల్‌గా పరిణ మించింది. ఈతవ్వకాలతో తమ హక్కును కోల్పోతామేమోనన్న ఆందోళన ఫిలిప్పీన్స్‌లో వ్యక్తమవుతోంది. చైనా తీరశాస్త్ర పరిశోధనలపై ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు కొత్త ఆంక్షలు విధించారు. ఈ ప్రాంతంలో వ్యూహాత్మక ప్రదేశాల్లో శాస్త్రీయ పరిశోధనల కోసం చైనా అనుమతులు కోరుతోంది. ఈప్రాంతం ఖనిజవనరులకు, మత్స్యసంపదకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలోకి చైనా ప్రవేశాన్ని ఫిలిప్పీన్ ప్రభుత్వమూ, ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారు. ఫిలిప్పీన్స్ రక్షణ మంత్రి డెల్ఫిన్ లోర్నెంజానా చైనా తవ్వకాల గురించి ప్రస్తావించి ఆందోళన వ్యక్తంచేశారు. చైనా ఉద్దేశ్యమేమిటో అంతుచిక్కడం లేదని అన్నారు. థిటూ ద్వీపంలోకి కూడా చైనా చొచ్చుకుని వచ్చే అవకాశం ఉన్నట్టు వార్తలు వచ్చాయని ఆయన చెప్పారు. వివాదాస్పదమైన స్పార్ట్ లీ ద్వీపంలో కూడా చైనా వైజ్ఞానిక పరిశోధనల పేరిట చొచ్చుకుని వచ్చే అవకాశాలు ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు డుటేర్టే చైనాతో సంబంధాలను పటిష్ఠపర్చుకోవాలని కోరుతున్నారు.

ఈ-వాలెట్ @ సమస్యలు

- 2016 నుండి పెరిగిన సైబర్ నేరాలు
- అవినీతిపరులకు కాసుల వర్షం
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



న్యూఢిల్లీ : పెద్ద నోట్ల రద్దు తరువాత డబ్బుల చెల్లింపుల విధానంలో చాలా మార్పులు వచ్చాయి. సాంకేతికతను ఉపయోగించుకుని నగదు చెల్లింపులు చేస్తున్నారు. జేబులో ఒక్క కార్డు లేదంటే ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు క్షణాల్లో మనం తీసుకున్న వస్తువుకు సంబంధించిన డబ్బులు విక్రయదారుడి ఖాతాలోకి జమ అవుతాయి. చిల్లర కష్టాలు ఉండవు.. పెద్ద మొత్తంలో నగదు పర్సులో పెట్టుకుని తిరుగుతుంటే ఎవరు ఎత్తుకెళ్తారో అనే భయమూ ఉండదు.. టెక్నాలజీ ప్రస్తుతం ఎంత ఉపయోకరంగా ఉందో అంతకంటే ఎక్కువ ప్రమాదకరంగా మారుతోంది. ఈ-వాలెట్ యాప్‌లు ప్రస్తుతం నగదు చెల్లింపుల విషయంలో అందుబాటులో వచ్చాయి. ఈవాలెట్‌ల వాడకాలు కొందరు అవినీతిపరులకు కాసుల వర్షం కురిపిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం.. సైబర్ నేరగాళ్లు అమాయకులనే లక్ష్యంగా చేసుకుని ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలియజేసింది. రూ.50వేల కంటే తక్కువ చెల్లింపుదారులు, అదేవిధంగా ఫోన్ ద్వారా నగదు ట్రాన్స్‌ఫర్ చేసే వారు అధికంగా సైబర్ నేరాల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. ఇలాంటి నేరాలపై నిఘా వేసి ఉంచాలని పలు రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఫిబ్రవరిలో సూచన చేసింది. సైబర్ నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని ఆదేశించింది. రూ.500, రూ.1000 నోట్లు రద్దు అయిన తరువాత డిజిటల్ లావాదేవీలు పెరగడంతో కంపెనీలు కూడా నెలవారీ నగదు చెల్లింపుల పరిమితి రూ.20వేలకు పెరిగింది.ఫ్రీచార్జ్ , మోబీక్విక్, పేటీఎం, పేయు మనీ వంటి ఎన్నో ఈవాలెట్‌లు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. ఈ కామర్స్ ఇండస్ట్రీలో ఇవి ఎంతో ప్రాధాన్యతను సంపాదిం చుకున్నాయి. ఫలితంగా సైబర్ నేరాలు కూడా పెరిగాయి. ఫోన్ తరహాలో అవినీతికి పాల్పడే వారి సంఖ్య పెరిగింది. కొందరు ఏటీఎం పిన్‌లు, వన్ టైం పాస్‌వర్డులు ఇతరులతో పంచుకోవడంతో కూడా ఈ తరహా నేరాలు పెరుగుతున్నాయి. రోజురోజుకు ఇలాంటి కేసుల నమోదు అధికం అవుతుండటంతో కేంద్ర హోంశాఖ మంత్రి గతేడాది సెప్టెంబర్‌లో సమీక్షసమావేశం నిర్వహించారు. వీరి ఆటలు అరికట్టడానికి ఫేక్ ఇండియన్ కరెన్సీ నోట్ కోఆర్డినేషన్ గ్రూపు (ఎఫ్‌సీఓఆర్‌డీ)ని తీసుకొచ్చి పలు రాష్ట్రాల్లో విచారణ ప్రారంభించింది. వెబ్‌తరహాలో హోంశాఖ అభివృద్ధి చెందేలా చేస్తూ.. నోడల్ అధికారులను రంగంలోకి దించింది. వ్యాలెట్ తరహాలో కంపెనీ ప్రతినిధులతో సంప్రదించి ఫోన్ ద్వారా జరిగే అవినీతిపై చర్చలు నిర్వహించింది. అంతర్ రాష్ట్ర నేరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు తప్పక దృష్టిసారించాల్సిన అవసరం ఉందని సలహా కమిటీ అభిప్రాయపడింది.



సాయిధరమ్‌తేజ్ కొత్త చిత్రం

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందబోయే నూతన చిత్రానికి సన్నాహాలు జరుగుతున్నాయి. శ్రీ బాలాజీ సినీ మీడియా పతాకంపై జె.భగవాన్, జె.పుల్లారావులు సంయుక్తంగా నిర్మించనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మే నుంచి మొదలుకానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, మాస్ కథాంశాలతో గుర్తింపు పొందిన సాయిధరమ్‌తేజ్, కమర్షియల్ చిత్రాల దర్శకుడిగా పేరుపొందిన గోపీచంద్ మలినేని కలయికలో ఈ చిత్రాన్ని రూపొందించబోవడం ఆనందంగా ఉంది. ఓ కొత్త జోనర్ చిత్రంగా ఈ సినిమా ఉండనుంది. ఇదివరకు సాయిధరమ్ చేయని కాన్సెప్ట్‌తో ఈ చిత్రం తెరకెక్కనుంది. తాజా సంగీత సంచలనం ఈ చిత్రానికి బాణీలను అందించనున్నారు. ప్రస్తుతం మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక జరుగుతోంది అని అన్నారు.


ఆత్మీయ సమావేశమే...



రజినీకాంత్, కమల్ హాసన్

దాదాపు నాలుగు దశాబ్దాలుగా రజినీ, కమల్ సూపర్‌స్టార్‌లుగా కొనసాగుతున్నారు. ఇప్పటికీ చిత్ర పరిశ్రమలో వాళ్ల స్థానం ప్రత్యేకం. వాణిజ్య విలువలున్న చిత్రాలతో స్టైలిష్ హీరోగా రజినీకాంత్ పేరు తెచ్చుకుంటే...ప్రయోగాత్మక, విభిన్న సినిమాలతో కమల్ ప్రేక్షకుల అభిమాన పాత్రుడయ్యారు. ఇక తాజాగా రాజకీయ అరంగేట్రం నేపథ్యంలోనూ వీళ్లిరివురూ పోటీ పడుతున్నారు. మంచి మిత్రులైనా...సినిమాల్లో అనివార్య పోటీ ఎలా సాగిందో...ఇకపై రాజకీయాల్లోనూ పోరు తప్పదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాళ్లిద్దరూ ఎక్కడ సమావేశమైనా ఆ సందర్భం ఆసక్తికరంగా మారుతోంది. తాజాగా కమల్ హాసన్ రజినీకాంత్‌ను కలిసి కొంతసేపు చర్చలు జరిపారు. ఇది రాజకీయవర్గాల్లో చర్చనీయంగా మారింది. కమల్ రజినీ సమావేశం ఆంతర్యం ఏంటన్నది ఊహిస్తున్నారు. రజినీని కలిసిన అనంతరం కమల్ హాసన్ మాట్లాడుతూ...ఇది వ్యక్తిగత సమావేశం మాత్రమేనని, ఎలాంటి రాజకీయ ప్రస్తావన రాలేదని చెప్పారు. కమల్ మాటల్లో వింటే....నేను సినిమాల్లోకి వచ్చే ముందు నా ఆత్మీయ మిత్రులను కలిసి ఇష్టా ఇష్టాలు తెలిపాను. ఇప్పుడూ అంతే, రాజకీయ రంగంలో అడుగుపెడుతున్నందుకు నా మిత్రుడైన రజినీని కలిసి మాట్లాడాను. మా చర్చలో రాజకీయాల అంశాలు లేవు. అన్నారు. త్వరలోనే కమల్ హాసన్ ప్రజలను కలిసేందుకు పర్యటనలు చేయనున్నారు. మధురైలో భారీ సభ జరిపేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఇప్పుడు ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తారు...!




మహేష్‌బాబు

సూపర్‌స్టార్ మహేష్‌బాబు నటనలో ప్రత్యేకత ఆయన సంభాషణలు చెప్పే విధానమే. అతి తక్కువ మాటలతో ఆకట్టుకునేలా నటిస్తారాయన. అయితే ఇది ఎప్పుడూ ఒకేలా ఉండదు. ఒక్కో చిత్రానికి తగినట్లు మార్పులు చేసుకుంటారు. ప్రస్తుతం మహేష్ నటిస్తున్న భరత్ అనే నేను చిత్రంలో సంభాషణలు చెప్పే తరహా పూర్తి భిన్నంగా ఉంటుందట. చేస్తున్నది రాజకీయ నాయకుడి పాత్ర కాబట్టి అందుకు తగినట్లే ప్రసంగాలు చేయాల్సి ఉంటుంది. గత చిత్రాల్లోలా నెమ్మదిగా కాకుండా స్వరం పెంచి సంభాషణలు చెబుతూ...తన రాజకీయ లక్ష్యాలను ప్రజలకు తెలిపే క్రమంలో మహేష్ ఎక్కువగా మాట్లాడాల్సిన అవసరం ఉంది. ఈ మాటలనే తనదైన శైలిలో కొత్తగా చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారట ఈ స్టార్ హీరో. భరత్ అనే నేను ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలో మహేష్ డబ్బింగ్ చెప్పబోతున్నారు. ముఖ్యమంత్రి పాత్ర కోసం సంభాషణలు పలికే విధానంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు మహేష్. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా వేసవికి విడుదల కానుంది. ఈ చిత్రం అనంతరం మహేష్ తన 25వ చిత్రంలో అడుగుపెడతారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కథతో దర్శకుడు వంశీ పైడిపల్లి ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. పూజా హెగ్డే నాయికగా ఎంపికైంది. న్యూయార్క్ లో ఎక్కువ భాగం చిత్రీకరణ చేయనున్నారు. మే చివరి వారంలో ప్రారంభమయ్యే మహేష్ 25వ సినిమా వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. దిల్‌రాజు, అశ్వనీదత్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.



టి.సుబ్బిరామిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యష్ చోప్రా స్మారక పురస్కారాన్ని ఈ ఏడాదికి ప్రముఖ గాయని ఆశాభోంస్లేకి అందజేశారు. ముంబైలోని ఓ స్టార్ హోటల్లో జరిగిన ఈ పురస్కార ప్రదాన కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, నటి రేఖ, జయప్రద, పరిణీతి చోప్రా తదితరులు పాల్గొన్నారు.

క్లైమాక్స్‌లో సాక్ష్యం



బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లంకొండ శ్రీనివాస్, పూజాహెగ్డే జంటగా శ్రీవాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం సాక్ష్యం. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ రామోజీ ఫిలింసిటీలో జరుగుతోంది. ప్రస్తుతం అక్కడ భారీగా నిర్మించిన సెట్లో క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరోవైపు నిర్మాణానంతర పనులు కూడా చకచకా సాగిపోతున్నాయి. ఈ విషయాన్ని చిత్రబృందం తెలియజేస్తూ...ఇటీవల ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదలచేసిన పోస్టర్‌కు విశేషమైన స్పందన లభించిందని చెప్పారు. మే 11న సినిమాను విడుదల చేయనున్నామని అన్నారు. ఇంతవరకు రామోజీ ఫిలింసిటీ, పొల్లాచ్చి, వారణాసి, హాస్‌పేట తదితర లొకేషన్లల్లో చిత్రీకరణ జరిపామని చెప్పారు. ఈ సినిమాలో ఫైట్స్ సీక్వెన్స్‌లకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. బెల్లంకొండ శ్రీనివాస్ లుక్ ఈ చిత్రంలో సరికొత్తగా ఉంటుందని అన్నారు. హీరోహీరోయిన్ల మధ్య సాగే రొమాంటిక్ సన్నివేశాలతో పాటు హీరో చేసే సాహసోపేతమైన సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పారు. ఫిలింసిటీలో షెడ్యూల్ అనంతరం మరో భారీ షెడ్యూల్‌ను అమెరికాలో జరపనున్నారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, బ్రహ్మాజీ, రవికిషన్, అశుతోష్‌రానా, పవిత్రలోకేష్, వెన్నెల కిషోర్, మధు గురుస్వామి, లావణ్య తదితరులు తారాగణం. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సినిమాటోగ్రఫీ: ఆర్థర్ ఎ.విల్సన్, సంగీతం: హర్షవర్ధన్, కళ: ఎ.ఎస్.ప్రకాష్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు.



రకుల్‌ప్రీత్‌సింగ్

నా వ్యాపారం కాపాడుకోవాలిగా...!

నాయికలకు స్వర్ణయుగం నిడివి చాలా తక్కువ. చూస్తుండగానే పలకరించి వెళ్లిపోతుంటుంది. రెండేళ్ల కిందట రకుల్‌తో ఇలాంటి అద్భుత సమయమే స్నేహం చేసింది. వరుసగా అగ్ర కథానాయకులతో నటించే అవకాశాలు దక్కాయి. వీటిలో ఆమె కలల కథానాయకులూ ఉన్నారు. ఈ నేపథ్యంలో విరామం లేకుండా నాలుగేళ్లు గడిచాయి. ఇంతలో కొత్త నాయికలు రావడం, రకుల్‌కు స్పైడర్ లాంటి ఊహించని అపజయం ఎదురవడం ఆమె క్రేజ్‌ను పూర్తిగా తగ్గించేసింది. దీంతో అనూహ్యంగా తెలుగులో అవకాశాలూ తగ్గిపోయాయి. తమిళం, బాలీవుడ్‌లో మాత్రం ఆమె గాలి వీస్తూనే ఉంది. తమిళంలో కార్తీతో మరో కొత్త చిత్రాన్ని, సూర్య, శివ కార్తికేయన్‌లతో సినిమాలు చేస్తోంది. ఇక హిందీలో ఆమె తాజా చిత్రం అయ్యారే మంచి విజయం దిశగా దూసుకెళుతోంది. అజయ్ దేవగణ్‌తో మరో చిత్రంలో ఎంపికైంది. ఇలా తమిళం, హిందీలో రకుల్ జోరు తగ్గలేదు. అయితే తనకు బాగా పేరు తీసుకొచ్చిన టాలీవుడ్‌లో సినిమాలు తగ్గడమే ఈ భామకు మింగుడుపడటం లేదు. అయితే ఈ పరిస్థితిని ముందే ఊహించానని చెబుతోంది రకుల్. ఎన్ని చిత్రాలు చేసిన...అవకాశాలు లేని రోజు రానే వస్తుందని తెలుసని అంటోంది. రకుల్ మాట్లాడుతూ....నేను బాలీవుడ్ చిత్రం యారియాన్ చేసి నాలుగేళ్లవుతోంది. మళ్లీ ఇంత కాలం తర్వాత అయ్యారేలో నటించాను. తెలుగులో అగ్ర కథానాయకుల సరసన వరుస సినిమాలు దక్కుతున్న సమయంలో హిందీలోనూ అవకాశాలు వచ్చాయి. అయితే ఒక్క హిందీ చిత్రం కోసం తెలుగులో అన్ని సినిమాలు పాడు చేసుకోవడం సరైంది కాదు అనిపించింది. ఈ ప్రాంతీయ భాషల్లో ఎన్నేళ్లు నటించినా...మళ్లీ బాలీవుడ్ చేరే రోజు వస్తుందని ముందే ఊహించాను. అనుకున్నట్లే ఇప్పుడు హిందీ చిత్రాలు చేస్తున్నాను. కేవలం కథ నచ్చి సినిమాలు చేస్తున్నానని చెప్పడం అబద్ధమే అవుతుంది. కాంబినేషన్, నిర్మాణ సంస్థ ఇవన్నీ చూసుకుంటాం. నాయికగా నా వ్యాపారాన్ని కాపాడుకోవాలంటే ఇవన్నీ తప్పవు. అని చెప్పింది.

కొత్తరకమైన హారర్ రా రా

- ప్రీ రిలీజ్ వేడుకలో శ్రీకాంత్



శ్రీకాంత్, నాజియా నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం రా రా. విజి చరిష్‌యూనిట్ దర్శకత్వంలో శ్రీమిత్ర చౌదరి సమర్పణలో విజి చెర్రీస్ విజన్స్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. కాగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా అతిథిగా పాల్గొన్న నాని మాట్లాడుతూ, నాకు అష్టాచమ్మా చిత్రం నుంచి శ్రీకాంత్‌గారితో మంచి పరిచయం ఉంది. నటుడిగా ఆయనేంటో అందరికీ తెలుసు. ఇప్పుడు హారర్ కథాంశంతో రూపొందిన ఈ చిత్రం చేశారు. ఈ సినిమా ఆయనకు మరో పెద్ద హిట్ చిత్రంగా నిలవాలని కోరుకుంటున్నా అని అన్నారు. మరో అతిథిగా విచ్చేసిన హీరో తరుణ్ మాట్లాడుతూ, శ్రీకాంత్‌గారి 125వ సినిమా ఇది. అందరూ హాస్యనటులు ఈ సినిమాలో నటించారు అని అన్నారు.

చిత్ర హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ, ఇది హాస్యంతో కూడుకున్న హారర్ థ్రిల్లర్. మనుషులకు, దెయ్యాలకు మధ్య సాగే సరదా ఆటలు సగటు సినిమా ప్రేక్షకుడ్ని వినోదంలో ముంచెత్తుతుంది. ఈ తరహా చిత్రాన్ని నేను తొలిసారి చేస్తున్నాను. తప్పకుండా ప్రేక్షకుల ఆదరణకు నోచుకుంటుందని ఆశిస్తున్నా. హారర్ సినిమాలు చాలానే ఉన్నా ఈ సబ్జెక్ట్ కొత్తగా ఉంటుంది. ఇలాంటి సినిమాను అభిరుచితో తీసిన నిర్మాతలకు ధన్యవాదాలు అని అన్నారు.

సమర్పకుడు శ్రీమిత్రచౌదరి మాట్లాడుతూ, శ్రీకాంత్‌తో దాదాపు పాతికేళ్ల అనుబంధం ఉంది. ఆయన నా సొంత సోదరుడితో సమానం. ఈ కథ విన్న తర్వాత విజయ్ దర్శకత్వం వహించాలని అనుకున్నాం. శ్రీకాంత్ వంటి సీనియర్ హీరో ఈ తరహా సినిమా చేయడం గొప్ప విషయం. సినిమా అందరికీ నచ్చేలా ఉంటుంది అని అన్నారు.

మరో నిర్మాత విజయ్ మాట్లాడుతూ, శ్రీకాంత్‌తో ఉన్న అనుబంధమే ఈ సినిమా చేయడానికి మమ్మల్ని ముందుకు నడిపించింది. అందరినీ ఆకట్టుకునేలా చిత్రం ఉంటుంది అని అన్నారు.

సంగీత దర్శకుడు షకీల్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ చిత్రానికి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు, హీరోకి ధన్యవాదలను తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సదానంద్, అశోక్, ప్రతాప్, హాస్యనటులు అలీ, రఘుబాబు, ఇంకా ఖయ్యూమ్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

అందరినీ అలరింపజేసేలా హైదరాబాద్ లవ్‌స్టోరీ

రాహుల్ రవీంద్రన్, రేష్మీ మీనన్ నాయకానాయికలుగా రూపొందిన చిత్రం హైదరాబాద్ లవ్‌స్టోరీ. రాజ్‌సత్య దర్శకుడు. ఎం.ఎల్.రాజు, ఆర్.ఎస్.కిషన్, వేణుగోపాల్ కొడుమగుల్ల నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ ఫ్యామిలీ ప్రేక్షకులతో పాటు యూత్‌ను సైతం ఎంతగానో అలరింపజేసింది. ప్రేక్షకులలో సినిమా పట్ల మంచి అంచనాలనే నెలకొల్పింది. సునీల్ కశ్యప్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది అని చెప్పారు.

దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, విభిన్నమైన, వైవిధ్యభరితమైన ప్రేమకథాచిత్రాలను ఆదరించే ప్రేక్షకులు ఈ చిత్రాన్ని కూడా చాలాబాగా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది అని అన్నారు.

ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో జియా, రావు రమేష్, సూర్య, సన తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: బి.వి.అమర్‌నాథ్, ఎడిటింగ్: ఎం.ఆర్.వర్మ.



రాహుల్ రవీంద్రన్, రేష్మీ మీనన్

క్రీడాప్రభ

పొట్టి సిరీస్‌లోనూ... అదేజోరు..



- తొలి టీ20లో సఫారీలు చిత్తు
- 28 పరుగుల తేడాతో కోహ్లీసేన
- ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ భువీ
- సిరీస్‌లో 1-0 అధిక్యంలో భారత్

ఫార్మాట్ మారింది.. వేదిక మారింది.. టీమిండియా జోరు మాత్రం తగ్గలేదు... సమరోత్సాహంతో కోహ్లీసేన రెచ్చిపోయింది.. టీ20 సిరీస్ ఆరంభ మ్యాచ్‌లోనే ఆతిథ్య జట్టును చిత్తుచేసింది. 23 పరుగుల తేడాతో తొలి మ్యాచ్‌ను గెలిచింది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అద్భుత

రోహిత్ ఔటైన తర్వాత బౌలర్లకు చుక్కలు చూపించే బాధ్యతను మరో ఓపెనర్ శిఖర్ ధావన్ తీసుకున్నాడు. వేగంగా అర్ధసెంచరీ చేసిన ధావన్, 39 బంతుల్లో 10 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 72పరుగులు చేశాడు. కెప్టెన్ కోహ్లీ, మనీశ్‌పాండే మెరుపులతో టీమిండియా 203 పరుగుల భారీ స్కోరు చేసింది.

జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి ట్వంటీ 20 మ్యాచ్‌లో టీమిండియా చెలరేగి ఆడింది. ఆరంభం నుంచి ఎదురుదాడికి దిగిన టీమిండియా సఫారీ బౌలర్లపై విరుచుకుపడింది. శిఖర్ ధావన్ (72- 10 ఫోర్లు, 2 సిక్సర్లు) హాఫ్ సెంచరీకి తోడు రోహిత్ శర్మ(21- 2 ఫోర్లు, 2 సిక్సర్లు), విరాట్ కోహ్లి (26 -2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడారు. దీంతో నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు చేసింది. ట్వంటీ 20ల్లో దక్షిణాఫ్రికాపై భారత్ కిదే అత్యధిక స్కోరు. 204 పరుగుల లక్ష్య ఛేదనతో బ్యాటింగ్ ప్రారంభించిన సఫారీల దూకుడుకు భువనేశ్వర్ కుమార్ కళ్లెం వేశాడు. తొమ్మిది పరుగుల వ్యవధిలో రెండు వికెట్లు తీశాడు. మట్స్, డుమినిలను తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేర్చాడు. కష్టాల్లో పడిన జట్టును హెడ్రిక్స్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. అవతలివైపు నుంచి కానీ అతనికి సరైన సహకారం కరువైంది. డుమిని, మిల్లర్, బెహర్డీన్, కాస్లీన్ తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. దీంతో నిర్ణీత ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 175 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్లలో భువీ ఐదు వికెట్లు పడగొట్టగా, హార్దిక్ పాండ్యా, ఉనద్కత్, చాహల్‌కు ఒక్కో వికెట్ లభించింది.



అంతకు ముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ దిగిన టీమిండియా ఇన్నింగ్స్‌ను శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు ధాటిగా ఆరంభించారు. తొలి బంతి నుంచే రోహిత్ శర్మ దూకుడు ప్రదర్శించాడు. ప్యాటర్సన్ వేసిన మొదటి ఓవర్‌లో రెండు సిక్సర్లు, ఫోర్ బాదేశాడు. దాంతో తొలి ఓవర్‌లోనే భారత్ 18 పరుగుల్ని రాబట్టింది. అదే ఊపును రెండో ఓవర్‌లో కూడా కొనసాగించే క్రమంలో రోహిత్ అవుటయ్యాడు. డాలా వేసిన రెండో ఓవర్ ఐదో బంతికి కీపర్ క్యాచ్ ఇచ్చి రోహిత్ పెవిలియన్ బాటపట్టాడు. చాలా కాలం తర్వాత జట్టులోకి వచ్చిన సురేశ్ రైనా వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చాడు. దూకుడుగా ఆడే ప్రయత్నంలో త్వరగా ఔటయ్యాడు. ఏడు బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 15 పరుగులు చేశాడు. ఏడు పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఒకసారి అవుటయ్యే ప్రమాదం నుంచి బయటపడినప్పటికీ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయాడు. కొద్దిసేపటికే డాలా బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి అతడికే రిటన్ క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు.

ధావన్‌కు జత కలిసిన కెప్టెన్ కోహ్లీ మరో వికెట్ పడకుండా ఇన్నింగ్స్ నిర్మించే బాధ్యత చేపట్టాడు. ఈజోడీ నిలదొక్కుకుందని అనిపించిన సమయంలో సఫారీలు దెబ్బతీశారు. జోరుమీదున్న కోహ్లీని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నారు. షమ్సి బౌలింగ్‌లో ఎల్బీగా అవుటై, మూడో వికెట్ రూపంలో పెవిలియన్ చేరాడు. అప్పటికి భారత జట్టు స్కోరు 108 పరుగులు. మరోవైపు ధావన్ మాత్రం నిలకడగా ఆడుతూ 27 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. 39 బంతుల్లో 72 పరుగులు సాధించిన ధావన్, 15వ ఓవర్లో ఫ్లెహకోహియో బౌలింగ్‌లో అవుటయ్యాడు. ఆ ఓవర్ నాల్గో బంతిని వికెట్ల వెనక్కిహిట్ చేయబోయి కీపర్‌కు సునాయస క్యాచ్ ఇచ్చాడు. ఇక ధోని (16) కూడా త్వరగానే ఔటయ్యాడు. చివర్లో మనీష్ పాండే (29 నాటౌట్), హార్దిక్ పాండ్యా (13 నాటౌట్)లు జట్టు స్కోరును రెండొందలు దాటించారు. సఫారీ బౌలర్లలో డాలా రెండు వికెట్లు సాధించగా, మోరిస్, షమ్సీ, ఫ్లెహకోహియోలకు తలో వికెట్ దక్కింది.


సఫారీ అమ్మాయిలు గెలిచారు

- 5 వికెట్ల తేడాతో 3వ టీ20లో ద. ఆఫ్రికా విజయం
- సిరీస్ ఆశలు సజీవం

జోహన్స్‌బర్గ్: మూడవ టీ20 మ్యాచ్ నెగ్గి, సిరీస్‌ను దక్కించుకోవాలన్న భారత మహిళల క్రికెట్ జట్టు ఆశలు నెర వేరలేదు. కీలక మ్యాచ్‌లో సఫారీ మహిళలు పోరాటం వారిని విజేత లుగా నిలిపింది. సిరీస్ కోల్పోయే ప్రమాదం నుంచిబయటపడేసింది. సఫారీ జట్టులో ఓపెనర్ లిజెల్లీ (5) త్వరగా ఔటైనప్పటికీ, డాన్ వాన్ నీకెర్క్ (26), సున్‌లుస్ (41), ట్రయాన్ (34) రాణించడంతో ఆతిథ్య జట్టు విజయం సాధించింది. వాన్‌నీకెర్క్ నిష్క్రమించినా, లూస్- మిగ్నన్ డు ప్రీజ్ జంట విలువైన 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. భారత బౌలర్లలో పేసర్ పూజా వస్త్రాకర్ 21 పరుగులిచ్చి రెండు వికెట్లు సాధించింది. మరోవైపు ఆఫ్‌స్పిన్నర్ అనుజా పాటిల్ ధారాళంగా పరుగులు సమర్పించుకుంది. నాలుగు ఓవర్లలో 44 పరుగులివ్వడం ఓటమికి దారితీసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు ప్రారంభంలోనే గట్టిదెబ్బ తగిలింది. స్కోరు బోర్డుపై పరుగుల ఖాతా తెరవక ముందే తొలి వికెట్ పడింది. ఓపెనర్ మిథాలీ రాజ్ డకౌట్ అయింది. ఈ దశలో స్మృతి మంధాన (37), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (48) బ్యాట్ ఝులిపించ డంతో భారత జట్టు గౌరవప్రద స్కోరు చేయగలిగింది. వీరిద్దరు రెండవ వికెట్‌కు వేగంగా 55 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మిగతా బ్యాట్స్‌మన్ వైఫల్యంతో తక్కువస్కోరుకే పరిమితం అయింది. ద.ఆఫ్రికా బౌలర్ షబ్నిమ్ 30 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టింది. దీంతో పూర్తి ఓవర్లు ఆడకుండానే, 17.5 ఓవర్లలో 133 పరుగులకు ఇండియా చాపచుట్టేసింది. 134 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు గెలుపుకోసం చెమటోడ్చాల్సి వచ్చింది. చివరకు 19 ఓవర్లో లక్ష్యాన్ని చేరుకుంది. ఐదు వికెట్లతో సిరీస్‌లో గెలుపు బోణీ చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇండియా 2-1 ఆధిక్యంతోఉంది. నాలుగవ టీ20 బుధవారం సెంచూరియన్ మైదానంలో జరుగుతుంది.

ఔరా.. బుమ్రా

బౌండరీ లైన్‌పై అద్భుత ఫీట్



జస్ప్రీత్ బుమ్రా కళ్లు చెదిరే ఫీల్డింగ్ విన్యాసం చేశాడు. సఫారీ బ్యాట్స్‌మన్ డేవిడ్ మిల్లర్ కొట్టిన భారీ షాట్‌ను ఆపే యత్నంలో బౌండరీ లైన్‌పై చేసిన ఫీట్ అబ్బురపరిచింది. దక్షిణాఫ్రికా లక్ష్య ఛేదనలో భాగంగా భారత బౌలర్ హార్దిక్ పాండ్యా వేసిన ఏడో ఓవర్ తొలి బంతిని మిల్లర్ మిడిల్ అండ్ లెగ్ మీదుగా షాట్ కొట్టాడు. అయితే ఆ సమయంలో బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న బూమ్రా గాల్లోకి ఎగురుతూ బంతిని పట్టుకున్నాడు. అయితే బ్యాలెన్స్ చేసుకునే క్రమంలో బంతిని విసిరేసి బౌండరీ లైన్‌పై పడ్డాడు. కానీ అది సిక్సర్‌గా థర్డ్ అంపైర్ ప్రకటించాడు. ఇటీవల క్రికెట్‌లో సరళీకరించిన నిబంధనల ప్రకారం తొలుత ఒకసారి బౌండరీ లైన్ తాకి ఆపై గాల్లో క్యాచ్ పట్టి విసిరేసినా అది సిక్సర్‌గానే పరిగణి స్తారు. దాంతో ఒకింత నిరాశ అనిపించనప్పటికీ, బూమ్రా అసాధారణ రీతిలో బంతిని అందుకోవడం క్రికెట్ అభిమానుల్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది.

స్కోరుబోర్డు

ఇండియా: రోహిత్ శర్మ - (సి) క్లాసీన్ (బి) డాలా 21, శిఖర్‌ధావన్ (సి) క్లాసీన్ (బి)ఫ్లెహకోహియో 72, రైనా (సి) (బి) డాలా 15, కోహ్లి (ఎల్‌బీడబ్ల్యూ) బి- షాంసి 26, మనీష్‌పాండే (నాటౌట్) 26, ఎంఎస్ ధోని (బి) మోరిస్ 16, హార్దిక్ పాండ్యా (నాటౌట్) 13. ఎక్స్‌ట్రాలు 11. మొత్తం 203/5 (20 ఓవర్లు), **ద.ఆఫ్రికా బౌలింగ్:** పీటర్సన్ 4-0-48-0, జూనియర్ డాలా 4-0-47-2, క్రిస్ మోరిస్ 4-0-39-1, షాంసి 4-0-37-1, జేటీ మట్స్ 2-0-14-0, ఫ్లెహకోహియో 2-0-16-1, **ద.ఆఫ్రికా:** జేజే మట్స్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 14, హెడ్రిక్స్ (సి) ధోని (బి) భువనేశ్వర్ 70, పాల్ డుమిని (సి) రైనా (బి) భువనేశ్వర్ 3, డేవిడ్ మిల్లర్ (సి) ధావన్ (బి), హార్దిక్ పాం డ్యా 9, ఫర్హాన్ బెహార్డిన్ (సి) మనీశ్ పాండే (బి) చాహల్ 39, క్లాసీన్ (సి) రైనా, (బి) భువనేశ్వర్ 16, ఆండిల్ ఫ్లెహుకోయో (సి) చాహల్ (బి) ఉనద్కత్ 13, క్రిస్ మోరిస్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 0, పాటెర్సన్ (నాటౌట్) 2, షాంసి (నాటౌట్) 0. ఎక్స్‌ట్రాలు 8. స్కోరు 175/8 (20ఓవర్లు)., **బౌలింగ్:** భువనేశ్వర్ కుమార్ 4-0-24-5, జయదేవ్ ఉనద్కత్ 4-0-33-1, బుమ్రా 4-0-32-0, హార్దిక్ పాండ్యా 4-0-45-1, యుజ్వేంద్ర చాహల్ 4-0-39-1.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.